www.jagritiweekly.com

సంపుటి : 76 సంచిక : 12 పుటలు : 52

# జాగృతి

వెల : ₹20/-

కలి 5125 - శ్రీ శోభకృత్ పుష్య బహుళ చవితి

29 జనవరి-04 ఫిబ్రవరి 2024



## అవి పరమ వైభవ క్షణాలు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# శ్రీశైల దేవస్థానం - గోసంరక్షణ పథకం





గోవు సకల దేవతాస్వరూపమని వేదాలు, వేదాలకు ప్రతిరూపమని పురాణాలు చెబుతున్నాయి. గోవు దేవతా స్వరూపమేగాక, ధర్మానికి ప్రతిరూపమని హైందవ భావన. అందుకే మన సంస్కృతిలో గోవును పూజించటం కేవలం భగవంతుని సేవగానే కాకుండా, ఒక పవిత్ర సంప్రదాయంగా కూడా కొనసాగుతోంది. భక్తుల్లో మన ఆర్ష సంప్రదాయాలను కొనసాగింపజేసి తద్వారా వారిలో భక్తి, ఆధ్యాత్మిక భావాలను, ధర్మచింతనను పెంపొందింపజేయాలనే ఆశయంతో దేవస్థానం గోశాలను ఏర్పాటుచేసి, గోవులను పోషిస్తోంది. ప్రస్తుతం 800లకు పైగా గోవులు దేవస్థానంచే పోషింపబడుతున్నాయి. గోవుల పరిరక్షణ కోసం దేవస్థానం అధునాతన ఏర్పాట్లతో గో సంరక్షణశాలను నిర్వహిస్తోంది. ఈ గోవుల పోషణలో భక్తులకు కూడా అవకాశాన్ని కల్పించాలననే భావనతో దేవస్థానం గో సంరక్షణ పథకాన్ని ప్రవేశపెట్టింది.

## ఈ పథకంలో

- ఈ పథకంలో గోవుల పోషణ కోసం కనీసం రూ.1000లు పైన ఆపైన ఎంత మొత్తాన్నైనా విరాళంగా చెల్లించవచ్చు.
- ఈ పథకానికి రూ. 1లక్ష, ఆపైన చెల్లించిన వారిని ప్రత్యేకదాతలుగా గుర్తిస్తూ, గుర్తింపు కార్డునిచ్చి, నిబంధనల మేరకు వారికి ఆయా సదుపాయాలు కల్పించబడుతాయి.
- దాతలు గోవులపోషణ కోసం గ్రాసాన్ని (ఎండు లేదా పచ్చిగడ్డిని, వరి లేదా జొన్నచొప్పను) దాణాను కూడా సమర్పించవచ్చు.
- ఒక లారీ లేదా అంతకంటే ఎక్కువ గ్రాసాన్ని సమర్పించే పక్షంలో గ్రాసాన్ని శ్రీశైలానికి చేరవేసేందుకు దేవస్థానమే రవాణా సదుపాయాన్ని కల్పిస్తుంది.
- భక్తులు రూ.300 లు చెల్లించి తమ గోత్రనామాలతో ఆలయ ప్రాంగణంలో గోమాతను ప్రత్యక్షంగా పూజించుకోవచ్చు.
- దేవస్థానపు గోవుల నుండి వచ్చే క్షీరాన్ని ప్రతినిత్యం శ్రీస్వామివార్ల అభిషేకానికి వినియోగించడం జరుగుతుంది. కాబట్టి గో సంరక్షణకు విరాళాలు చెల్లించిన వారికి శ్రీస్వామివార్ల అభిషేక ఫలం కూడా పరోక్షంగా లభిస్తుంది.
- చెల్లింపులను కార్యనిర్వహణాధికారి, శ్రీశైల దేవస్థానం, శ్రీశైలం వారి పేర చేయవచ్చును.

**శ్రీశైల మహాక్షేత్రంలో ఏ పుణ్యకార్యం చేసినా వేయింత ఫలం లభిస్తుందనే పురాణ వచనాన్ని మరువకండి**

## ఇతర వివరములకు


దేవస్థానం సమాచార కేంద్రం ఫోన్ నెంబర్లు : **83339 01351/52/53** లను సంప్రదించండి.

దేవస్థానానికి చెల్లించే అన్ని విరాళాలకు ఆదాయపు పన్ను నుండి సెక్షన్ '80G' క్రింద మినహాయింపు కలదు.

రెడ్డివారి చక్రపాణిరెడ్డి
ధర్మకర్తల మండలి అధ్యక్షులు

డి. పెద్దిరాజు
కార్యనిర్వహణాధికారి

# జాగృతి.. ఒక మేలుకొలుపు.. ఒక వేకువ పిలుపు..




## జాగృతిని చదువుదాం.. చదివిద్దాం..
## జాతీయ భావనను బలోపేతం చేద్దాం..
## సాంస్కృతిక వారసత్వాన్ని నిలుపుకుందాం..




**జాగృతి చందాను ఆన్‌లైన్‌లో**
**మీ మొబైల్ నుంచి చెల్లించడానికి**
**ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను**
**గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.**
**లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.**

సంవత్సర చందా రూ.850/-
**http://payit.cc/S18970**

**విడి ప్రతి రూ.20/-**

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-
**http://payit.cc/S18973**

## రిజిస్టర్డ్ పార్సిల్ సదుపాయం కోసం...

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/- + మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ. 624/- )

**వెల : రూ.1474/-**
https://payit.cc/S32796

**సూచనలు :**

☞ మీ చందాని చెల్లించేటప్పుడు పూర్తి చిరునామాని పిన్‌కోడ్, ఫోన్ నెం.తో సహా వ్రాయాలి.

☞ తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీ ఫోన్ కి CP-JAGRIT అనే ఐ.డి.తో ఎస్.ఎమ్.ఎస్. వస్తుంది. ఆ వెంటనే పత్రిక అందుతుంది.

☞ పత్రిక అందకపోయినా, మీ చిరునామాలో తేడాలున్నా మీ చందా నెం. లేదా ఫోన్ నెం. వివరాలతో మా కార్యాలయానికి ఉ॥11 గంటల నుండి సా॥6 గంటల మధ్య ఫోన్ చేయగలరు.

Bank A/c details :
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch,
Hyderabad
IFSC : UTIB0002157,
PAN : AAATJ3829L

**ఇతర వివరాలకు సంప్రదించండి**
**సర్క్యులేషన్ మేనేజర్ : 040-27561453 / 9959997013**

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ



రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్‌తో జాగృతి ముఖాముఖి

12లో

## అయోధ్య ఆత్మగౌరవానికి సంబంధించినదని దేశం గుర్తించింది!

ఐదు వందల సంవత్సరాల హిందువుల ధార్మిక పోరాటానికి పరాకాష్ఠ అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం. అన్ని అవాంతరాలు అధిగమించి ఇప్పుడు ఆలయ నిర్మాణ స్వప్నం సాకారమైంది. ఈ మహత్కార్యంలో కీలకంగా ఉన్నవారే చంపత్‌రాయ్.

అయోధ్యలో నిర్మించుకున్న భవ్య మందిరంలోకి బాలరాముని ప్రవేశం నభూతో నభవిష్యతి అన్న రీతిలోనే జరిగింది. ఇది అనూహ్యం కాదు. ఐదు వందల ఏళ్ల తరువాత హిందూ సమాజం సాధించిన తొలి సాంస్కృతిక ఘన విజయమిది. కార్యక్రమంలో అగ్రభాగాన నిలిచిన వారందరి మాటలలోను ఇదే వ్యక్తమయింది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా దాదాపు హిందువులంతా స్పందించారు. రామభక్తులే కాదు, సంఘ పరివార్ సభ్యులే కాదు, అయోధ్య ప్రజలే కాదు, యావద్భారతదేశం, ఎన్నో దేశాల ప్రజలు కూడా ఈ ఉత్సవంతో మమేకమయ్యారు. రాముడు భారతీయ ఆత్మ. రాముని జీవితం ఈ చరిత్రను నడిపించింది. రామగాథ స్పర్శ భారతదేశంలోని అణువణువు లోను ఉంది. అయోధ్యలో జరుగుతున్న కార్యక్రమమని అనుకోకుండా, ప్రధాని పిలుపునివ్వగానే భారతీయులు ప్రాణప్రతిష్ఠ జరిగిన జనవరి 22వ తేదీని రెండో దీపావళిగా జరుపుకున్నారు. ఒక్క అయోధ్యలోనే 14 లక్షల దీపాలు వెలిగాయి. ప్రాణప్రతిష్ఠ సందర్భం కోసం ప్రత్యేకంగా రూపొందించిన చక్కని పతాకాలు హిందూ దేవాలయాల మీద దర్శనమిచ్చాయి. ఇళ్ల మీద రెపరెపలాడాయి. వాహనాల మీద కనిపించాయి. వీధులను అలంకరించాయి.

రాముడు భారతీయుల ఆరాధ్యదైవం. ఆయన పేరు సమాజాన్ని విడదీయదు. కలుపుతుంది. అడుగులో అడుగు కలిపి నడిచేటట్టు చేస్తుంది. జనవరి 22న అయోధ్యలో కనిపించిన దృశ్యం ఇదే. సిక్కులు, ముస్లింలు కూడా ఈ ఉత్సవంలో భాగస్వాములయ్యారు. వయసుతో నిమిత్తం లేకుండా భారతీయులంతా ప్రాణప్రతిష్ట స్ఫూర్తిని అర్థం చేసుకున్నారు. రామనామం భారతీయతకు అంతస్సూత్రమేనని ఈ ఉత్సవం నిరూపించింది.

రామమందిరాన్ని జాతి ఆత్మ గౌరవాలయంగానే భావిస్తూ నిర్మించిన సంగతిని విస్మరించలేం. అసలు అంత పెద్ద పోరాటం అందుకే కూడా. రాముడు బడుగువర్గాల ఉనికిని ఆమోదించాడు. శబరి, గుహుడు అలాంటివారే. ఆయన పశుపక్ష్యాదులను ప్రేమించాడు. జటాయు ఉదంతం ఎంత గొప్పది! ఎందుకు మీడియా పెద్దగా పట్టించుకోలేదో తెలియదు. కానీ

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ పుష్య బహుళ చవితి**

### *లోపలి పేజీలలో...*




ముఖపత్ర కథనం
**అవి పరమ వైభవ క్షణాలు** 6లో



**రామభక్తి అంటే నిప్పు కాదు నిర్మాణం** 09లో



**జాతి గౌరవాన్ని జాగృత పరిచే ఘట్టం** 11లో

# జాగృతి

## సంపాదకీయం

ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలలో పాల్గొన్న పదహారు మంది కర్తలలో కాశీ కాటికాపరి ఒకరు. అందరిలోను దైవాన్ని చూడడమే మన ధర్మం. ప్రాణప్రతిష్ఠ తరువాత రాముడికి ప్రణమిల్లడమంటే సనాతన ధర్మానికి ప్రణమిల్లడమేనని అంతా భావించారు.

ఇంత మహోత్సవం జరిగినా, అందులో అంత హిందూ భావన వెల్లువెత్తినా పరమతాల గురించి చెడు ప్రస్తావన లేదు. వారి ప్రార్థనాస్థలాలకు నష్టం జరగలేదు. ఇది చెప్పుకోదగిన విషయం. హిందూధర్మం డీఎన్ఏ ఇది. నిజానికి అయోధ్యలో డిసెంబర్ 6, 1992న వివాదాస్పద కట్టడం తప్ప మరొక ముస్లిం

# నవయుగానికి నాంది

ప్రార్థనాలయం జోలికి ఎవరూ పోలేదు. ఇప్పుడూ అదే జరిగింది. అన్నివేల మంది అయోధ్యకు చేరినా, అందరిలోను హిందుత్వ భావన ఉన్నా ఆవేశాలు ప్రదర్శించలేదు. గతాన్ని తవ్వుకోలేదు. కరసేవకులకు నివాళి ఘటించడం తప్ప మరొక ప్రస్తావనే రాలేదు. గోధ్రా ఉదంతాన్నీ, కట్టడం కూల్చివేతకు ప్రతీకారం పేరుతో తరువాత దేశంలో జరిగిన మారణహోమాన్నీ ఎవరూ గుర్తు చేసుకోలేదు.

కానీ హిందువుల ఓర్పును, సామరస్యాన్ని ఇప్పటికీ సెక్యులరిస్టులు, ఉదారవాదులు గుర్తించడానికి నిరాకరిస్తున్నారు. మరో రోజే దొరకనట్టు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సర్వమత సామరస్య యాత్రను కోల్‌కతాలో నిర్వహించారు. యథాప్రకారం, బీజేపీ మతాన్ని రాజకీయం చేస్తున్నదని వాచాలత ప్రదర్శించారు. అస్సాంలోనే ఉన్న రాహుల్ గాంధీని వేళకాని వేళ వచ్చినందుకు ఒక ఆలయంలోకి అనుమతించకపోతే, దానిని రాజకీయం చేశారు. దేశంలో ఏ హిందూ దేవాలయానికి వెళ్లాలన్నా నరేంద్ర మోదీ అనుమతి కావాలా అంటూ రచ్చ చేశారు. ఆ విధంగా కాంగ్రెస్ తనను తాను ఎంత దిగజార్చు కుంటున్నదో మరొకసారి రుజువయింది. వివాదాస్పద కట్టడం కేసులో సున్నీ వక్ఫ్ బోర్డ్ తరఫున వాదించిన న్యాయవాది రాజీవ్ ధావన్ భారత్ హిందూ రాష్ట్రం దిశగా అడుగులు శరవేగంగా వేస్తున్నదని వ్యాఖ్యానించడం అసంబద్ధమే. అయితే ప్రతికక్షి ఇక్బాల్ అన్సారీ మాత్రం ఉత్సవానికి హాజరయ్యారు. హుందాగా వ్యవహరించారు. శివమొగ్గ ప్రాంతంలో జైశ్రీరాం అంటూ నినదిస్తున్న రామభక్తులకు అడ్డం వచ్చి ఒక ముస్లిం మహిళ అల్లాహొ అక్బర్ అని నినాదం ఇవ్వడం, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం అవాంఛనీయ పరిణామమే. అయోధ్య ఉత్సవంతో ఇతర మతాల వారు భయపడిపోయారని కొందరు వాపోయారు. ముస్లింలెవరూ అడక్కుండా అద్వాన్సుగా వారే క్షమాపణలూ చెప్పేశారు. పాకిస్తాన్ అయితే అయోధ్య మందిరం ప్రారంభోత్స వంతో ముస్లింలలో భయాందోళనలు మరింత పెరిగాయని తేల్చేసింది.

అయోధ్యలోని నాటి వివాదాస్పద కట్టడం గురించి భారత చరిత్రకారులు కొందరు చెప్పిన అబద్ధాలు మనకి తెలుసు. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టులు చేసిన దుష్ప్రచారం గురించి ఎరుకే. ఒక వర్గం మీడియా చేసిన ద్రోహం కూడా తెలియనిదికాదు. నాటి దుస్థితినే ఇంకా కొనసాగించాలని కొందరు అనుకుంటున్నట్టు ఈ పరిణామాలన్నీ వెల్లడిస్తున్నాయి. కాబట్టి రామమందిరం స్ఫూర్తిగా హిందువులు మరింత ఐక్యం కావలసిన అవసరమే కనిపిస్తున్నది. ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ డా. భాగవత్ గతాన్ని మరచి ఇక ఐక్యంగా దేశాభివృద్ధికి అంతా కలసి పాటు పడదామని పిలుపునిస్తున్నారు. కానీ ఇలాంటి మంచి ఆలోచన ఇప్పటికీ కొందరిలో రావడం లేదని అర్థమవుతున్నది. జనవరి 22 నాటి ప్రాణప్రతిష్ఠకు సానుకూలంగా స్పందించలేకపోతే, ఇక దేశం కోసం స్పందించే గుణం అలాంటి వారి నుంచి ఆశించనక్కరలేదని ఒక టీవీ వ్యాఖ్యాత అన్నారు. ఇది నిజమే. కానీ ఎవరు ఏం చెప్పినా అయోధ్య మందిరం దేశంలో కొత్త యుగాన్ని తీసుకురావడం తథ్యం. ★

29 జనవరి 2024, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



మహా నిర్మాణం వెనుక

14లో



గేయం

నీ ప్రతిష్ఠతో క్రొత్తవెలుగు రానీ

జొన్నవిత్తుల

21లో



భారతీయ జీవనం రామాయణం

32లో


| | | |
|---|---|---|
| జగమంతా ప్రాణప్రతిష్ఠ వేడుక | – | 18 |
| శ్రీరామసేవలో ఉడుతా భక్తిగా | – | 20 |
| జన్మనక్షత్రాలు ప్రవర్తనలూ | – | 22 |
| అయోధ్య : హిందువుల విశ్వ రాజధాని | – | 24 |
| ప్రతి రేణువులోను రామనామమే | – | 26 |
| 'రాముడిని నిలిపి.. ధర్మాన్ని నిలబెట్టుకున్నాం' | – | 28 |
| పునరుజ్జీవన రథచక్రాల కింద వక్రభాష్యాల కకావికలు | – | 30 |
| అయోధ్యకు అక్షరార్చన | – | 36 |
| బాలరాముడికి భాగ్యనగర అలంకారాలు | – | 38 |
| ప్రాణప్రతిష్ఠకు ముందు.. | – | 40 |
| వార్తా విశేషాలు | – | 44 |
| 'జగదానందకారకా..' ఆవిష్కరణలు | – | 46 |
| వారఫలాలు | – | 48 |
| పదరసం | – | 49 |


గమనిక : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దీనిని ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్నాం. కనుక వారం వారం ఇచ్చే అన్ని శీర్షికలను అందించలేకపోతున్నాం.



### అయోధ్యలో కొలువైన బాలరాముడు

# అవి పరమ వై



జనవరి 22, 2024 మధ్యాహ్నం నాటి ఆ 84 సెకన్లు భారతీయ నాగరికతకు మళ్లీ పరమ వైభవస్థితిని సంకేతించాయని సగర్వంగా చెప్పుకోవచ్చు.అయోధ్యలో నిర్మించుకున్న భవ్య మందిరంలోకి శ్రీరామచంద్రుడు పునఃప్రవేశం చేసిన దివ్య ముహూర్తం అదే. చరిత్రాత్మక ఘట్టం చోటు చేసుకున్న రోజు అదే. ఐదు వందల ఏళ్ల పోరాట ఫలితాన్ని వీక్షించే అదృష్టం వరించినందుకు అక్కడికొచ్చిన వారందరి కళ్లలోను ఆనందబాష్పాలు ఉబికాయనకంటే, శతాబ్దాలుగా పాత కట్టడంలోనూ, దశాబ్దాలుగా గుడారంలోనూ ఉండిపోయిన బాలరాముడు భవ్య మందిరంలోకి ప్రవేశిస్తున్నందుకు వారి కళ్లు చమరించాయని చెప్పడమే సరైనది. ఒక్క అయోధ్యలోనే కాదు, అసలు యావద్భారతదేశంలో మాత్రమే కాదు, ప్రపంచంలో ఎందరో, కోట్లాదిమంది హిందూ బంధువులు ఆ మహెూత్సవాన్ని చూసి పులకించారు. ప్రాణప్రతిష్ఠ నాటి రాత్రి అయోధ్యలో వెలిగించిన 14 లక్షల దీపాల కాంతితో సమంగా ఆ కొన్ని లిప్తలు భారతీయ నాగరికతా చరిత్రలో జాజ్జ్వల్యమానంగా వెలిగిపోతాయి.

వణికించే చలి. అయినా సామాన్యులు, అతిరథ మహారథులు కూడా వేకువనే వచ్చారు. నుదుటి మీద నామం, కణతల మీద రామనామంతో, మెడలో అయోధ్య గుర్తు ఉన్న లేత పసుపురంగు కండువాలతో, పూర్తిగా సంప్రదాయబద్ధంగా అంతా కనిపించారు. నిజానికి సగం మంది సాధుసంతులే. వారిదే అగ్రస్థానం కూడా. ఉత్తర భారతదేశమా! దక్షిణ భారతదేశమా! చెబితేగానీ తెలియదు. అన్ని ప్రాంతాల నుంచి విచ్చేశారు. దాదాపు ఏడువేల మంది విశిష్ట అతిథులు. రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, చలనచిత్ర ప్రముఖులు ఐక్యంగా కలసి రామకార్యంలో పాల్గొన్నారు.

మొదట ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మహదానందంతో ప్రాంగణంలోకి ప్రవేశించి అందరినీ జైశ్రీరాం అంటూ పలకరించారు. అందరి దగ్గరకు వెళ్లి వారి ఆనందాన్ని పంచుకున్నారు. తరువాత ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్‌జీ భాగవత్ వచ్చి అందరికీ నమస్కరిస్తూ పలకరించారు. వారి ముఖాలలో కూడా ఒక ఉద్వేగం. ఇవన్నీ వివరిస్తున్న

# భవ క్షణాలు



ఒకరిద్దరు టీవీ యాంకర్ల కళ్లు కూడా చెమర్చాయి.

బాబా రామ్‌దేవ్, శ్రీశ్రీశ్రీ రవిశంకర్ మొదటి వరసలోనే ఉన్నారు.

వయో వృద్ధుడు, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ ఇద్దరి సాయంతో వచ్చారు. ఆయన కుమారుడు హెచ్‌డీ కుమారస్వామి పక్కనే ఉన్నారు. కేంద్రమంత్రులు స్మృతీ ఇరానీ, రవిశంకర్ ప్రసాద్, చంద్రబాబునాయుడు, మరెందరో పాల్గొన్నారు.

ముఖేష్ అంబానీ, వారి కుటుంబం, అనిల్ అంబానీ, భారతీ మిట్టల్ కూడా హాజరయ్యారు.

అమితాబ్ బచ్చన్, హేమామాలిని, రజనీకాంత్, చిరంజీవి ఉత్సవానికి హాజరయ్యారు. అక్షయ్ కుమార్, జాకీష్రాఫ్, రణ్‌వీర్ కపూర్, అలియాభట్, కత్రినా కైఫ్, విక్కి కౌశల్, అనుపమ్ ఖేర్, అభిషేక్ బచ్చన్, పవన్ కల్యాణ్, సుమన్, రామ్‌చరణ్, మనోజ్ జోషి, మాధురీ దీక్షిత్, రామాయణ టీవీ సీరియల్ ఫేం అరుణ్ గోవిల్ (రాముడు), దీపికా చికాలియా (సీత), టైగర్ ష్రాఫ్ ఉత్సవంలో పాలు పంచుకున్నారు. సోనూ నిగమ్, శంకర్ మహదేవ్, అనురాధా పోడ్వాల్ భజన్‌లు ఆలపించారు.

సచిన్ టెండూల్కర్, సైనా నెహ్వాల్, పీటీ ఉష, మిథాలీ రాజ్ వంటి క్రీడారంగ ప్రముఖులు భాగస్వాములయ్యారు.

రామమందిర నిర్మాణం వెనుక ఉన్న శ్రీరామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ విశేషాలు వివరించారు. రాయి, పాలరాయి, తలుపులు ఎక్కడి నుంచి వచ్చినది వివరించారు. ఆభరణాలు, శిల్పులు, వస్త్రాలు వంటి వివరాలు చెబుతున్నారు.

అప్పుడే రామ్‌పథ్‌లో ఆయన రాకను అంతా



నిశ్చలంగా, భగవన్నామ స్మరణతోనే చాలాసేపు ప్రధాని గడిపారు. 11 రోజులుగా నిష్టగా సాగిస్తున్న అనుష్ఠానం ఇంకా కొనసాగుతున్నట్టే ఉంది. అర్చకుడు సునీల్ శాస్త్రి మొదట వినాయక పూజ చేయించారు. తరువాత డాక్టర్ మోహన్‌జీ భాగవత్ ప్రధాని పక్కన కూర్చున్నారు. అప్పుడు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఆరంభమైంది.

గమనించారు. ముహూర్తం సమీపిస్తుండగా లేలేత పసుపు రంగు పట్టువస్త్రాలు ధరించి, వెనుక శంఖనాదం వినిపిస్తుండగా చేతిలో పట్టువస్త్రాలు, వెండి చామరంతో రామ్‌పథ్ నుంచి నడచి వస్తూ కనిపించారు భారత ప్రధాని నరేంద్ర మోదీ. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయనే యజమాని. సరికొత్త ఆలయం శోభను కప్పేయకుండా నిరాడంబరంగా అలంకరించిన రామమందిరంలోకి నేరుగా వెళ్లారు. నృత్య రంగమంటపాలు దాటుకుని గర్భాలయంలోకి ప్రవేశించారు. అక్కడ తాను తెచ్చిన వస్త్రాలను, ఛామరాన్ని అర్చకునికి అప్పగించారు.

నిశ్చలంగా, భగవన్నామ స్మరణతోనే చాలాసేపు ప్రధాని గడిపారు. 11 రోజులుగా నిష్టగా సాగిస్తున్న అనుష్ఠానం ఇంకా కొనసాగుతున్నట్టే ఉంది. అర్చకుడు సునీల్ శాస్త్రి మొదట వినాయక పూజ చేయించారు. తరువాత డాక్టర్ మోహన్‌జీ భాగవత్ ప్రధాని పక్కన కూర్చున్నారు. అప్పుడు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఆరంభమైంది.

సరిగ్గా ఉదయం 12.29. కృష్ణశిలతో చెక్కిన బాలరాముడి విగ్రహం, సర్వాభరణ భూషితంగా లోకానికి దర్శనమిచ్చింది. అక్కడ ఉన్న ఆ కొద్దిమంది సరే, ప్రపంచ వ్యాప్తంగా టీవీల ముందు కూర్చున్న కోట్లాది మందిలో ఎంతమంది చేతులెత్తి, కళ్లు విప్పారించి చూసి ఉంటారో అంచనాకు అందదు. అంత సుందరమైన ప్రతిమ. శిల్పి అరుణ్ యోగిరాజ్ (మైసూరు) పేరు అందరి మనసులలోకి వచ్చి ఉంటుంది. ఎంత చక్కటి కళ్లు! ఎంత అందమైన నాసిక! ఎంత చక్కటి దరహాసం శిల్పంలో! వజ్రాలు, పగడాలతో చేసిన నామం నుదుట మీద నిజంగా ప్రత్యేక ఆకర్షణ. ఒక చేతిలో బంగారు విల్లు, మరొక చేతిలో బంగారు బాణంతో కళ్లు తిప్పుకోలేనంత సుందరమైన విగ్రహం.

అదే సమయంలో బయట హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి.

ప్రాణప్రతిష్ఠ తరువాత బయట బహిరంగసభ జరిగింది.

తీర్థక్షేత్ర ట్రస్ట్ కోశాధికారి గోవింద్‌దేవ్ గిరీ మాట్లాడారు. తీర్థం ఇచ్చి ఆయనే మోదీ చేత దీక్షను విరమింప చేశారు. తరువాత యోగి, డాక్టర్ భాగవత్, మోదీ, ట్రస్ట్ అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్‌దాస్ మాట్లాడారు.

తరువాత మోదీ జటాయు శిల్పానికి పూజలు చేశారు. ఆపై మందిర నిర్మాణంలో పాల్గొన్న శ్రామికులను పూలుజల్లి అభినందించారు.

దేశం నలుమూలలా ఆలయాలలో పూజలు జరిగాయి. దేశంలో రెండో దీపావళి జరిగింది. మోదీ పిలుపు మేరకు ఎందరో రామజ్యోతులను వెలిగించారు. తమిళనాడులో ఆలయాలలో దీపాలు వెలిగించడానికి, ఉత్సవాలు చేయడానికి ప్రభుత్వం అడ్డంకులు పెట్టి సుప్రీంకోర్టు చేత చీవాట్లు తిన్నది.



# రామభక్తి అంటే నిప్పు కాదు, నిర్మాణం



రాముడు ఈ దేశ విశ్వాసం...రాముడంటే భారతీయ దర్శనం.. రాముడు ఈ దేశపు పునాది..ఈ దేశపు చట్టం.. ఆలోచనా స్రవంతి..ఈ దేశ చైతన్యం.. ఈ దేశ తత్త్వం..రాముడు ఈ దేశ మార్గం, దశ దిశ.. ఈ దేశ ప్రతిష్ట.. రాముడు నిత్యం.. రాముడు నిరంతరం.. రాముడంటే విశ్వం.. రాముడంటే విశ్వాత్మ.. రామనామం ఒక ప్రవాహం.. రామనామం ఓ ప్రభావం... రాముడు ఒక కొనసాగింపు...రాముడు జీవనాధారం...
జనవరి 22 నాటి ప్రాణప్రతిష్ఠ తరువాత ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన ప్రసంగంలోని ఈ మాటలతో నూతన ఆలయ ప్రాంగణం అక్షరాలా ప్రతిధ్వనించింది.

**కా**లం కొసను వెంట నడిపించుకు తీసుకు పోయే మరొక గొప్ప మాటను కూడా ఆయన అదే వేదిక మీద నుంచే పలికారు. అదే–'రాముడు సంఘర్షణ కాదు, రాముడు సమాధానం'.

రాముడంటే భారతీయ ఆత్మ అని మనసా వాచా నమ్మిన, భూత భవిష్యత్ వర్తమానాల మీద రాముని ముద్ర తిరుగులేనిదని గ్రహించిన వివేకశీలి అయిన నాయకుడు, ద్రష్ట మాత్రమే చెప్పగలిగిన మాటలివి. అందుకే అయోధ్యలో ఆలయ నిర్మాణం, ప్రాణప్రతిష్ఠ భారత నాగరికతా ప్రస్థానంలోనే చిరస్మరణీయాలని మోదీ వక్కాణించగలిగారు. ఆధ్యాత్మికతకూ, జాతీయతకూ, ఆ రెండింటి మేళవింపుతో జరిగే, మట్టి వాసన వేసే పురోగతి అవసరం గురించి మోదీ ఈ వేదిక సాక్షిగా వివరించారు. వ్యక్తీకరణ సామర్థ్యంలో సమున్నత శిఖరాలను అధిరోహించిన మోదీ అయోధ్య ఉపన్యాసంతో మరొక మెట్టు అధిరోహించారనే చెప్పాలి. ఆయన నమ్మిన సిద్ధాంతమే పలికిన ప్రతి పలుకులోను ధ్వనించింది. అదే– భారతీయ ఐక్యత. సాగరం (రామేశ్వరం) నుంచి సరయూ (అయోధ్య) వరకు రాముడి పాదముద్రలను దర్శించానని ఆయన సభక్తికంగా చెప్పుకున్నారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ వంటి ఒక చరిత్రాత్మక సందర్భానికి తగ్గట్టే ఆయన ఉపన్యాసం చరిత్రాత్మకంగా సాగింది. రాముని ప్రతిష్ఠ అంటే, మందిర నిర్మాణమంటే కేవలం భక్తి కాదు, దేశ సమైక్యతల ప్రతిష్ఠలుగానే ఆయన భావించినట్టు కనిపిస్తుంది.

'శ్రీసీతారామచంద్ర ప్రభువుకు జై' అంటూనే ఆయన ప్రసంగం ప్రారంభించారు. దాదాపు నలభయ్ నిమిషాలు సాగింది ఉపన్యాసం. ఇవాళ



రాముడు వచ్చాడు అన్నారాయన. ఎలా వచ్చాడు? వంద సమాధానాలూ చాలని ఆ ప్రశ్నకు కొన్ని జవాబులు ఇచ్చే ప్రయత్నం చేస్తూ మాట్లాడారు. రాముడు వచ్చాడు. నిజమే. శతాబ్దాల (హిందువుల) నిరీక్షణ తరువాత వచ్చాడు. ఈ విషయం ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని చెబుతూ యావన్మంది రామభక్తులకు అభినందనలు తెలియచేశారు. మన గిరిజన తల్లి శబరి కూడా ఆయన రాక కోసం ఎన్నో ఏళ్లు నిరీక్షించిందని ఆయన గుర్తు చేశారు. అయినా మాటలు రావడం లేదనీ, పదకొండు రోజులు సాగిన ఆధ్యాత్మిక దీక్ష ఇచ్చిన అనుభూతిలో తనువు ఇంకా ఓలలాడుతూనే ఉందని చెప్పారు. నిజమే. శతాబ్దాలుగా అనేక పోరాటాలు, అనంతమైన తపస్సు, త్యాగాల వల్లనే రామమందిరం కల సాకారమైంది. పరమాత్మ ఇచ్చిన ఆ చైతన్యానికి సాక్షిగానే ఇవాళ రామమందిరం నిర్మితమైంది. అంటే రామ్‌లల్లా (బాలరాముడు) ఇకపై గుడారంలో ఉండడు. భవ్య మందిరంలోనే కొలువై ఉంటాడు. ఇది ఒక కట్టడంగా, నిర్మాణంగా మాత్రమే చూడకూడదని పునరుద్ఘాటించారాయన. గుడిని మానవీయ విలువలకు ప్రతీకగానే చూడాలన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు:

శతాబ్దాల నిరీక్షణ, ఓర్పు ఫలితంగా రామ మందిరంలోకి రాముడు ప్రవేశించాడు. అందుకే జనవరి 22, 2024 కేలండర్‌లో ఒక సాధారణ తేదీ కాదు. ఇదొక దైవిక క్షణం. నవయుగారంభం. కొత్త కాలచక్రానికి ప్రతీక. వేయేళ్ల తరువాత కూడా ప్రజానీకం గుర్తుంచుకుంటుంది. ఇవాళ మనం బానిస శృంఖలాల తెగగొట్టాం. ఇది కేవలం రాముడి ప్రాణప్రతిష్ఠ కాదు. శ్రీరాముడి రూపంలో వ్యక్తమయ్యే భారతీయ సంస్కృతిపై అచంచలమైన విశ్వాసాన్ని ప్రతిష్ఠించుకునే కార్యక్రమం కూడా. మానవీయ విలువలకు, అత్యున్నత ఆశయాలకు భారతీయ సంస్కృతి ప్రతిరూపం. ఇదే యావత్ ప్రపంచానికి అవసరం. ఇది రాముడి రూపంలో ఉన్న జాతీయ చైతన్యాలయం. అయితే ఈ క్షణంలో నేను రామచంద్రప్రభువును క్షమించమని కూడా అడుగుతున్నాను. మందిర నిర్మాణానికి ఇంత జాప్యం జరిగినందుకు క్షమించమని కోరుతున్నాను. ప్రాణప్రతిష్ఠ ఆలస్యమైనందుకు కూడా క్షమాపణలు అడుగుతున్నాను. మన త్యాగాలు, తపస్సులో ఏదో లోటు జరిగిన కారణంగానే ఆలయాన్ని నిర్మించలేక పోయాం. నేటితో ఆ లోటు తీరింది. ఆయన మన్నిస్తారని భావిస్తున్నాను కూడా. మన రాజ్యాంగ ప్రతిలోనే రాముని చిత్రం ఉన్నా మందిర నిర్మాణం కోసం సుదీర్ఘ న్యాయపోరాటం జరిగింది. ఇదే విషయాన్ని ఆయన ఆగస్ట్ 5, 2020 నాటి

భూమిపూజ వేళ అంతే గొప్పగా చెప్పారు. 'స్వాతంత్ర్యోద్యమం కోసం కొన్ని తరాలు సర్వం త్యాగం చేశాయి. భారతీయులను బానిసలుగా చూస్తూ సాగిన ఆ పాలనాకాలంలో ఉద్యమం జరగని రోజంటూ లేదు. దేశం కోసం త్యాగం చేయని చోటంటూ లేదు. అలా సాగింది స్వాతంత్ర్యోద్యమం. ఆఖరికి ఆగస్ట్ 15న స్వాతంత్ర్యం సాధించుకున్నాం. రామాలయం కోసం కూడా పెద్ద పోరాటమే సాగింది. అందుకు తరతరాలుగా వేలాదిమంది ప్రాణాలర్పించారు. శతాబ్దాలనాటి సంకల్పం, సహనం, అంకిత భావం, పోరాట స్ఫూర్తి ఈ రోజులలో ప్రతి ఫలిస్తున్నాయి' అన్నారాయన.

ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో కొందరు భారతదేశానికి ఈ ఘట్టం రెండో గణతంత్ర రాజ్యాంగా నిలిపేదని చెప్పడం విశేషం. హిందూత్వ భావాలకు సంబంధించి అది అతిశయోక్తి లేని వ్యాఖ్య. భారతీయ నాగరికతా ప్రస్థానాన్ని ఇంత గొప్ప మలుపు వైపు తిప్పే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన కరసేవకులకు, ఇతర త్యాగధనులకు ఆయన ఈ సందర్భంలో నివాళి ఘటించడం మరచిపోలేదు.

ఇంకా మోదీ ఇలా అన్నారు. న్యాయవ్యవస్థ గౌరవ ప్రతిష్ఠలను కాపాడినందుకు (అయోధ్య తీర్పు ద్వారా) ఆ వ్యవస్థకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. రాముడి ఆలయం రాజ్యాంగబద్ధంగానే జరిగింది. దైవ ఆశీర్వాదం, దైవిక ఆత్మల ఆశీర్వాదం కూడా ఉన్నాయి. రామజన్మభూమి ఆలయంలో పూజ, అభివృద్ధి పనులు దేశ పౌరులలో కొత్త శక్తిని నింపాయి.

ఇది సాధారణమైన సమయం కాదు. కాలప్రవాహం ముద్రించిన చెరగని స్మృతి మార్గం. గత అనుభవాల నుంచి స్ఫూర్తి పొంది చరిత్రను లిఖించే గొప్ప సందర్భమిది. మనది బానిస శృంఖలాలు ఛేదించుకుని పురోగమిస్తున్న దేశం. పాత చేదు జ్ఞాపకాలను వీడి కొత్త చరిత్రను రాసుకుంటున్న జాతి మనది.

భారతీయ పునరుజ్జీవన పునాదుల మీద మందిరం నిర్మించుకున్నాం. రామచంద్రుని ఆశీర్వాదం వల్లనే మనం ఈ మహత్తర సందర్భానికి సాక్షిగా ఉన్నాం. కాలం, భూమ్యాకాశాలు, దిక్కులు అన్నీ ఇవాళ దైవత్వంతో నిండిపోయాయి. బాల రాముడి ప్రాణప్రతిష్ఠతో చిన్న చిన్న గ్రామాలు సహా దేశం మొత్తం ఉత్సవాలు చేసుకుంటున్నది. ఈ ఆధ్యాత్మిక భావన, రాముడు ఇవాళ సర్వవ్యాప్తంగా ఉన్నారు. ప్రపంచ జీవన విధానాలు కూడా ఇవాళ ఈ ఉత్సవంతో మమేకమైనాయి. ఆ విధంగా అయోధ్య నిర్మాణం వసుధైవ కుటుంబకం అన్న భావనను నిలిపింది. రాముడు గతం కాదు, వర్తమానం, ఇంకా చెప్పాలంటే అనంతం. రాముడు భారతీయ స్పృహను తట్టి లేపాడు.

ఇంత భవ్యమందిర నిర్మాణం జరిగిన ఈ క్షణంలోనే భవ్య భారతదేశాన్ని నిర్మించుకుంటామని భారతీయ పౌరులంతా ప్రతిన పూనాలి. అది ప్రతిభావంతమైన, ఆధ్యాత్మిక దీప్తితో కూడిన భారత దేశం కావాలి. ప్రతివారి హృదయంలో, సమాజంలో రాముడి సూత్రాలు ఉండాలి. వాటితోనే ముందుకు సాగాలి. వేయేళ్ల తరువాతి తరం కూడా మన దేశ నిర్మాణ దీక్షను గుర్తు చేసుకుంటుంది.

ఈ దేశ యువతకు నేను చెప్పేదొకటే. మీరు మన గతం నుంచి, నాగరికత నుంచి ఉత్తేజితులు కావాలి. మీ ముందున్న వందల ఏళ్ల సంప్రదాయం నుంచి ప్రేరణ పొందాలి. మీరు ఇవాళ్టి భారతీయ తరానికి ప్రతినిధులు. ఇది చందమామ మీద పతాకం పాతిన తరం. ఇక్కడ నుంచి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని సూర్యగ్రహాన్ని అన్వేషించడానికి ఆదిత్య ప్రయోగాలు చేస్తున్న తరం. ఆకాశంలో తేజస్ జెండా, సాగరంలో విక్రాంత్ నౌకను చూస్తున్న తరం. మీ గతాన్ని చూసుకుంటూ, కొత్త యుగోదయాన్ని మీరు రచించాలి.

ఇప్పుడు కాలమంతా భారతదేశానిదే. భారత్ పురోగమనంలో ఉంది. కానీ ఈ స్థాయికి చేరడానికి, ఇలాంటి క్షణాల కోసం మనం శతాబ్దాల పాటు నిరీక్షించాం. ఇక ప్రయాణం ఆగదు. అత్యున్నత ప్రగతి బిందువు దగ్గరకి సాగిపోతాం.

రామాలయం కడితే అశాంతి చెలరేగుతుందని ఇంతకాలం భయపెట్టిన వారికి కూడా మోదీ చురకలు వేశారు. ఇలాంటి వారంతా ఒక విషయం మరచిపోయారని, అదే భారతీయుల సామాజిక నమ్మకమని మోదీ చెప్పారు. రామ్‌లల్లా భారతీయ సమాజంలో శాంతికి, సహనానికి, సామరస్యానికి, పరస్పర సహకారానికి ప్రతీకగానే ఉంటుందని అన్నారు.

ఈ మందిర నిర్మాణంతో జ్వాలలు రేగుతా యని తాము అనుకోవడం లేదని, శక్తిని ఉత్పత్తి చేస్తున్నట్టు భావిస్తున్నామని మోదీ చెప్పారు. రాముడు నిప్పు కాదు, రాముడు శక్తి అన్నారాయన. ఇవాళ్టి వాతావరణాన్ని అనుభవించి, మీమీ అభిప్రాయాలపై పునరాలోచన చేసుకోవలసిందిగా అభ్యర్థిస్తున్నానని కూడా ఆయన అన్నారు.

యాంత్రికంగా సాగిపోయే రాజకీయ ఉపన్యాసాలు మోదీ నోటి నుంచి ఏనాడూ ఈ జాతి వినలేదు. భారతీయ నాగరికతా చరిత్రలోను, భారతీయ జనతా పార్టీ ప్రస్థానంలోను అరుదైన ఈ ఘట్టానికి ఆయన గొప్ప విలువనే ఇచ్చారు. గొప్ప విలువనే తెచ్చారు. కాశీలో మాదిరిగానే ఆయన మందిర నిర్మాణంలో పాల్గొన్న శ్రామికులను పూలవర్షంతో ముంచెత్తారు. తాను సంతోష పడ్డారు. వారినీ సంతోషపెట్టారు.

**– జాగృతి డెస్క్**



మన దేశపు శతాబ్దన్నర చరిత్ర విదేశీ దురాక్రమణదారులతో సాగించిన నిరంతర సంఘర్షణతో నిండి ఉంది. ప్రారంభంలో కొద్దిమంది, అప్పుడప్పుడు ఇక్కడి సంపదను దోచుకోవడం కోసం ఈ దేశంపై దాడి చేసేవారు. కానీ ఆ తరువాత ఇస్లాం పేరున పశ్చిమం నుండి సాగిన దాడులు ఇక్కడి సమాజాన్ని తీవ్రంగా నష్టపరచడమేకాక వేర్పాటువాద ధోరణిని కూడా తీసుకువచ్చాయి. సమాజంలో నిరాశ, నిస్పృహ, పరాజయ భావాలను నింపడానికి విదేశీ దురాక్రమణదారులు ఇక్కడి ధార్మిక స్థలాలు, మందిరాలపై దాడిచేసి, వాటిని ధ్వంసం చేశారు. ఇలా ఒక్కసారికాదు, అనేకసార్లు చేశారు. ఈ విధంగా భారతీయ సమాజాన్ని బలహీనపరచి దీర్ఘకాలం ఇక్కడ రాజ్యం చేయాలన్నది వారి ప్రయత్నం. అయోధ్యలో శ్రీరామమందిరాన్ని కూడా ఇదే ఉద్దేశంతో, లక్ష్యంతో ధ్వంసం చేశారు. దురాక్రమణకారుల ఈ లక్ష్యం కేవలం ఒక మందిరానికే పరిమితం కాలేదు. మొత్తం ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకోవాలన్నది వారి అసలు ఉద్దేశం.

# జాతి గౌరవాన్ని జాగృత పరిచే ఘట్టం

ఈ దేశానికి చెందిన రాజులు ఎప్పుడూ, ఏ దేశంపైన దురాక్రమణ చేయలేదు. కానీ ప్రపంచంలోని మిగిలిన దేశాలకు చెందిన రాజులు మాత్రం అటువంటి దాడులు, దురాక్రమణలకు పాల్పడ్డారు. అయినా ఏ పాలకుడూ భారత్ పై పూర్తి ఆధిపత్యాన్ని సాధించలేకపోయాడు. భారతీయ సమాజం ఎప్పుడూ ఈ దురాక్రమణదారుల ముందు తలవంచలేదు. వీరిని ఎదుర్కొనేందుకు నిరంతరం పోరాటం చేస్తూనే ఉంది. అయోధ్య జన్మస్థానాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని అక్కడ భవ్యమైన రామ మందిరాన్ని పునర్నిర్మించడానికి నిరంతర ప్రయత్నం సాగుతూనే ఉంది. అనేక యుద్ధాలు, సంఘర్షణ, బలిదానాలు జరిగాయి. రామజన్మభూమిలో మందిర నిర్మాణ సంకల్పం హిందువుల మనస్సుల నుండి ఎప్పుడూ తొలగిపోలేదు.

1857లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా యుద్ధానికి ప్రణాళిక వేసుకున్నప్పుడు హిందువులు, ముస్లిములు కలిసే ఆ పని చేశారు. అప్పటివరకూ ఇద్దరూ ఆలోచనలు పంచుకునేవారు. అప్పుడు గోవధ నిషేధం, రామ జన్మభూమి గురించి రెండు వర్గాల మధ్య ఒక అంగీకారం కుదిరే వాతావరణం ఏర్పడి ఉంది. తన ప్రమాణపత్రంలో గోవధ నిషేధం అమలు గురించి కూడా బహదూర్ షా జాఫర్ పేర్కొన్నాడు. అందువల్లనే సమాజం మొత్తం ఒకటిగా నిలిచి పోరాడింది. భారతీయులందరూ వీరోచితంగా పోరాడినా దురదృష్టవశాత్తూ ఆ యుద్ధం విఫలమైంది. దానితో బ్రిటిష్ పాలన కొనసాగింది. అయితే రామ జన్మభూమి ముక్తి పోరాటం మాత్రం ఆగలేదు. బ్రిటిష్ వాళ్ళు మొదటి నుండి అనుసరిస్తూ వచ్చిన 'విభజించి పాలించు' అనే విధానాన్ని ఆ తరువాత మరింతగా అమలు చేశారు. సమాజంలోని ఐకమత్యాన్ని నాశనం చేయడం కోసం బ్రిటిష్ వాళ్లు స్వతంత్ర వీరులను అయోధ్యలో ఉరితీశారు. అయినా అయోధ్య ముక్తి పోరాటం మాత్రం ఆగలేదు.

1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సోమనాథ మందిర జీర్ణోద్ధరణ జరగడంతో ఇటువంటి దేవాలయాల గురించి చర్చ మళ్లీ ప్రారంభమయింది. రామజన్మభూమి ముక్తి గురించి అందరి ఆమోదం, అంగీకారం సాధించే అవకాశం అప్పుడు వచ్చినా రాజకీయాలు మరోదారి పట్టాయి. విచ్ఛిన్నవాదం, ప్రాంతీయవాదం వంటివి రాజకీయాల ముసుగులో పెచ్చరిల్లాయి. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఈ విషయమై హిందువుల మనోభావాలను పట్టించుకోకపోగా వివాదాన్ని పరిష్కరించుకోవడం కోసం ప్రజలు చేసిన ప్రయత్నాలను కూడా ముందుకు సాగనివ్వలేదు. ఈ విషయమై స్వాతంత్ర్యానికి ముందు నుండి సాగుతూ వచ్చిన న్యాయపోరాటాన్ని కొనసాగించారు. రామజన్మభూమి విముక్తి కోసం ప్రజా ఉద్యమం 1980 తరువాత ఊపందుకుంది. అప్పటి నుండి మూడు దశాబ్దాల పాటు సాగింది.

1949లో జన్మభూమిలో భగవాన్ శ్రీరామ చంద్రుని విగ్రహం వెలిసింది. 1986లో కోర్టు ఆదేశం మేరకు గుడి తాళాలు తెరిచారు. ఆ తరువాత అనేక ఉద్యమాలు, రెండుసార్లు కరసేవ వంటి కార్యక్రమాల ద్వారా హిందూ సమాజపు నిరంతర సంఘర్షణ కొనసాగింది. 2010లో అలహాబాద్ హైకోర్ట్ స్పష్టమైన తీర్పునిచ్చింది. ఆ తరువాత ఈ విషయంలో అంతిమ తీర్పు సాధ్యమైనంత త్వరగా వెలువరించాలంటూ కోర్టుకు పదేపదే అభ్యర్థనలు వెళ్లాయి. చివరికి 30 సంవత్సరాల హిందూ సమాజ సుదీర్ఘ న్యాయపోరాటం తరువాత నవంబర్ 9, 2019న అన్ని సాక్ష్యాధారాలు క్షుణ్ణంగా పరిశీలించిన సుప్రీం కోర్టు సముచితమైన, సంతులితమైన తీర్పును ప్రకటించింది. రెండుపక్షాల మనోభావాలు, సాక్ష్యాధారాలను కోర్టు పరిగనలోకి తీసుకుంది. అలాగే ఈ కేసుకు సంబంధించి అన్ని పక్షాల వాదనలను కూడా కోర్టు పూర్తిగా విన్న తరువాత తీర్పునిచ్చింది. ఈ తీర్పును అనుసరించి మందిర నిర్మాణం కోసం ఒక ట్రస్ట్ ను ఏర్పాటుచేశారు. ఆగస్ట్ 5, 2020 మందిర భూమిపూజ జరిగింది. ఇప్పుడు పుష్య మాస శుక్లపక్ష ద్వాదశి, యుగాబ్ది 5125, 2024 జనవరి 22న శ్రీ రాంలల్లా విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ధార్మిక దృష్టితో చూస్తే శ్రీరాముడు ఈ దేశంలో అధిక సంఖ్యాకులకు ఆరాధ్య దేవుడు. ఆయన జీవితం ఆదర్శప్రాయమని, అనుసరణీయమని నేటికీ సమాజంలో అందరూ భావిస్తున్నారు. అందువల్ల ఈ కార్యక్రమానికి సంబంధించి వస్తున్న చిన్నపాటి అభ్యంతరాలు, అనుమానాలను పూర్తిగా పక్కన పెట్టాలి. వివాదాలు, వాదనలు పూర్తిగా సమసిపోయేట్లు మేధావులు చూడాలి. అయోధ్య అంటే 'యుద్ధం లేనిది', 'సంఘర్షణలేని స్థానం' అని అర్థం. సమాజంలోని ప్రతి ఒక్కరి మనస్సులలో అటువంటి అయోధ్య నిర్మాణం కావాలి. అది మనందరి కర్తవ్యం.

అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం జాతి గౌరవ పునర్ జాగరణకు గుర్తు. ఇది శ్రీరాముని జీవితం ఇచ్చే సందేశాన్ని ఆధునిక సమాజం కూడా స్వీకరించిందనడానికి గుర్తు. శ్రీరామమందిరంలో పత్రం, ఫలం, పుష్పంతో పూజతో పాటు మనసులో



ఆయనను ఉంచుకుని ఆదర్శవంతమైన ఆచరణను అలవరచుకోవాలి. మన సంస్కృతి ప్రకారం పర స్త్రీని మాతృభావనతో చూడాలి. పరుల సొమ్మును మట్టిగా ఎంచాలి. సర్వ జీవులలో ఆత్మను చూడాలి అని పండితులు చెపుతారు. ఈ విధంగా మనం శ్రీరాముని మార్గంలో నడవాలి. సత్యనిష్ఠ, బలపరాక్రమాలతో పాటు క్షమ, వినయం, అందరినీ సమాదరించే ధోరణి, కారుణ్యం, కర్తవ్యపాలనలో పట్టుదల వంటి శ్రీరామచంద్రుని గుణాలను వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా అలవరచుకునే ప్రయత్నం చేయాలి.

వ్యక్తిగత జీవితంలో క్రమశిక్షణ తెచ్చుకోవాలి. ఇటువంటి క్రమశిక్షణ ద్వారానే రామలక్ష్మణులు 14ఏళ్ల అరణ్యవాసాన్ని పూర్తిచేయడమేకాక శక్తిశాలి రావణునితో పోరాడి విజయం సాధించారు. శ్రీరాముని జీవితంలో కనిపించే న్యాయబుద్ధి, కరుణ, సద్భావం, నిష్పక్షపాత ధోరణి, సామాజిక గుణాలను తిరిగి ఈ సమాజంలో పాదుకొల్పాలి. శోషణ లేని, సమాన న్యాయం లభించే సమాజాన్ని, శక్తితోపాటు కరుణతో నిండిన సమాజాన్ని నిర్మించడమే శ్రీరామునికి నిజమైన పూజ అవుతుంది.

అహంకారం, స్వార్థం, భేదభావాల మూలంగా ప్రపంచం వినాశం వైపు పరుగులు తీస్తోంది. ఎన్నో ఆపదలను కొనితెచ్చుకుంటోంది. సద్భావన, ఏకత, ప్రగతి, శాంతి వంటి మార్గాన్ని చూపిన జగదభిరాముని ఆదర్శం సర్వకల్యాణకారి, 'సర్వేషాం అవిరోధీ' (ఎవరితోనూ విరోధం లేని) అయిన సమాజ నిర్మాణపు ప్రారంభానికి దారి చూపాలి. ఆ మహా ప్రయత్నానికి శ్రీ రాంలల్లా ప్రాణప్రతిష్ఠ నాంది కావాలి. మనమంతా ఆ ప్రయత్నంలో, ఆ ఉద్యమంలో పాలుపంచుకోవాలి. ఈ పునర్నిర్మాణ కార్యంతో భారత్, తద్వారా ప్రపంచపు పునర్నిర్మాణ సంకల్పం చేపడదాం. ఈ విషయాన్ని మనస్సులో ఉంచుకుని ముందుకు నడుద్దాం. **జైశ్రీరామ్**



# 'అయోధ్య ఆత్మగౌరవానికి

ఐదు వందల సంవత్సరాల హిందువుల ధార్మిక పోరాటానికి పరాకాష్ఠ అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం. అన్ని అవాంతరాలు అధిగమించి ఇప్పుడు ఆలయ నిర్మాణ స్వప్నం సాకారమైంది. ఈ మహత్కార్యంలో కీలకంగా ఉన్నవారే చంపత్‌రాయ్‌. విశ్వహిందూ పరిషత్‌ అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి, అయోధ్య శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ కార్యదర్శిగా ఆయన వ్యవహరిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్‌కు చెందిన చంపత్‌రాయ్‌ మొదట స్వయం సేవక్‌. సనాతన ధర్మ రక్షణ ఉద్యమంలో చిరకాలం పనిచేశారు. బిజ్నోర్‌ జిల్లాలోనే ధాంపూర్‌ ఆర్‌ఎస్‌ఎం కళాశాలలో ఆచార్యునిగా పనిచేశారాయన. నిర్మాణం సందర్భంగా చంపత్‌రాయ్‌ క్షణం తీరికలేని సమయంలోను జాగృతి కోసం ముఖా ముఖిగా విషయాలు వెల్లడించారు. అందులో కొన్ని పాఠకుల కోసం.

**అయోధ్య... ఈ క్షణంలో ఈ పేరు ప్రపంచమంతటా ప్రతిధ్వనిస్తున్నది. ఇది అతిశయోక్తి కానేకాదు. అంత మహత్త్వం ఇంతకాలం తరువాత ఇప్పుడే ఎలా వచ్చింది? ప్రతి భారతీయుడు అయోధ్య వైపు చూస్తున్నాడంటే ఎంత బలమైన మనోభావం నిర్మితమై ఉండాలి?**


నిజమే. అయోధ్య ఈ మొత్తం ప్రపంచానికే అతి పెద్ద పుణ్యక్షేత్రంగా అవతరించింది. కానీ హఠాత్పరిణామం కాదు. అసలు మన పూర్వీకులు, మహర్షులు ఈ పుణ్యభూమిలో మహా పుణ్యక్షేత్రాలూ, తీర్థాలూ, ఆలయాలూ ఎన్నెన్ని ఉన్నాయో వాటన్నింటి గురించీ ఏనాడో చెప్పారు. 'అయోధ్య మధుర మాయ అంటూ చదువుతాం కదా, శ్లోకం. వాటిలో మొట్టమొదటి పేరు అయోధ్యది. ఔను కదా! ఇవాళ ఆ మునులు చెప్పినది సత్యమని స్పష్టమైంది. మనం అందుకు సంబంధించిన విస్మృతిని వీడాం. రామజన్మభూమి మందిరం పూర్తి అయిన తర్వాత మొత్తం ప్రపంచం, భారతదేశంలోని ప్రతి పౌరుడు అయోధ్యకు వచ్చి ఇక్కడి మట్టిని, ఆ గుణాన్ని స్పృశించి నమస్కారం చేయాలనుకుంటాడు. ఆ అనుభూతిని జీవితంలో మిగుల్చుకోవాలని ఆకాంక్షిస్తాడు. అంత గొప్ప పుణ్యక్షేత్రంగా అయోధ్య ఇవాళ అవతరించింది. అందుకే మొత్తం ప్రపంచం ఈ ఉత్సవం మీద దృష్టి సారించింది.

**ఈ మహోద్యమంలో సాధుసంతులు చేసిన ధర్మపోరాటం ఒక వైపు. న్యాయ పోరాటం మరొకవైపు. రాజకీయ పోరాటం కూడా ఉంది. అదైతే గొప్ప ఊపునిచ్చింది. కానీ న్యాయపోరాటం ఒక అద్భుతం అనిపిస్తుంది కదా! ఒక మలుపు కదా!**

సుప్రీంకోర్టులో దాదాపు 100మంది న్యాయవాదులు ఒక బృందంగా ఏర్పడి పనిచేశారు. నేను న్యాయ నిపుణుడినీ, చట్టాలు తెలిసినవాడినీ కూడా కాదు. న్యాయం, చట్టం అన్నది కాగితాలపై, పుస్తకాల్లో ఉంటుంది. కానీ అత్యున్నత న్యాయస్థానంలో పనిచేసే న్యాయవాదుల బృందం, ముఖ్యంగా మా ఫైళ్లను గంభీరంగా చదివేవారు, అత్యంత ఆత్మవిశ్వాసంతో ఈ ఫైలు (కేసు) గెలుస్తుందని చెప్పేవారు. నేను అశోక్‌ అరణహళ్లి గురించి చెప్తాను. అతడు కర్ణాటకకు చెందిన వాడు. బహుశ అతని కుటుంబం కాంగ్రెస్‌ నాయకులకు సంబంధించినదై ఉంటుంది. కర్ణాటక ప్రభుత్వ అడ్వకేట్‌ జనరల్‌గా కూడా చేసి ఉంటాడు. ఒక సమయంలో జస్టిస్‌ రామా జాయిస్‌ అతడిని మాతో ముడిపెట్టాడు. ఆయన మా ఫైళ్లను చూశాడు. బెంగళూరులో జరిగిన ఒక సదస్సులో ఎంతో ఆత్మవిశ్వాసంతో, ఆ కాగితాల్లో, ఫైళ్లల్లో రాసి ఉన్నది చదివితే, రామజన్మభూమి కేసు హిందూవాది పక్షానికి అనుకూలంగా ఉంటుందని ఆనాడే అభిప్రాయపడ్డాడు. ఆయన చెప్పిన చాలాకాలం తరువాత తీర్పు వచ్చింది. అది మా రికార్డులకున్న బలం, పరిస్థితి. అందుకే, ఈ అంశంలో నా అనుభవం అత్యంత సంతోషకరమైనది. నాకూ, మా అందరికీ అది ఆనందదాయకమే కాక ఈ పోరాటంలో పని చేసిన ప్రతి ఒక్కరికీ, అందరికీ కృతజ్ఞత వెల్లడించేటట్టు చేసేదే.

**ఇంత ప్రతిఘటన, వక్రభాష్యాలు, విమర్శల నడుమ విజయం సాధించారు హిందువులు. కానీ ఏ క్షణంలో అయినా కాస్త నిరాశపడ్డారా?**

మనం న్యాయాన్ని నమ్ముకున్నామని ముందే చెప్పాను. అలహాబాద్‌ ఉన్నత న్యాయస్థానంలో లక్నో ధర్మాసనంలో వ్యాజ్యం నడిచింది. దాదాపు తొంభయ్‌ ఏళ్ల నుంచి న్యాయస్థానంలో వ్యాజ్యం నలుగుతున్నది. మన కాలంలోనే మనం చూస్తుండగా లక్నో



అయోధ్య ఆత్మ గౌరవానికి సంబంధించిన అంశమని తప్పక చెప్పవలసి ఉంటుంది. ఆ ఆత్మగౌరవాన్ని పరిరక్షించడంలో ఏదైనా ప్రభుత్వం బలహీనతను ప్రదర్శించినా, అలసత్వం చూపినా ఎవరూ ఏమీ చేయలేరు. అంతిమంగా ఏమైంది? దేశంలో ఒక పెద్ద వర్గం ఏదైతే రాజకీయాలలో పనిచేస్తూ వస్తోందో, అది అయోధ్య అంశాన్ని ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంగా పరిగణించింది, అర్థం చేసుకుంది. చిత్తశుద్ధితో పనిచేసింది.

# సంబంధించినదని దేశం గుర్తించింది!'

### శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్‌తో జాగృతి ముఖాముఖి

ధర్మాసనం ఎదుట దాదాపు 15 ఏళ్ల పాటు సాగింది. అంటే 1995 నుంచి ప్రారంభమై 2010 సెప్టెంబర్ వరకు సాగింది. దీని అనంతరం చర్చలు, సంభాషణలు జరిగాయి. అప్పుడు కూడా వివాదం ఒక కొలిక్కి వచ్చే సూచనలు కనిపించలేదు. సర్వోచ్చ న్యాయస్థానం సూచన మేరకు మీడియేషన్ (మధ్యవర్తిత్వం) దాదాపు నాలుగున్నర నెలలు సాగింది. మార్చి నుంచి జులై చివరివరకు. అనంతరం, అత్యున్నత న్యాయస్థానంలో నలభై రోజుల పాటు విచారణ జరిగింది. చెప్పవలసిన వాస్తవం ఏమిటంటే, మనం ఏ క్షణంలోను మనం నిరాశ పడలేదు. న్యాయం మన పక్షం ఉన్నదనే నమ్ముకున్నాం. మన పక్షాన్నే ఉందని రుజువైంది.

**కొన్ని ప్రభుత్వాలు జవాబుదారీతనంగా లేకపోవడం వల్ల ఇంత అవాంఛనీయ జాప్యం జరిగిందని చాలామంది అభిప్రాయం. పైగా ఈ సమస్యతో కొందరు దేశం పరువును తీయడానికి ప్రయత్నించారు. ఇదంతా ఎందుకు?**

హిందుస్థాన్ గౌరవాన్ని సురక్షితంగా ఉంచవలసిన బాధ్యత ఈ దేశపు ప్రభుత్వానిదే. భారత్‌లో అనే కాదు, ఏ దేశంలోనైనా ఆ బాధ్యత ప్రభుత్వానిదే అయి ఉంటుంది. అయోధ్య ఆత్మ గౌరవానికి సంబంధించిన అంశమని తప్పక చెప్పవలసి ఉంటుంది. ఆ ఆత్మగౌరవాన్ని పరిరక్షించడంలో ఏదైనా ప్రభుత్వం బలహీనతను ప్రదర్శించినా, అలసత్వం చూపినా ఎవరూ ఏమీ చేయలేరు. అంతిమంగా ఏమైంది? దేశంలో ఒక పెద్ద వర్గం ఏదైతే రాజకీయాలలో పనిచేస్తూ వస్తోందో, అది అయోధ్య అంశాన్ని ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంగా పరిగణించింది, అర్థం చేసుకుంది. చిత్తశుద్ధితో పనిచేసింది.

**ప్రాణప్రతిష్ఠ కేవలం ఒక పార్టీ, ఒక ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమమన్న అవాంఛనీయ ప్రచారం జరిగింది. ఆలయ నిర్మాణం ఆ ఒక్క రాజకీయ పక్షంతోనే అయిందనడం ఎంత వరకు సమంజసం?**

మేమైతే ఎవరినీ, ఏ సంస్థ వారినీ ఇక్కడికి రాకుండా ఆపలేదు. ఇతరులు కూడా వచ్చి పాల్గొంటే నిజంగా మేం ఆపేవారం కాదు. అయితే ఈ అద్భుత కార్యక్రమంలో మేం కూడా భాగస్వాములం. మేం కూడా చేశాం, మేం చేస్తాం కూడా. అది గమనించాలి. దేశ స్వాతంత్ర్య సమరం చూడండి. భారతీయుల రాజకీయ స్వేచ్ఛకోసం గ్రామ గ్రామ నుంచి కూడా పోరాటంలో పాల్గొన్నారు. అప్పుడు కేవలం ఒకటే సంస్థ దేశమంతటా వ్యాపించి, ఉద్యమంలో చురుగ్గా ఉంది. దాని పేరు 'భారత జాతీయ కాంగ్రెస్'. కనుక, వారిని కాంగ్రెస్ వారనే పిలుస్తారు, భావిస్తారు. అయితే ఆనాటి ఆ ఉద్యమం దేశం కోసం. పనిచేసేవారు దేశం కోసం చేశారు. ఇప్పుడు కూడా మందిర నిర్మాణంలో రాజకీయాలు ఏమీ లేవు. కాబట్టి ఎవరూ ఎవరినీ నిర్మాణం విషయంలో ఆపలేదు. ప్రజలే తమకు తాము ఈ మహా కార్యక్రమం వెనుక వచ్చి నిలిచారు. అలాగే న్యాయపోరాటంలో కూడా ఎటువంటి రాజకీయ ప్రభావం లేదు. దేశ గౌరవం కన్నా పార్టీలకో, ప్రభుత్వాలకో ప్రయోజనం జరగాలన్న ఆలోచనతో, రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం సరికాదు.

> **శ్లో॥** **ఉత్సాహో బలవానార్య నాస్త్యు త్సాహాత్ పరంబలం**
> **సోత్సాహస్య హి లోకేస్మి న్నకించిదపి దుర్లభం**
> **భావం:** ఉత్సాహం అన్నిటి కంటే బలమైనది. ఉత్సాహం కంటే బలమైదని లేదు. ఉత్సాహం కలవారికి లోకంలో లభించనిదంటూ ఉండదు.



**శిలాన్యాస్ అయోధ్య ఉద్యమంలోనే ఒక కీలకఘట్టం.దేశం మొత్తం కదిలింది. ప్రతి హిందువు చైతన్యవంతుడయ్యాడు. అసలు ఆనాటి ఆధ్యాత్మిక వాతావరణాన్ని గుర్తు చేసుకుంటే, రామమందిర నిర్మాణం జరిగి తీరుతుందన్న అభిప్రాయం దృఢంగా ఏర్పడిందనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఈ శుభకార్యం విషయంలో మనని ఎవరూ ఆపలేరన్న ధైర్యం కలిగింది. దాని గురించి మీరేమంటారు?**

బహుశ, సెప్టెంబర్ 1989, దేశంలో రామ్‌శిలా పూజా కార్యక్రమం జరిగింది. సుమారుగా మూడు లక్షల గ్రామాలలో నిర్వహించారు. ప్రతి గ్రామం లేదా పేట లేదా వీధి నుంచి శిలలను పూజించి అయోధ్యకు పంపారు. ఎంతో గౌరవంతో వాటిని ఉంచారు. అయోధ్యలోని రామ్‌ఘాట్ చౌరస్తాలో ఉన్న కార్యాలయంలో పెట్టారు. 2021లో నిర్మాణ కార్యక్రమం ప్రారంభమైనప్పుడే పునాదులు పడిపోయాయి. అది పెరుగుతూ వచ్చినప్పుడు ఆ ఇటుకలను నాలుగువైపులా, దిక్కులా పునాదులలో వేశారు. వాటిపై దాదాపు పది నుంచి పదిహేను అడుగుల మట్టి ఉంది. వాటి ఆధారంగానే ఈ మందిర నిర్మాణం జరిగింది. అందుకే, నేను ఏమంటానంటే, దేశ ప్రజలంతా ఎంతో భక్తిశ్రద్ధలతో పంపించిన ఆ శిలలకే నిర్మాణంలో అత్యధిక గౌరవం దక్కింది. అవే కదా ఇవాళ్టి ఈ భవ్య మందిరానికి పునాదులుగా మారాయి. ఎంత పుణ్యం వాటిది!

**ఇంటర్వ్యూ: అయోధ్య నుంచి సుభద్రారాణి**

# మహా నిర్మాణం వెనుక...



అరుదైన ఒక అంతర్జాతీయ కార్యక్రమంగా అంతా భావిస్తున్న అయోధ్య రామమందిర నిర్మాణం, బాలరాముని ప్రాణప్రతిష్ఠ నిర్వహించడానికి ఏర్పడిన సంస్థ శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్. రామ జన్మభూమి హిందువులకే చెందుతుందని భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చి, ఇటువంటి ఒక సంస్థను ఏర్పాటు చేయవలసిందని సూచించింది. ఆ క్రమంలోనే ఫిబ్రవరి 5, 2020లో ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రకటించారు. అందరూ యోగ్యులతో ఈ ట్రస్ట్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు కనిపిస్తుంది. దీని అధ్యక్షుడు మహంత్ నృత్యగోపాల్‌దాస్ మహ రాజ్. ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్. మొత్తం సభ్యుల సంఖ్య 15. వీరిలో 12 మందిని కేంద్ర ప్రభుత్వమే నియమించింది. మొత్తం సభ్యులలో మళ్లీ 9 మంది శాశ్వత సభ్యులు. ఆరుగురిని తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తారు. ఇందులో హిందువులకు మాత్రమే అవకాశం కల్పిస్తారు.

సుప్రీంకోర్టులో రామ్‌లల్లా విరాజమాన్ కేసులో వాదించిన ప్రఖ్యాత న్యాయవాది, మాజీ అటార్నీ జనరల్ కేశవ పరాశరన్‌ను ట్రస్ట్ యాక్టింగ్ చైర్మన్‌గా నియమించారు. ఫిబ్రవరి 19,2020న మహంత్ నృత్యగోపాల్ దాస్‌ను చైర్మన్‌గా మిగిలిన సభ్యులు ఎన్నుకున్నారు. నలుగురు ఆధ్యాత్మికవేత్తలు, నిర్మోహి అఖాడాకు చెందిన వారు ఒకరు, అయోధ్య జిల్లాకు చెందిన ప్రముఖులు ఇద్దరు, ఒక దళిత ప్రతినిధి కూడా ఈ ట్రస్ట్‌లో ఉన్నారు. ట్రస్ట్ తొలి సమావేశం పరాశరన్ ఇంట్లోనే జరిగింది. నృత్యగోపాల్ దాస్, చంపత్‌రాయ్‌ల ఎంపిక కూడా అక్కడే జరిగింది. అంటే 14 రోజులతోనే యాక్టింగ్ చైర్మన్‌గా పరాశరన్ బాధ్యత పూర్తయింది. ఆలయ నిర్మాణ సంఘం అధ్యక్షునిగా మాజీ ఐఏఎస్ అధికారి నృపేంద్ర మిశ్రాను నియమించారు. స్వామి గోవింద్‌దేవ్ గిరిజీ మహరాజ్ కోశాధికారిగా, పరాశరన్ అధికార ప్రతినిధిగాను బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

సుప్రీంకోర్టు తీర్పు మేరకు వివాదాస్పద స్థలం 2.77 ఎకరాలు ఈ ట్రస్ట్‌కే కేంద్రం అప్పగించింది. అలాగే అక్విజిషన్ ఆఫ్ సర్టెన్ ఏరియా ఎట్ అయోధ్య యాక్ట్ 1993 మేరకు 67.703 ఎకరాల భూమి కూడా ఆలయం కోసం ఈ ట్రస్ట్‌కే అప్పగించారు. లార్సన్ అండ్ టూబ్రో, టాటా కన్సల్టింగ్ ఇంజనీర్స్ సంస్థలను నిర్మాణం కోసం ఈ ట్రస్ట్ నియమించు కుంది.

మహంత నృత్య గోపాల్‌దాస్ మహరాజ్.. అయోధ్య పుణ్యక్షేత్రంలో ఎంతో ప్రఖ్యాతుడు. అక్కడి అతి పెద్ద ఆలయం మణిరాం దాస్ చావనికి పీఠాధిపతి. దీనినే చోటి చావని అని కూడా అంటారు. ఇది అయోధ్యలో దర్శనీయ స్థలం కూడా. వివాదాస్పద కట్టడం కూలిన తరువాత విశ్వహిందూ పరిషత్ జనవరి 1993లో ఏర్పాటుచేసిన రామ జన్మభూమి న్యాస్‌కు నృత్యగోపాల్ దాస్ నాయకత్వం వహించారు. జన్మభూమిలో ఆలయ నిర్మాణానికి అంతర్జాతీయంగా మద్దతును కూడగట్టడమే న్యాస్ లక్ష్యం. జూన్ 11,1938న ఉత్తరప్రదేశ్‌లోని మరొక మహా పుణ్యక్షేత్రం మధురకు సమీపంలోని కెర్హాలాలో




మహంత్ నృత్యగోపాల్ దాస్



చంపత్‌రాయ్



నృపేంద్ర మిశ్రా



గోవింద్‌దేవ్ గిరిజీ

ఆయన జన్మించారు. 1953లో పదవ తరగతి ఉత్తీర్ణులైన తరువాత మధురలోని లాలా రామ్ కళాశాలలో వాణిజ్యశాస్త్రం చదవడానికి చేరారు. కానీ రెండేళ్ల తరువాత సనాతన విద్య మీద అభిమానంతో, సరిగ్గా గాంధీ జయంతి రోజున ఆయన ఇల్లు విడిచి అయోధ్యకు బయలుదేరారు. అయోధ్యలో మహంత రామమనోహరదాస్ మంత్రదీక్షను ఇవ్వడమే కాకుండా, నృత్యగోపాల్‌దాస్ మహరాజ్‌కు సంస్కృతం బోధించారు. కొద్దికాలం తరువాత వారణాసి వెళ్లి సంస్కృత విశ్వవిద్యాలయంలో చేరి, 'శాస్త్రి' పట్టా పొందారు. 1965లో ఘనంగా జరిపిన ఒక ఉత్సవంలో అయోధ్య మహంత్ పదవిని అప్పగించారు. అప్పటికి ఆయన వయసు 27 ఏళ్లు. తన గురువు రామమనోహర్‌దాస్ తరువాత మణిరామ్ చావని 6వ అధిపతిగా గోపాల్‌దాస్ బాధ్యతలు స్వీకరించారు.

గోపాల్‌దాస్ మహరాజ్ తన బాధ్యతలు నిర్వర్తిస్తూనే అయోధ్యలో అనేక ఆలయాలు నిర్మించారు. అందులో రామాయణ్ భవన్ ఒకటి. ఇంకా రంగనాథాలయం, శ్రీచార్‌ధామ్ ఉన్నాయి. ఇక అయోధ్య విముక్తి ఉద్యమం ప్రారంభం నుంచి అందులో ఉన్నారు. ఇందుకు కక్ష కట్టిన కొందరు 2001లో ఒక రోజు ఉదయం స్నానం, జపతపాల తరువాత సరయూ తీరం నుంచి



పరాశరన్

శిష్యులతో కలసి తిరిగి వస్తుంటే వారి మీదకు నాటు బాంబులు విసిరారు. అయితే చిన్న చిన్న గాయాలతో ఆయన బయటపడ్డారు. అప్పటి నుంచి ఆయనకు భద్రత ఏర్పాటు చేశారు. 2003లో రామచంద్ర పరమహంస దేహయాత్ర చాలించిన తరువాత న్యాస్‌కు నృత్య గోపాల్‌దాస్ నాయకుడయ్యారు. సుప్రీం తీర్పు తరువాత తీర్థ క్షేత్రకు అధ్యక్షులయ్యారు.

విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు చంపత్‌రాయ్ తీర్థక్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోనే బిజ్నోర్ జిల్లాకు చెందిన చంపత్‌రాయ్ 1946లో పుట్టారు. తండ్రి రామేశ్వరప్రసాద్ భన్సాల్. రాయ్ చిన్నతనం నుంచి స్వయంసేవక్. బిజ్నోర్ జిల్లాలోనే ధాంపూర్‌లో ఉన్న ఆర్ఎస్ఎం కళాశాలలో పనిచేశారు. అయోధ్య విముక్తి పోరాటంలో ఆయన పాత్ర కీలకమైనది.

మందిర నిర్మాణంలో మరొక కీలక వ్యక్తి నృపేంద్ర మిశ్రా. 1945లో పుట్టిన మిశ్రా1967నాటి ఉత్తర ప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. 2014–2019 మధ్య నరేంద్ర మోదీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అంతకు ముందు భారత టెలికామ్ శాఖ కార్యదర్శి. పద్మభూషణ్ అవార్డు గ్రహీత. 2023లో ఆయనను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఎమ్మెల్సీగా నియమించింది. మిశ్రా అలహాబాద్‌లోను, తరువాత హార్వార్డ్ విశ్వవిద్యాలయంలోను చదువుకున్నారు.

ట్రస్ట్‌లో ఇతర సభ్యులు: జగద్గురు శంకరాచార్య, జ్యోతిష్యపీఠం, వాసుదేవానంద సరస్వతి స్వామి (ప్రయాగ); జగద్గురు మాధవాచార్యస్వామి విశ్వప్రసన్న తీర్థ మహరాజ్, పెజావర్ మఠ్ (ఉడిపి); యుగపురుష్ పరమానందజీ మహరాజ్ (హరిద్వార్), స్వామి గోవిందగిరీజీ మహరాజ్ (పుణే), బిమలేంద్ర ప్రతాప్ మిశ్రా, డాక్టర్ అనిల్ మిశ్రా, కామేశ్వర్ చౌపాల్ (పట్నా, ఎస్సీ), మహేంద్ర దినేంద్రదాస్ (నిర్మోహి అఖాడా) తదితరులు ఉన్నారు. ★

# దీపోత్సవాలే కాని దురాగతాలు ఉండవు



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి
యోగి ఆదిత్యనాథ్

అయోధ్యలో ఇక మీదట రామనామ స్మరణే తప్ప తుపాకులు మోతలు వినిపించవు. అయోధ్యపుర వీధుల్లో రామోత్సవ్, దీపోత్సవ్‌లు మాత్రమే నిత్యం కనిపిస్తా, 'జై శ్రీరాం' నామసంకీర్తనతో మార్మోగుతుంది. కర్ఫ్యూలకు ఆస్కారం ఉండదు. శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠతో వివక్షకు తావులేని రామరాజ్యం సాకారమైనట్లయింది. అయిదు శతాబ్దాల కల నెరవేరిన మధుర క్షణం ఇది. దేశమంతటా రామ నామస్మరణతో ప్రతిధ్వనించడంతో త్రేతాయుగం లోకి వెళ్లినట్లుంది. ప్రజలు తమ ఆరాధ్యదైవాన్ని సముచిత స్థలంలో ప్రతిష్ఠించుకునేందుకు సుదీర్ఘకాలం పోరాడడం చరిత్రలో ఇదే మొదటిసారి. మందిర నిర్మాణం అనే రామకార్యం కోసం ఎందరో ఎన్నో త్యాగాలు చేశారు. పెద్ద సంఖ్యలో కరసేవకులు తుపాకీ కాల్పులకు బలయ్యారు. శ్రీరాముని దయవల్ల వారి త్యాగాలు, బలిదానాలు వృథాకాలేదు. ప్రతిభక్తుని, ప్రతి హిందువు హృదయంలో ఆనందం, విజయగర్వం, ఎనలేని తృప్తి నిండి ఉన్నాయి. ఈ సమీప భవిష్యత్తులోనే నగరి ప్రపంచ సాంస్కృతిక రాజధానిగా విలసిల్లుతుంది.

ఈ మహోత్సవం రాజకీయాలకు అతీతంగా జరగవలసిన ఉండగా, దురదృష్టవశాత్తు ఆ నీడలు సోకాయి. ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ఈ కార్యక్రమానికి హాజరుకాకపోవడమే అందుకు ఉదాహరణ. 1990లో ఆయన తండ్రి, దివంగత మాజీ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ రామ మందిరాన్ని వ్యతిరేకించారు. ఇప్పుడు అఖిలేష్ యాదవ్‌ను ఈ ఉత్సవానికి ఆహ్వానించగా రావడానికి అంగీకరించారు. అయితే రాజకీయ కారణాలతో ప్రతిపక్షాలతో పాటు ఆయన కూడా ఈ వేడుకకు దూరంగా ఉన్నారు. ★


# రెండో దీపావళిలా ఉంది



జనవరి 22న తాను రెండో దీపావళి జరుపుకుంటానని ఆఫ్రో–అమెరికన్ హాలీవుడ్ నటి, గాయని మేరీ మిల్బెన్ ప్రకటించారు. అయోధ్యలో జరిగిన ప్రాణప్రతిష్ఠ తనను అలాంటి అనుభూతికి లోను చేస్తున్నదని ఆమె అన్నారు. తాను భౌతికంగా ఆ ఉత్సవం దగ్గర లేను కాబట్టి ఇంటి దగ్గర రెండో దీపావళి జరుపుకుంటానని వివరణ ఇచ్చారు. ప్రజానీకమంతా ఈ సందర్భంగా పండుగ వాతావరణంలో ఒకచోటకు చేరడంలోనే అందమంతా ఇమిడి ఉందని ఆమె అన్నారు. ఇదే సమయంలో ఆమె భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన భారతదేశానికి సరైన నాయకుడనీ, ఆయన నాయకత్వంలో మన రెండు దేశాల మధ్య సత్సంబంధాలు పరిఢవిల్లుతాయని ఆమె ఆకాంక్షించారు. అంత మంచి నాయకుడు కాబట్టే మరొకసారి ఆయనకు భారత ప్రధానిగా అవకాశం వస్తుందని కూడా తాను విశ్వసిస్తున్నట్టు ఆ గాయని చెప్పారు. ఈసారి అమెరికాలో, భారత్‌లో జరుగుతున్న ఎన్నికలకు ఎంతో ప్రాధాన్యం ఉందని కూడా ఆమె అభిప్రాయపడ్డారు. ★



జనవరి 22న జరిగిన ప్రాణప్రతిష్ఠకు వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. ఆధ్యాత్మికవేత్తలు, పారిశ్రామికవేత్తలు, సినీ రంగ ప్రముఖులు కూడా ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. అంతా భక్తిప్రపత్తులతో బాలరామునికి మొక్కారు. కొందరి కంట ఆనందబాష్పాలు కురిశాయి.



రవిశంకర్ ప్రసాద్
(కేంద్ర మాజీ మంత్రి)



అనుపమ్ ఖేర్
(సినీ నటుడు)



భారతీ మిట్టల్, అమితాబచ్చన్, అభిషేక్, అనీల్ అంబానీ



ముఖేష్ అంబానీ దంపతులు



హేమమాలిని



చంద్రబాబు,
జస్టిస్ ఎన్వీ
రమణ



గాయకుల.. శంకర్, సోను, అనురాధా పోడ్వాల్



టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్ (సినీ ప్రముఖులు)




అరుణ్ (టీవీ రాముడు)




బాబా రామ్‌దేవ్
(యోగా గురువు)




శ్రీశ్రీ రవిశంకర్
(ఆధ్యాత్మికవేత్త)



ఉమా భారతి, సాధ్వి రితంబరి
(అయోధ్య ఉద్యమకారులు)









సినీ నటులు... రజనీ, చిరంజీవి, రామ్‌చరణ్, పవన్ కల్యాణ్



సచిన్
(క్రికెటర్)



మిథాలీరాజ్, సైనానెహ్వాల్
(క్రీడాకారులు)



రణ్‌వీర్ కపూర్,
అలియాభట్
(సినీనటులు)



అనిల్ కుంబ్లే
(క్రికెటర్)







సినీప్రముఖులు.. కంగనా, కత్రినా, వికికౌశల్, సుమన్

# జగమంతా ప్రాణ ప్ర



అయోధ్య రామాలయ ప్రారంభం నేడొక అంతర్జాతీయ స్థాయి మహోత్సవంగా ముగిసింది. ప్రపంచ దేశాల్లోని విభిన్న సంస్కృతులను ఏకీకరించడమే కాదు, విదేశీగడ్డలపై తన ప్రభావాన్ని బలీయంగా చూపుతోంది. పరమ పవిత్రమైన కార్యం నేపథ్యంలో, వివిధ దేశాల్లో వాహనాల ర్యాలీలు, రథయాత్రలు విస్తృతంగా కొనసాగాయి. అమెరికాలో 500 మందితో కూడిన కారు ర్యాలీ నిర్వ హించారు. కాలిఫోర్నియా, వాషింగ్టన్, షికాగో తదితర ప్రదేశాల్లో మోటారు వాహనాల ర్యాలీలను కోలాహలంగా నిర్వహించారు. రామమందిరం, అమెరికా, భారత్‌ల పతాకాలను ధరించి ఈ ర్యాలీలు నిర్వహించడం విశేషం. అయోధ్య రామాలయ ప్రారంభాన్ని పురస్కరించుకొని ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్ నగరంలో జనవరి 21న నిర్వహించిన రామ రథయాత్ర ఉత్సవంలో యూరప్ దేశాల నుంచి వెయ్యి మంది పాల్గొన్నారు. ఈఫిల్ టవర్‌వద్ద నిర్వహించిన ఉత్సవంలో ప్రవాస భారతీయులు భక్తి పారవశ్యంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ అందించిన సమాచారం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల్లో, వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. కేవలం యు.ఎస్.లోనే దాదాపు 300 ప్రదేశాల్లో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. యు.కె., ఆస్ట్రేలియా, కెనడా, మారిషస్ దేశాల్లోని 25,30,30, 100 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఇదిలావుండగా యు.ఎస్, కెనడా, జర్మనీ, ఫిజిలతో పాటు 50 దేశాలకు చెందిన ప్రతినిధులకు బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానాలు అందగా, వారిలో అత్యధికులు హాజరయ్యారు.

అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఎంతో ఉత్సాహంతో ఎదురుచూస్తున్న యునైటెడ్ కింగ్ డమ్‌కు చెందిన సనాతన సంస్థ (ఎస్ఎస్‌యుకె) బ్రిటిష్ పార్లమెంట్‌లో శంఖనాదం చేస్తూ ఉత్సవాలను ప్రారంభించింది. హౌజ్ ఆఫ్ కామన్స్‌లో శ్రీరాముడిని యుగపురుషుడిగా కీర్తిస్తూ చేపట్టిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్ఎస్‌యుకె సంస్థ సభ్యులు కాకభూషుండి సంవాద్ ప్రదర్శనతో పాటు భజన కార్యక్రమాన్ని చేపట్టడంతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. హారో ఎం.పి. బాబ్ బ్లాక్‌మ్యాన్, రాజ్‌రాజేశ్వర్ గురూజీ, బ్రహ్మర్షి ఆశ్రమానికి చెందిన స్వామి సూర్యప్రభా దీదీ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి నేతృత్వం వహించడంతో బ్రిటన్ పార్లమెంట్‌లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. యు.కె.లోని 200 దేవాలయాలు, సామాజిక సంస్థలు సంతకం చేసిన ఒక ప్రకటనను అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్ట్‌కు బాలరాముని విగ్రహ ప్రతిష్ఠకు ముందే అందజేశారు. ఈ ప్రకటనను 'సమైక్యతకు శాసనం' వంటిదిగా ధార్మిక నేతలు పేర్కొన్నారు. యు.కె.కు చెందిన శక్తిమంతమైన ధార్మిక సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా ఈ ఉత్సవాల్లో పాల్గొన్న 1.5 బిలియన్ల భక్త జనావళికి అభినందనలు తెలిపాయి.

**ఉత్తర అమెరికాలో...**

అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తర అమెరికా వ్యాప్తంగా హిందూ దేవాలయాలు వారంరోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాయి. ముఖ్యంగా అమెరికా, కెనడా దేశాల్లోని హిందువుల్లో అయోధ్య సెంటిమెంట్ బలంగా నాటుకుపోయింది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యు.ఎస్.ఎ)లోని మొత్తం 1100 హిందూ దేవాలయాలను పర్యవేక్షించే సర్వోన్నత సంస్థ హిందూ మందిర్స్ ఎంపవర్‌మెంట్ కౌన్సిల్ (హెచ్ఎంఈసీ) ఆధ్వర్యంలో ఉత్తర అమెరికా ప్రాంతంలోని చిన్న, పెద్దా దేవాలయాల్లో జనవరి 15 నుంచి వారం రోజులపాటు ఉత్సవాలు నిర్వహించారు. వీటికి హెచ్ఎంఈసీ అధినేత్రి తేజాల్ షా నేతృత్వం వహించారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజైన జనవరి 15న నిర్వహించిన శ్రీరామ నామ సంకీర్తన కార్యక్రమంలో వందలాది దేవాలయాలు పాలుపంచుకున్నాయి. రామాయణంలో వాల్మీకి పేర్కొన్న 108 సార్లు రామనామ జపాన్ని, ఆయా ఆలయాలకు చెందిన పూజార్లు తొలిరోజున ప్రారంభించారు. అనంతరం హెచ్ఎంఈసీ ఆధ్వర్యంలో అట్లాంటాకు చెందిన ప్రముఖ కళాకారుడు వినోద్‌కృష్ణన్ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాలయ ప్రారంభోత్సవం నాడు, యు.ఎస్.లోని దేవాలయాలను దీపాలతో దేదీప్యమానంగా అలంకరించి, శంఖనాదాలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. ఇండియన్ అమెరికన్ జర్నలిస్ట్, విదేశీ వ్యవహారాల నిపుణుడు ఫరీద్ జకారియా దావోస్‌లో మాట్లాడుతూ, ప్రపంచంలో హిందూమతం సహనానికి ప్రతీక అని, రామాలయ ప్రారంభం దేశాన్ని ఒక్కతాటి మీదికి తీసుకు రాగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

**మారిషస్ ప్రభుత్వ కీలక నిర్ణయం**

బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మారిషస్ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. రామమందిరం ప్రారంభం నాడు తమ దేశంలోని హిందూమతానికి చెందిన ఉద్యోగులకు రెండు గంటల పాటు ప్రత్యేక సెలవును ప్రకటించింది. అంటే జనవరి 22వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ సెలవు అమల్లోకి వచ్చింది. ఆ దేశ ప్రధాని ప్రవింద్ కుమార్ నేతృత్వంలో



కెనడాలో

# తిష్ఠ వేడుక



టైమ్స్ స్క్వేర్ యూఎస్ఏ

వాషింగ్టన్‌లో

మంత్రివర్గం ప్రత్యేక సమావేశం నిర్వహించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు జనవరి 12నే ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన తెలిపింది. అయోధ్యలోకి శ్రీరాముడి పునఃప్రవేశానికి గుర్తుగా, ఈ ఉత్సవాన్ని పరిగణిస్తున్నట్టు మారిషస్ ప్రభుత్వం పేర్కొంది.

మారిషస్‌లో హిందువుల జనాభా అధికం. 2011 జనాభా లెక్కల ప్రకారం ఇక్కడ మొత్తం జనాభాలో 48.5% హిందువులే. ఆఫ్రికా ఖండం మొత్తం మీద కేవలం మారిషస్‌లో మాత్రమే హైందవ మతానుయాయుల సంఖ్య అధికం. ఇక ప్రపంచ వ్యాప్తంగా చూస్తే భారత్, నేపాల్ తర్వాత మారిషస్ మూడో స్థానాన్ని ఆక్రమిస్తోంది. వలసపాలన కాలంలో పెద్ద సంఖ్యలో హిందువులను నాటి ఫ్రెంచ్, బ్రిటిష్ పాలకులు మారిషస్‌కు తరలించడం ఇక్కడ హైందవ వ్యాప్తికి ప్రధాన కారణం. బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుంచి ఈ వలసలు అధికంగా జరిగాయి. మొదటగా ఫ్రెంచ్ పాలకులు మారిషస్‌తో పాటు చుట్టుపక్కల ద్వీపాల్లో తాము పెంచే తోటల్లో పనికోసం వీరిని తరలించగా తర్వాత బ్రిటిష్ పాలకులు దీన్నే కొనసాగించారు.

**అయోధ్య-అయుథయ**

భారత్‌లో అయోధ్య మాదిరిగానే థాయ్‌లాండ్‌లో అయుథయ నగరం ఉంది. రెండు నగరాలకు మధ్య దూరం 3500 కిలోమీటర్లున్నప్పటికీ, రెండింటి పేర్లలో సారూప్యతను గమనించవచ్చు. మతపరమైన విశ్వాసం కూడా రెండు నగరాల్లో ఒక్కటే. ఈ నేపథ్యంలో జనవరి 22న అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం తేదీకి మూడు రోజుల ముందుగానే అయుథయ నగరం కూడా ఉత్సవాలను జరుపుకోవడం విశేషం. అయోధ్య ఆలయ ట్రస్ట్ వారు అయుథయ నుంచి కూడా మట్టిని సేకరించారు. అదే విధంగా థాయ్‌లాండ్‌లోని ఛవో ఫ్రయ, లోప్ బురి, పాసక్ నదుల నుంచి కూడా పవిత్రజలాలను సేకరించారు. ఛవో ప్రయ నది ఒడ్డునే ఉన్న అతి ప్రాచీన పట్టణం నెస్ట్‌లెడ్. ఇది బ్యాంకాక్ నగరానికి ఉత్తరాన 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీని సాంస్కృతిక నేపథ్యంలో యునెస్కో ప్రపంచ వారసత్వ నగరాల జాబితాలో చేర్చింది. అయుథయ, ఇతర నగరాల్లోని హిందూ దేవాలయాల్లో పెద్ద పరిమాణంలో స్క్రీన్‌లను ఏర్పాటు చేసి, అయోధ్యలో జరిగిన ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకించే ఏర్పాట్లు చేశారు.

హిందూ దేవాలయాల్లో ప్రమిదలను (దియాస్) వెలిగించి, రామాయణ గాథను నాటక రూపంలో ప్రదర్శించారు. శ్రీరామ భజనలను పెద్దఎత్తున నిర్వహించి ప్రసాద వితరణ చేశారు. అయుథయ పట్టణాన్ని థాయ్‌ల్యాండ్ దేశపు అయోధ్యగా పరిగణిస్తారు. ఈ పట్టణం మొట్టమొదటి పాలకుడు రామాథిబోడి దీనికి అయుథయగా నామకరణం చేశాడు. ఈ ప్రాంతంలో హైందవం, రామాయణ ప్రభావం ఎంత ఉన్నదీ అనే విషయమాన్ని ఇది తెలియజేస్తోంది. ఈ నగరాన్ని పరిపాలించిన తర్వాతి కాలపు రాజవంశాలు ముఖ్యంగా ఛక్రి రాజవంశం రామ పేరును కలిగి ఉండడాన్ని బట్టి వీరికి హైందవం, రామాయణం పట్ల గల మక్కువను తెలియజేస్తోంది. రామాయణం థాయ్ భాషలో 'రామాకిన్ ' పేరుతో ప్రాచుర్యంలో ఉంది. ప్రముఖ సంస్కృత పండితుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత సత్యవ్రత్ శాస్త్రి థాయ్ రామాయణం 'రామాకిన్'ను సంస్కృత భాషలోకి అనువదించారు. నిజానికి ఈ చారిత్రక నగరం అధికారిక నామం "ఫ్రనకోన్ సి అయుథయ". క్రీ.శ 1350లో స్థాపించిన ఈ నగరం సియామీస్ రాజ్యానికి రెండో రాజధానిగా ఉండేది. "రామథిబోధి"గా ప్రాచుర్యం పొందిన సియామీస్ రాజు అసలుపేరు "యు థాంగ్". రామాయణం ప్రభావం ఎట్లా ఉన్నదీ ఈ పేరును పరిశీలిస్తే తెలుస్తుంది. 1767లో బర్మా సైన్యం ఈ నగరంపై దాడిచేసి విధ్వంసం సృష్టించడంతో, ఇప్పుడు శిథిలాలు మిగిలాయి. 14 నుంచి 18వ శతాబ్దం మధ్యకాలంలో ఈ నగరం అతిపెద్ద వాణిజ్య కేంద్రంగా విలసిల్లింది.

బర్మా సైనికులు ఈ నగరాన్ని ధ్వంసం చేసిన తర్వాత కొత్త పాలకుడు రామ-1 పేరుతో పాలన కొనసాగించాడు. ప్రస్తుత బ్యాంకాక్ నగరాన్ని నిర్మించింది ఆయనే. ఈ పాలకుడే రామాయణాన్ని రామాకిన్ పేరుతో స్థానిక భాషలో రచించి జాతీయ చారిత్రక గ్రంథంగా ప్రకటించాడు. ఆయన బౌద్ధమతా వలంబికుడైనప్పటికీ రామునిపై అమిత భక్తిని ప్రదర్శించడం విశేషం.

భారత్-థాయ్‌లాండ్ దేశాల మధ్య కేవలం రామాయణం విషయంలో మాత్రమే కాదు, పండుగలు జరుపుకోవడంలో కూడా సారూప్యత కనిపిస్తుంది. ఇక్కడి ప్రజలు కార్తిక పౌర్ణమి, దేవదీపావళి వంటి పండుగలు జరుపుకుంటారు. దేశంలో శివుడు, గణేశుడు, పార్వతి, ఇంద్రుడు వంటి దేవతల విగ్రహాలు వివిధ ప్రదేశాల్లో కనిపిస్తాయి. బ్యాంకాక్‌లోని సువర్ణభూమి విమానాశ్రయంలో విష్ణుపురాణంలోని సముద్ర మథనానికి సంబంధించిన శిల్పాలను నెలకొల్పారు. ★



**జమలాపురపు విఠల్‌రావు**

సీనియర్ జర్నలిస్ట్



శ్రీ రామజన్మభూమి నిర్మాణం ప్రారంభం చేయడానికి సన్నాహాలు 2020లో ప్రారంభమయ్యాయి. నిర్మాణం కోసం అన్ని ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం, ఆలయ పునాది నిర్మాణం విషయంలో వరంగల్లులో సివిల్ ఇంజనీరింగు విభాగం ప్రవీణులు, శిల్పకళ, దేవాలయ నిర్మాణ శైలిలో విశేష పరిజ్ఞానం కలిగిన ప్రొ. పాండు రంగారావు (ఎన్ఐటి, రిటైర్డ్) పునాదుల విషయంలో ఏ మాత్రం రాజీ పడని వైఖరిని అవలంబించి, ఆలయం వెయ్యేళ్లకాలం నిలబడాలంటే కాకతీయుల కాలం నాటి రాతి పునాది వ్యవస్థను సరైనదని భావించి, అదే విషయాన్ని రామజన్మభూమి ట్రస్టుకు తెలిపే ప్రయత్నం చేశారు.

# శ్రీరామసేవలో ఉడుతా భక్తిగా...

శ్రీ రామజన్మభూమి పునాది నిర్మాణం ప్రారంభంలో పైల్ ఫౌండేషన్ పునాది వేయాలని భావించారు. అదే అయితే, స్టీల్, సిమ్మెంటు ద్వారా చెయ్యాలి. స్టీల్, సిమ్మెంటు ద్వారా నిర్మితమైన కట్టడం 80 నుండి 100 సం.లు మాత్రమే మనగలుగు తుంది. పైన ఉండే శిల్ప నిర్మాణం వేల సంవత్సరాలు మనగలుగుతుంది. పునాది ఆవిధంగా అయితే పైన శిలతో మందిరనిర్మాణం జరిగితే ఒక అసమతుల్యత ఏర్పడుతుందన్న విషయాన్ని గుర్తించారు. ఆ సమయంలో వారి స్నేహితుడు, ఎన్ఆర్ఎస్ఎ లో సైంటిస్టు, శ్రీ గంటా శ్రీనివాస రెడ్డి (Addl. Director General, TRAC, Hyderabad), ద్వారా నాకు పరిచయం అయ్యారు. మేము కలిసినప్పుడు, ఈ వివరాలు తెలియచేశారు. అదే సమయంలో హైదరాబాదు వచ్చిన విశ్వహిందూపరిషద్ సహ ప్రధాన కార్యదర్శి శ్రీ కోటేశ్వరశర్మతో నేను మాట్లాడి, ప్రొ. పాండురంగారావు గారిని, శ్రీనివాస రెడ్డి గారిని పరిచయం చేశాను. శర్మగారు జన్మభూమి తీర్థ క్షేత్ర వారితో ఈ విషయాన్ని చర్చించారు. శర్మగారి మధ్యవర్తిత్వం వల్ల ఈ విషయాన్ని చర్చించడానికి ట్రస్టు వారు సంసిద్ధతను వ్యక్త పరిచారు. మా ముగ్గురిని అయోధ్యకి పిలిచారు. 2020లో మేం ముగ్గురం లక్నో మీదుగా అయోధ్య చేరుకున్నాం. ఆరోజు శ్రీ చంపత్ రాయిజీతో కలిసి వివరాలు మాట్లాడిన తర్వాత మరుసటి రోజు ఉదయం జన్మ భూమి నిర్మాణ స్థలానికి చేరుకున్నాం. ప్రథమంగా శ్రీ రామ్ లల్లా దర్శనం అయ్యింది. ఎల్ అండ్ టీ ఇంజనీరింగు టీమ్‌తో నిర్మాణ స్థలం పరిశీలన జరిగింది. ప్రొ.పాండు రంగారావుగారు అక్కడ ఉన్న ఎల్ అండ్ టీ ఇంజనీరింగు విభాగం, జన్మభూమి ట్రస్టు వారికి, పవర్ పాయింటు ప్రెజెంటేషన్ ద్వారా రాతి పునాదుల శ్రేష్ఠతను, సిమెంట్, ఇనుము ఉపయోగం వల్ల జరుగనున్న హాని గురించి వివరించారు. కాకతీయులు ఉపయోగించిన "శాండ్ బాక్స్ టెక్నాలజీ", అక్కడ ఉపయోగించవచ్చు అనే విషయాన్ని ప్రస్తావించారు. జన్మభూమి ట్రస్టు వారు ఈ సాంకేతిక సూచనలన్నీ వారు ఏర్పాటు చేసిన టెక్నికల్ కమిటీకి నివేదించారు. ఈ టెక్నికల్ కమిటీ ప్రొ. పాండురంగారావు గారి సూచనల్ని పరిశీలించి పైల్‌ఫౌండేషన్ నుండి విరమించాలని నిర్ణయించారు.

**అయోధ్య భూగర్భంలో పొంచి ఉన్న విశేషం:**

ఇదే సమయంలో మా బృందం మరొక ముఖ్యమైన సాంకేతిక విషయాన్ని శ్రీ రామజన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్టు వారికి, ఎల్ అండ్ టి వారి దృష్టికి తీసుకురావడం జరిగింది. అదే సమయంలో ఎన్ఆర్ఎస్ఎ సైంటిస్టు, టిఆర్ఎసి అధిపతిగా ఉన్న శ్రీ గంటా శ్రీనివాసరెడ్డిగారితో నాకు ఉన్న శాటిలైటు పరిజ్ఞానంతో, అయోధ్యకు సంబంధించిన శాటిలైటు చిత్రాన్ని తీయించి పరిశీలించమని కోరాను. వారు వెంటనే సిద్ధం చేశారు. ఇందులో ఆసక్తి కరమైన విషయాలు బయటపడ్డాయి. 5000 సం.ల కిందట, అయోధ్యలోని రామజన్మ భూమి వెను కనే సరయూ నది ప్రవహించేది. ఆ నది ఆ తరువాత కాలంలో 5 సార్లు తన ప్రవాహ గతిని మార్చుకుంది. ప్రస్తుతం ఉన్న సరయూ నది 5వసారి మారిన గతిలో ప్రవహిస్తూంది. ఈ విషయాలు శాటిలైటు చిత్రంలో స్పష్టంగా కనపడ్డాయి. టెక్నికల్‌గా వీటిని ఫెయిల్యూర్ ఛానెల్స్‌గా వర్ణిస్తారు. భూమి లోపల వంద మీటర్ల లోతుల్లో ఈనాటికీ ఆ నది ప్రవహించిన మార్గంలో బురదతో నిండిపోయి సొరంగం మాదిరిగా ఉంటుంది. శాటిలైటు భూగర్భంలో ఉన్న ఈ మార్గాన్ని,(ఫెయిల్యూర్ ఛానెల్) స్పష్టంగా చూపెడుతుంది. ప్రథమ చానెల్, రామజన్మ భూమి అనుకుని భూ గర్భంలో ఉన్నందున, ఏ సమయంలో నైనా పైన ఉన్న భవ్యమైన మందిరానికి, ఏదైనా ఒక ప్రమాదం జరగడానికి అవకాశం ఉందనే విషయం ముందుగానే అందరి దృష్టికి తేవడం జరిగింది. రాబోయే వంద సంవత్సరాల్లో భారీ వరదలు సంభవిస్తే ఆ వరదనీరు చానెల్‌లోకి వస్తే, భూమి పైన ఉండే నిర్మాణం మీద ఆ ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

ఈ విషయం ఎల్ అండ్ టి ఇంజనీరింగు విభాగం, రామజన్మ భూమి ట్రస్టు వారి ఊహలో కూడా ఈ విషయం లేదు. ఆ ప్రమాదం ట్రస్టు వారికి, ఇంజనీరింగ్ విభాగం వారికి తెలిసిన తర్వాత ప్రమాద నివారణ కోసం ట్రస్టు అనేకమంది నిపుణులతో పై విషయాన్ని చర్చించి తగిన చర్యలు చేపట్టారు. ఈ విషయం శర్మ గారు ధృవీకరించారు. పైవిధాలుగా శ్రీ రామజన్మభూమి నిర్మాణ ప్రక్రియలో ఉడతా భక్తిగా మా యోగదానం చేయడం, మా అదృష్టం.

**- రామచంద్ర విష్ణుభట్ల**





# నీ ప్రతిష్ఠతో క్రొత్త వెలుగు రానీ..

జగదానంద బాలకా!
జయ బాలరామ శుభనామకా!
ప్రియ స్వాగతం రవికులదీపకా!

మంగళకరమౌ నీరాక
ధర్మానికి పూనిక ఔగాక!
ఇక భారతదేశము శ్రీకరమౌగాక!

నీ ధీరత, విజ్ఞత కడదాక
మా అందరికీ అలవడుగాక!
మా బ్రతుకే సుందరనందనమౌగాక!




వీరబాలుడై ఘోర తాటకని నేలకూల్చినావు
యాగ రక్షణము చేసి కౌశికుని
ప్రేమ బడసినావు
అస్త్రవిద్యతో రాక్షసాధముల అంతుచూసినావు
శివుని ధనువునే విరిచి జానకీమనసు గెలిచినావు
నీ ముద్దుమోము సమ్మోహనం
మునిబృందములకె వ్యామోహనం
నీ గుండె నిబ్బరం, సద్గుణం
ఆ పరశురామునికె విభ్రమం
ఆచంద్రతారకం నీ ప్రశస్తి ఆశ్చర్యకారకమురా!

ఈ అయోధ్యలో నీ ప్రతిష్ఠతో క్రొత్తవెలుగు రానీ
బాలబాలికలు నీ కథాంశములు చదివి వెలిగిపోనీ
పౌరులందరూ ఐకమత్యమున ప్రగతినందుకోనీ
శత్రు దేశములు కాళ్లబేరమున శరణువేడుకోనీ
రామబాణమై యువతయే
తన లక్ష్యసాధనం చేయనీ
రామభక్తితో జాతియే
శ్రీరామదండుగా మారనీ
నీ అడుగుజాడలే లోకరక్షయని
జనులు తెలుసుకోనీ



జొన్నవిత్తుల
రామలింగేశ్వరరావు



# జన్మనక్షత్రాలూ.. ప్రవర్తనలూ...



ఎక్కడైనా ఎంతో గొప్పవాళ్లైన మహర్షులు తపస్సు చేసీ చేసీ ప్రతిపాదించి అందించిన ఆ శాస్త్రం నేటి లోకంలోని అతి సామాన్యులు నిందిస్తూ, అవిశ్వసనీయమని ప్రచారం చేయడానికి కారణం..శాస్త్రంలో పసలేకపోవడం కానే కాదు. దాన్ని అభ్యసించిన ఈ వ్యక్తి పూర్తిగా చదివి ఉండకపోవడమో లేక సరికానివాని వద్ద అభ్యసించి ఉండడమో లేక జ్యోతిషం వంటి శాస్త్రానికి వాక్శుద్ధి ఉండి తీరాలి కాబట్టి అలాటి నిత్యానుష్ఠానం లేకపోవడమో మాత్రమే కారణం. ఈ చెప్పుకుంటున్న సిద్ధాంతం నిజమనడానికి ఆది కావ్యమైన శ్రీమద్రామాయణం అందులో కన్పడే రామ–లక్ష్మణ– భరత– శత్రుఘ్న – సీత– ఆంజనేయులు మాత్రమే. క్రమంగా పరిశీలించుకుంటూ వెడదాం! మచ్చుకి రాముని విశేషాల్ని గమనిద్దాం!




డా॥ మైలవరపు శ్రీనివాసరావు

ప్రవచనకర్త


**రాముడు - పునర్వసు**

**తతశ్చ ద్వాదశే మాసే చైత్రే నావమికే తిథౌ।**
**నక్షత్రే దితి దైవత్యే స్వోచ్చ సంస్థేషు పంచసు॥**

రామచంద్రుడు 12వ నెలలో (ద్వాదశే మాసే) పుట్టాడు. లోకంలో అందరూ 10వ నెలలోనే (త్రిపాదూర్ధ్వే) పుడతారు మనుష్య లక్షణాలున్నవారు. అయితే రాముడు మాత్రం తాను మానవుడు కానని తెలియజేస్తూ 12వ నెలలో పుట్టాడు. ఇది నిజం కాబట్టే రావణుడు నాగాస్త్రాన్ని వేసి వీరి సైన్యాన్ని మొత్తం నాగ పాశాస్త్రాలతో బంధించి వేస్తే శ్రీ విష్ణు వాహనమైన గరుడుడు ఒక్కసారిగా ఆ నాగాస్త్రాన్ని ఛేదించి రామాదులందర్నీ పాశవిముక్తుల్ని చేయించుకోగలిగాడు. అందుకే రాముణ్ణి ఎవరైనా ఆత్మ పరిచయాన్ని అడిగితే 'ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్' – నన్ను నేను మనుష్య జాతికి చెందినవానిగా, అందునా దశరథ మహారాజు పుత్రునిగా అనుకుంటూ ఉంటాను – అన్నాడు. లోకంలో ఎవరైనా తమని గురించి తాము గాని అక్షతలు పడేవరకూ (శ్రీరామనవమి) ఆగి ఆ మీదటే ముహూర్తాలను చూసుకుని నిర్వహించుకుంటారు వాటిని. అందుకే ఇది 'శ్రీమాన్' శుభకరమైన మాసమంది శాస్త్రం.

**చైత్రమాసం**

అంతేకాదు, చైత్రే మధురభాషేస్యాత్ అని జ్యోతిశ్శాస్త్రం చెప్తోంది. చైత్రమాసంలో పుట్టినవాడు తియతియగా మాట్లాడతాడని దీనర్థం. లోకంలో ఓ నిందా వాక్యముంది. 'అబ్బో! వాడు తీయతీయగా మాట్లాడుతాడు అని (చేసే ప్రతి పనీ మాత్రం దానికి విరుద్ధంగా ఉంటుందనే అర్థంలో). అలాటి వ్యక్తి కాదు రాముడు. తియతియ్యగా మాట్లాడేవాడు – అంటే అవతలివాడెంతటి కఠినంగా మాట్లాడినా – ఎదురు తిరిగి అంతకంటే కఠినంగా మాట్లాడుతూ, గొంతు బిగ్గరగా చేసుకుని నోరు మూయించేవరకూ ఆగనివాడనేది అర్థం కాదు. అది నేటి కాలంలో ఉం(టుం)ది. వాలిని ఒకే బాణంతో రాముడు వధించాడు. నేలన వెల్లకిలాపడిన వాలి, తన వింటికి పైభాగాన ఉన్న వంపు (కొప్పు అంటారు) మీద తలపెట్టి పరమ ప్రశాంతంగా వాలి, తనని నింది స్తూన్న ఆ మాటల్ని చివరి అక్షరం వరకూ ఏకాగ్రతతో విన్నాడు. 'సమాధానం చెప్పు!' అని వాలి అన్నాక రాముడు, ఆ వాలి తనని నిందించిన ప్రతి వాక్యానికీ సమాధానాన్ని సవివరంగా చెప్పాడు. అంతా విన్న వాలి తనంత తానుగా – మరెవరి ప్రోత్సాహమూ లేకుండా–తనది తప్పేనని అంగీకరిస్తూ రామునికి త్రికరణశుద్ధిగా నమస్కరించాడు. పుత్రుడైన అంగదుడూ భార్య తారా కూడా వాలి దోషాన్ని అంగీకరించారు. అంతటి మెత్తని శైలితో ప్రతి వ్యక్తీ చెవులతో కాకుండా హృదయంతో వినేలా మాట్లాడగల నైపుణ్యమున్నవాడు రాముడు. చైత్రమాసంలో పుట్టడం దీనికి కారణం.

ఇలా అన్నట్లయితే ఏమనుకుంటాం? అందుకే రాముడు శ్రీహరే అనే విషయాన్ని శ్రీమద్రామాయణం స్వయంగా చెప్పినా – రాముడు దాన్ని బహిరంగ పరచకున్నా ఒకటి రెండు సందర్భాల్లో నిరూపించు కున్నాడు శ్రీహరి స్వరూపమే అని. రాముడు కృష్ణుడూ అనే ఇద్దరూ భగవదవతారమూర్తులే అయినా – రాముడు తనని భగవంతుడని వాచ్యంగా (నోటి మాటతో) చెప్పడు. కృష్ణుడు చెప్పకుండానూ, తన భగవదంశని నిరూపించుకోకుండానూ లేదు. **(కృష్ణస్తు భగవాన్ స్వయమ్– అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః)**

12వ నెలలో అందునా చైత్రమాసంలో (చైత్రే) పుట్టాడు. చైత్ర శ్రీమానయం మాసః – చెట్ల ఆకులన్నీ చిగురిస్తాయి. పండ్లని కాస్తాయి, పుష్పాలన్నీ విచ్చుకుని కన్పిస్తాయి. ప్రతి పుష్పమూ తుమ్మెదల ద్వారా తేనెని ఆహారంగా వాటికందిస్తూ కన్పిస్తాయి. మనుష్యులకైతే గాదెలన్నీ ధాన్యంతో నిండి కన్పిస్తాయి. మొత్తం పశుపక్షి జలచరాది అన్ని జీవరాశులకీ ఆహారం పుష్కలంగా లభిస్తుంది. లోకంలో అందరికీ ధాన్యాదులు లభించే కారణంగా సంతానానికి వివాహాదుల్ని తలపెట్టాలనే శుభకార్యాలోచనలు వస్తాయి. ఈ రాముని శిరసున

**నవమి తిథి**

'నిర్భయస్సర్వభూతేభ్యో నవమ్యా ముపజాయతే' – నవమీ తిథి అందునా శుద్ధపక్షంలో గాని జన్మిస్తే భయం లేకుండా మాట్లాడగలిగేవాడౌతాడని జ్యోతి శాస్త్రం చెప్తోంది. భయమనేది ఎప్పుడు కలుగుతుంది? సత్యం వద –ధర్మం చర అనే రెండు వాక్యాలకీ విరుద్ధంగా అసత్యాన్ని మాట్లాడుతున్నా – లేదా– అధర్మాన్ని ఆచరిస్తున్నా మాత్రమే కదా

భయం పుడుతుంది. అలాంటి అసత్య అధర్మ భయాలు ఆయనకి లేకపోవడానిక్కారణం శుద్ధ నవమి నాటి పుట్టుక. ఇది నిజం కాబట్టే – రాముడు, అరణ్యాలకి వెళ్తున్న వేళ కౌసల్య (సొంత తల్లి) తీవ్రంగా దుఃఖిస్తూ 'భర్త ఉండగానే పుత్రుణ్ణి కోల్పోయినంత బాధని అనుభవించ వలసి వస్తోందనీ– సవతి (కైకమ్మ) తనమీద ఇంతటి అధికారాన్ని చెలాయిస్తోందని రామునికి చెప్పు కుంటూ తాను కూడా రాముని వెంట వచ్చేస్తానని పలికింది. దానికి రాముడు బదులు పలుకుతూ **'పితురాజ్ఞా పరో ధర్మః స్వధర్మో మాతృరక్షణమ్'** తల్లీ! నాన్న ఆజ్ఞని పాటించడమనేది పుత్రునికి కర్తవ్యం – ధర్మం కూడా. అందుకని అరణ్యాలకి వెళ్లి తీరాల్సిందే. అది కూడా నేను మాత్రమే. ఆజ్ఞాపించిన ఆ ఆజ్ఞలో నీ పేరు లేదు. ఇక భర్త వెంట – అందునా మరణ భయం దాదాపుగా ఉన్న భర్త వెంట 'ధర్మ–పత్ని'గా నువ్వు ఉండి తీరాల్సిందే అని స్పష్టంగా చెప్పాడు. కైకమ్మ తననిలా అరణ్యాలకి పంపించి వేస్తోందనీ – సుమిత్రామాత దశరథుని ఎందుకు నిలదీయలేదనీ ఏ మాత్రమూ అనకుండా తన కర్తవ్య విధిని మాత్రమే చెప్తూ అరణ్యాలకి వెళ్ళిపోయాడంటే దానిక్కారణం తనది శుద్ధ నవమి జన్మ కావడమే.

**పునర్వసు నక్షత్రం**

ఆకాశంలో కన్పిస్తాయి నక్షత్రాలనీ ఆయా రూపాల్లో ఖగోళ దృష్టి ఉన్నవారు గనుక పరిశీలిస్తే ఆ విషయం అవగాహనకి వస్తుంది. హస్తా నక్షత్రం అరచేతి వేళ్లు విప్పిన తీరుగా కన్పిస్తుంది. కృత్తిగా నక్షత్రం తెరిచిన మంగలి కత్తిలా ఉంటుంది. మృగశీర్షా నక్షత్రం మృగం తలలా కన్పిస్తుంది. ఈ క్రమంలో పరిశీలిస్తే పునర్వసూ నక్షత్రం అనేది 5 నక్షత్రాలు ఓ వింటి ఆకారంలో ఉంటూ కన్పిస్తుంది. ఇది నిజం కాబట్టే రాముడెప్పుడూ ధనుస్సుని ధరించకుండా కన్పించడు. ధనుస్సనే శబ్దానికి ధర్మమనేది కూడా అర్థం కాబట్టి, రాముడెప్పుడూ తానెవరిని వధించ ప్రయత్నించినా ఆ సందర్భంలో ఆ ఎదుటి వ్యక్తి జంతువు పశువు పక్షి...మరణిస్తే తన బాణం ధర్మబద్ధమనీ– అందుకు భిన్నంగా జరిగితే తనదే అధర్మమనీ – ఆ ధనువుతో తన ధర్మాధర్మాలని పరీక్షించుకుంటుండేవాడు. 'సమరే చింతయాస్థితమ్' యుద్ధ సందర్భంలో రాముడు తన ఎదురుగా ఉన్న రావణుని మీద ఎన్ని బాణాలను ప్రయోగించినా ఒక్కటీ పనిచేయకపోవడంతో యుద్ధభూమిలో చింతతో నిలిచిన రాముడు రావణుని తపశ్శక్తి తనకంటే ఎక్కువని గ్రహించగలిగాడు. ఆ సందర్భంలో అగస్త్య మహర్షి సూర్య వంశీయుడు రాముడు కాబట్టి ఆ ఆదిత్యశక్తిని ఆదిత్యహృదయ స్తోత్ర మహామంత్రం ద్వారా రామునికి ఉపదేశించి రావణ విజయాన్ని సాధించేలా చేసాడు. అందుకే రాముడు తాటకా వధకు (తాటకి అనడం తప్పు) ధనుష్టంకారాన్ని చేశాడు. దాని శక్తి ఎంతటిదో గమనించడానికి. వెంటనే అర్థమయింది దాని శక్తి. వధించనే వధించాడు దాన్నీ దాని పుత్రుడైన మారీచుని స్నేహితుడు సుబాహువునీ కూడా. తన వింటికి పని చెప్పి మారీచునికి మోక్షాన్నీయవలసి ఉంది. కాబట్టి మారీచుణ్ణి మాత్రం సముద్ర మధ్యంలో పడేలా బాణంతో కొట్టి అప్పటికి బతికేలా చేసాడు. రామబాణం తగిలిన మరుక్షణం నుండీ మారీచునికి రామమంత్రోపదేశ మైనట్లయింది. దాంతో రామధ్యానపరుడూ, రావణ విరోధీ అయ్యాడు మారీచుడు. అంతటి శక్తి పునర్వసు నక్షత్ర జన్మ కారణంగానే.

**పంచగ్రహాలూ ఉన్నతంగా...**

స్వ + ఉచ్చసంస్థేషు + పంచసు – ఏయే నక్షత్రాలకి ఏదేది ఉచ్చస్థానమో – అంటే – సర్వశక్తి ఫలితాన్ని ఇచ్చేదో అలా రవి మేషంలో – అంగారకుడు (కుజుడు/మంగలుడు) మకరంలో – శని తులలో– గురువు (బృహస్పతి) కర్కాటకంలో – శుక్రుడు మీనంలో ఉండగా పుట్టాడు రాముడు.

ఒక్క గ్రహంలో ఉచ్ఛగనుక ఉంటే సర్వ అరిష్టాలనీ తొలగించుకోగల ఆత్మస్థైర్యం కలవాడౌతాడు. అందుకే అయోధ్యా రాజ్యం నుండి పంపినా, పోనీ అయోధ్య పొలిమేరల్లో కూడా కాకుండా దూరంగా, అయోధ్యకు సంబంధంలేని దండకికి పంపేసినా, అక్కడ సీతమ్మను కోల్పోగొట్టు కున్నా– సీతా రక్షణ కోసం తనంత తానే వచ్చిన జటాయుపక్షిని రావణుడు వధించి తనకి ఆత్మీయుడు లేకుండా అయిపోయినా – ఏ మాత్రపు ధైర్యాన్నీ కోల్పనే లేదు రాముడు. (ఏకగ్రహోచ్ఛ జాతస్య సర్వారిష్ట నివారణమ్)

ద్విగ్రహోచ్చేతు సామంత రెండు గ్రహాలు ఉచ్చలో గనుక ఉంటే సామంతరాజుగా ఉండేవాడౌతాడు. రామునికి 5 గ్రహాలు ఉచ్చలు ఉన్నాయిగా! అందుకే సామంతరాజుగా కావడం, యుద్ధాలని చేసి రాజుగా ఉన్నత స్థితిని పొందడం... వంటివి లేనే లేవు.

త్రిరుచ్చేతు మహీపతిః – మూడు గ్రహాలు గనుక ఉచ్చలో ఉంటే ఆ వ్యక్తి మహీ (భూమికి) పతిః (భర్త) అంటే ఓ రాజుగా అవుతాడు – అయితే అనేక ప్రదేశాలున్న విశాలభూమికి రాజౌతాడు. రాముడు పంచగ్రహాలూ ఉచ్చలో ఉండగా పుట్టినవాడు కాబట్టి సాధారణ రాజు కానే కాలేదు.

చతుర్గ్రహోచ్చే సమ్రాట్– నాలుగు గ్రహాలు ఉచ్చ గనుక ఉంటే సమ్రాట్టు కాగలుగుతాడు. అందుకే ప్రారంభంలోనే యువరాజుగా పట్టాభిషేకాన్ని పొందాడు. అది వారసత్వం ప్రకారంగా కావచ్చు – లేదా– సాహసపరాక్రమ ప్రదర్శనాదులవల్ల కావచ్చు.

ఇక పంచోచ్చే లోక నాయకః – అని జ్యోతిశ్శాస్త్ర వచనం. ఆ కారణంగానే లోకమంతటికీ నాయకుడు కాగలిగాడు. నాయకుడంటే ఏదో ఓ వందమందిని తన వెంట ఉంచుకుని తిరిగేవాడూ– వాళ్లని తిప్పుతూ ఉండేవాడనేది దాని అర్థం కాదు. నయతి నాయయతీతి వా నాయకః తాను నడుస్తూ అదే ధర్మమార్గంలో అందర్నీ కూడా నడుస్తూ ఉండేలా నడిపించేవాడని దీని భావం.

ఇది నిజం కాబట్టే తాను ధర్మమార్గాన్ని ఏనాడూ తప్పకుండా–ధర్మమార్గాన్ని తప్పిన వానర జాతివాడైన వాలినీ, ధర్మమార్గాన్ని తప్పిన రాక్షసజాతివాడైన రావణుణ్ణీ, స్త్రీ అయిన తాటకనీ, మహాద్భుత శివతపఃశ్శక్తిమంతులైన ఖర దూషణ త్రిశురుల్నీ, వధించాడు. మరి అవే జాతుల్లో ఉన్న – అంటే– వానర జాతివాడైన సుగ్రీవుణ్ణీ– రాక్షసజాతివాడైన విభీషణుణ్ణీ–రాక్షసజాతివాడైన మారీచుణ్ణీ– పక్షిజాతికి చెందిన జటాయువుకి తానే అంత్యక్రియలని చేయడమేగాక ఉత్తమలోకాలని ధారపోసి మోక్షాన్నియ్యడాన్నీ చేసాడు రాముడు.




జటాయు, రామలక్ష్మణులు

ఇలా అనేక లక్షణాలు రామునిలో తన జన్మనక్షత్ర కారణంగా కన్పిస్తాయి. ఇదే తీరు పరిశీలన చేస్తే ఉత్తర ఫల్గుని (ఉత్తర అంటారు వ్యవహారంలో)లో పుట్టిన సీతమ్మనీ– ఆశ్లేషా నక్షత్రంలో పుట్టిన లక్ష్మణుణ్ణీ – పుష్యమిలో పుట్టిన భరత శత్రువుల్నీ – దశమీ తిథిలో పుట్టిన కారణంగా మరికొని విశేషాలనీ– పూర్వాభాద్ర నక్షత్రంలో పుట్టిన ఆంజనేయుణ్ణీ సోదాహరణంగా తెలుసుకోగలం. ఈ మొత్తం ఆరుగురే ఎలా ఒకటయ్యారో ఆ విశేషాలనీ అర్థం చేసుకోగలం.

శ్రీరామచంద్రానుగ్రహాస్తు ★

# అయోధ్య: హిందువుల



సృష్టికర్త బ్రహ్మ. ఆయన నుంచి ఉద్భవించిన వాడు మరీచి. ఆయన కుమారుడు కాశ్యపుడు, అయన కుమారుడు సూర్యనారాయణుడు, ఆయన కుమారుడు వైవశ్యతుడు. ఆయనే అయోధ్యను నిర్మించి, పాలించాడు. ఆయన కుమారుడు ఇక్ష్వాకుడు, ఆయన కుమారుడు కుక్షి, ఆయన కుమారుడు వికుక్షి, ఆయన కుమారుడు బాణుడు, ఆయన కుమారుడు అనరణ్యుడు (రావణుని చేతిలో హతమయ్యాడు). ఆయన కుమారుడే పృథువు ఆయన కుమారుడు త్రిశంఖు దుందుమారుడు మాంధత – సుసంధి– ధ్రువసంధి భరతుడు (జడభరతుడు) – అశితుడు సగరుడు అసమంజ సుడు–అంశుమంతుడు– దిలీపుడు– భగీరధుడు– కకుత్సుడు– రఘువు (రఘువంశం)–ప్రవుర్ధుడు– శంఖనుడు–సుదర్శనుడు –అగ్నివర్ణుడు – శీఘ్రవేదుడు–మరువు – ప్రశిష్యకుడు – అంబరీషుడు (ఏకాదశవ్రతం) – నహుషుడు – యయాతి– నాభానుడు– అజుడు– దశరథుడు – కుమారుడు శ్రీరాముడు. ఆయన కుమారులు కుశుడు, లవుడు. దేవదానవుల యుద్ధంలో దేవతల పక్షాన పోరాడిన మాంధాత, రఘువు, దశరథుడు వంటి వారు ఎందరో ఈ వంశంలో జన్మించారు.

**అయోధ్య చక్రవర్తులు - రావణుడు**

కైకసి కుమారుడు రావణుడు. రాముని కంటే కొన్ని లక్షల సంవత్సరాల పూర్వీకుడు. ఇక్ష్వాకుడు కుమారుడైన మాంధాత మొదటిసారిగా రావణునితో యుద్ధంలో తలపడతాడు. అయితే బలపరాక్రమా లలో ఎవరికి ఎవరూ తీసిపోని కారణంగా ఎవరూ గెలవని పరిస్థితి. అనంతరం అంటే కొన్ని వేల సంవత్సరాల తర్వాత పృథువు తండ్రి అనరణ్యుడు రావణునితో తలపడి అతని చేతిలో మరణిస్తాడు. తన వంశంలో పుట్టిన వాని చేతిలోనే నీవు మరణిస్తావని రావణుని అనరణ్యుడు శపిస్తాడు. అనరణ్యుని నుంచి 28 తరాల తర్వాత అంటే ఆ కాలంలో ఒక్కొక్క చక్రవర్తి సుమారుగా 40 నుంచి 50 వేల సంవత్సరాలు రాజ్యపాలన చేశారు. ఆ విధంగా లెక్కచూస్తే అనేక లక్షల సంవత్సరాల అనంతరం రాముడు అయోధ్యలో జన్మించారు. అదే మన రామజన్మభూమి కథ.

ఒక మన్వంతరంలో 71 మహాయుగాలు. ప్రస్తుతం మనం వైవశ్వత మన్వంతరంలో 28 మహాయుగంలోని కలియుగంలో ఉన్నాం. రాముడు 24వ మహాయుగంలోని త్రేతాయుగంలో జన్మించాడు. రావణ సంహారానంతరం రాముడు అయోధ్యకు తిరిగి వచ్చి పట్టాభిషిక్తుడై రమారమి పదివేల సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. ఆయన సుపరిపాలన కారణంగా రామరాజ్యపాలన అనే నానుడి ప్రజలలో ఏర్పడి ఇప్పటికీ దానినే మనము కోరుకుంటున్నాం. రాముని తర్వాత కుశుడు అయోధ్యను పాలించాడు.

భృగువంశానికి చెందిన వాల్మీకి రాముని పాలనకు ప్రత్యక్ష సాక్షి. కావున ఆయన చేత రామాయణ మహా కావ్యాన్ని రచింపచేశాడు బ్రహ్మ. రుక్షుడు అనేది వాల్మీకి అసలు నామం.

**పోరాటం: మరికొన్ని అంశాలు**

మీర్ బకీ ఆధ్వర్యంలో బాబర్ సేన దాడి చేసినప్పుడు తమ ఆరాధ్యదైవమైన శ్రీరాముని ఆలయాన్ని రక్షించుకున్నది మధ్య భారత్‌కు చెందిన మహంతులు, రామవంశజులు అని చెప్పుకునేవారు, రాజపుత్రులు చేసిన ప్రయత్నం ఫలించకపోగా లక్షా 74 వేల మంది చనిపోయారని బాబర్‌నామాలో పేర్కొన్నట్టు చెబుతారు. రక్తంతో తడిసిన ఇటుకలను లాహోర్లో నిర్మించే మసీదుకు తరలించారని చరిత్రకారుల కథనం.

హుమాయున్ షేర్షాను ఓడించి ఢిల్లీ పీఠాన్ని ఎక్కిన తర్వాత జన్మస్థాన్‌కు వచ్చే హిందువులపై పన్నులు వేయడం, జరిగిందని కొన్ని కథనాలు చెబుతాయి. దీన్ని వ్యతిరేకించిన హిందువులు, సూర్యవంశ క్షత్రియులు, సరిసిద, రాజ్‌పూర్ పరిసర ప్రాంతంలోని హిందూ సేనలను సమీకరించి మొట్టమొదటి సారిగా బాబ్రీ కట్టడంపై దాడి చేసి



ప్రపంచంలో నాగరికత వెల్లివిరిసిన మొట్టమొదటి రాజ్యం అయోధ్య. సూర్యవంశ రాజులు రాజధానిగా చేసుకున్న ప్రాంతం అయోధ్య. సూర్యుని కుమారుడు వైవస్వత మనువు అయోధ్యను లక్షల సంవత్సరాల క్రితమే నిర్మించాడు. ఆయన కుమారుడు ఇక్ష్వాకుడు. ఆయన పేరున ఇక్ష్వాకుల వంశం వచ్చింది. ఆ వంశంలో పుట్టిన వాడు పృథువు. ఆయన సమస్త భూమండలాన్ని జయించాడు. కాబట్టి భూమికి పృథ్వి అనే పేరు వచ్చింది. దానికి అయోధ్య రాజధాని. రఘువు అనే చక్రవర్తి కారణంగా అదే వంశానికి రఘువంశం అనే నామం సార్ధక మయింది. శ్రీరాముడు అదే వంశంలో పుట్టి తన సుపరిపాలన చేత రఘుకుల తిలక అనే పేరును సముపార్జించాడు.



**గార్ల శంకర్**
సీనియర్ జర్నలిస్ట్




పరశురామ మఠానికి చెందిన సమర్థ రామదాసు శిష్యుడు వైష్ణవదాసు నాయకత్వంలో సంతులు, సాధువులు రామజన్మభూమి సేవకులు ఏకమై మొగల్ సేనతో తలపడ్డారు. ముందుగా రాముడిని అక్కడి నుంచి తరలించి గుడికి పశ్చిమాన ఉన్న బావిలో పడవేశారు. ఊర్వశి కుండ్ ప్రాంతంలో మొగలులతో ఏడు రోజుల పాటు భీకర యుద్ధం చేసింది రామసేన. మొగల్ సేన తోకముడిచి వెనుదిరగక తప్పలేదు.

మొగలులు కట్టిన పలు కట్టడాలను ధ్వంసం చేశారు. అయితే మొగలులు తిరిగి సైన్యాలను సమీకరించుకుని ప్రతీకారంతో హిందూసేనను, అయోధ్య చుట్టుపక్కల గ్రామాలను ధ్వంసం చేశారని, సుమారు పది వేల మంది హిందూసేనను చంపివేశారని కథనం. హుమాయున్ మరణానంతరం హిందూ సేనలు జన్మస్థానాన్ని రక్షించుకోవాలనే ధృఢ సంకల్పంతో బాబ్రీ కట్టడంపై దాడిచేసి, అక్బర్ సేనతో తలపడి కొంతమేరకు సఫలీకృతమయ్యారు. కట్టడానికి ఎదురుగా ఒక వేదికను ఏర్పాటుచేయగలిగారు. ఔరంగజేబు కాలంలో హిందువులకు కొత్త ఇక్కట్లు తప్పలేదు.

జనరల్ జబాజ్ ఖాన్ ఆధ్వర్యంలో మొగల్ సైన్యం అయోధ్యపై దండెత్తడానికి వస్తుందని తెలుసుకున్న హిందువులు చుట్టుపక్కలనున్న అనేక మంది హిందూసేనను మోహరించగలిగారు. పరశు రామ మఠానికి చెందిన సమర్థ రామదాసు శిష్యుడు వైష్ణవదాసు నాయకత్వంలో సంతులు, సాధువులు రామజన్మభూమి సేవకులు ఏకమై మొగల్ సేనతో తలపడ్డారు. ముందుగా రాముడి విగ్రహాన్ని అక్కడి నుంచి తరలించి గుడికి పశ్చిమాన ఉన్న బావిలో పడవేశారు.

ఊర్వశి కుండ్ ప్రాంతంలో మొగలులతో ఏడు రోజుల పాటు భీకర యుద్ధం చేసింది రామసేన. మొగల్ సేన తోకముడవక తప్పలేదు. అయితే ఔరంగజేబు తన సేనను మరల అయోధ్య ముట్టడికి పంపగా సుమారు పదివేలమంది హిందువులు మరణించారని అంచనా. హిందూ సేనలు చేసిన బలిదానానికి గుర్తుగా అయోధ్య చుట్టుపక్కల ప్రజలు నేటికీ శ్రీరామనవమి నాడు తమ పూర్వీకుల స్మృత్యర్థం పూలు, పండ్లు సమర్పించుకుని వారి సాహసాలను గుర్తు చేసుకుంటూ ఉంటారు.

**లక్నో నవాబుల పెత్తనం**

ఢిల్లీలో మొగలుల పతనానంతరం కూడా హిందువుల కష్టాలు తీరలేదు. లక్నో నవాబులు కూడా జన్మస్థానంపై పెత్తనం చెలాయించడానికి ప్రయత్నించారు. నవాబ్ నజీరుద్దీన్ హైదర్ కాలంలో హిందువులు జన్మస్థాన్‌పై పట్టు సాధించగలిగినా అది ఎక్కువ కాలం ఉండలేదు. మరల నవాబుల ఆక్రమణలోనే చాలా కాలం ఉండిపోయింది. మొదటి స్వాతంత్ర్య సంగ్రామం సమయంలో రెండు రోజుల పాటు జరిగిన భీకర యుద్ధంలో అయోధ్య దాని చుట్టు పక్కల ఉన్న అనేక చిన్నపాటి హిందూ రాజులు ఏకమై పాల్గొన్నారు. ఆ యుద్ధంలో రెండువైపులా అనేక గ్రామాలు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. రాజా మాన్‌సింగ్ మధ్యవర్తిత్వంతో నవాబు మొత్తబడి రామ్ సేవకులకు మరల గద్దె నిర్మించుకొని పూజలు చేసుకోవడానికి అనుమతినిచ్చారు (అక్బర్ కాలంలో మొదటి గద్దె నిర్మితమైందని ఒక కథనం).

బ్రిటిష్ ఇండియాలో 1912లో చిన్నపాటి యుద్ధాన్ని చూసింది అయోధ్య. బ్రిటిష్ సేనపై హిందువులు దాడిచేసి కట్టడాన్ని కొంత మేర ధ్వంసం చేశారు. 1934లో నికోల్సన్ అనే అధికారి ధ్వంసం అయిన కట్టడానికి మరమ్మతులు చేసి పునరుద్ధరించారు. 1949లో గద్దెపై రామ్‌లల్లా విగ్రహాన్ని ఎవరో ఏర్పాటు చేయడంతో వివాదం రాజుకుంది. అప్పటి నుంచి హిందువులు, ముస్లీంలు ఆ స్థలంపై పెత్తనానికి ప్రయత్నాలు చేస్తూ కోర్టులో కేసులు వేసుకున్నారు.

1986లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం గేట్లు తెరచి పూజలు చేసుకోవడానికి అనుమతి నిచ్చింది. 1992 డిసెంబర్ ఆరవ తేదీన బాబ్రి కట్టడాన్ని హిందూ సేనావాహిని, కరసేవకులు, కార్యకర్తలు ధ్వంసం చేశారు. 2019న సుప్రీం కోర్టు సంచల తీర్పునిస్తూ స్థలం రామ జన్మస్థలం అని నిర్ధారించింది. ★

**శ్లో : అయోధ్య మధురా మాయా కాశీ కాంచి అవంతిక**
**పూరీ ద్వారావతి చైవ సప్తైతే మోక్షదాయకాః**

**భావం :** అయోధ్య, మధుర, కాశీ, కంచి, అంవతిక, పూరి, ద్వారక మోక్షదాయ క్షేత్రాలుగా ప్రసిద్ధి.



# ప్రతి రేణువులోను



శ్రీరామచంద్రుడు, సీతా మహాసాధ్వి, లక్ష్మణస్వామి అరణ్యవాసానికి వెళుతూ భారతదేశ మంతా చూశారని పురాణం. అందుకే రాములవారితో ఈ మట్టికి గొప్ప అనుబంధం ఉంది. ఎన్నోచోట్ల ఆయన పేరుతో ఇప్పటికీ జ్ఞాపకాలు మిగిలి ఉన్నాయి. ఆయన పాదముద్రలు దేశమంతటా ఉన్నాయని భక్తుల అఖండ విశ్వాసం. రామచంద్రుడు అయోధ్యలో జన్మించాడు. దశరథ మహారాజు, కౌసల్య పుణ్యదంపతుల సంతానం. ఇప్పుడు అక్కడే భవ్య మందిరం నిర్మించారు. ఈ దేశంలో నిజానికి రాముని ఆలయం లేని ఊరే లేదని ప్రతీతి.




ప్రయాగలో రాములవారు గంగానది దాటారు. భరద్వాజ ముని ఆశ్రమంలో బస చేశారు.




రాముడు పర్ణశాలను నిర్మించుకున్న ప్రదేశమే పంచవటి. ఇప్పుడు నాసిక్ పరిధిలోకి వస్తుంది. మాయాలేడి ఉదంతం ఇక్కడిదే.





17వ శతాబ్దం నాటి కంచర్ల గోపన్న (శ్రీరామదాసు) వంటి భక్తాగ్రణి జీవితం, భక్తి తత్పరతతో ముడిపడి ఉన్న ఆలయమిది. గోల్కొండ నవాబుల ఏలుబడిలో గోపన్న భద్రాచలం తహసీల్దారుగా ఉన్నప్పుడు ప్రభుత్వ సొమ్ముతో ఈ ఆలయం కట్టించాడు. అందుకు కారాగారవాసం అనుభవించాడు.

# రామనామమే..




చిత్రకూట్‌లో (నేటి మధ్యప్రదేశ్) ఉండగానే భరతుడు అన్నగారి దగ్గరకు వచ్చి తిరిగి అయోధ్య రావలసిందిగా కోరాడు. తరువాత పాదుకలు తీసుకుని వెళ్లాడు.







రావణుని సోదరి శూర్పణఖ రాముని చూసిన ప్రదేశమే దండకారణ్యం




ఇదే రామేశ్వరం. ఇక్కడే రాముడు సేతువును నిర్మించాడని ప్రతీతి. ఈ ఆలయాన్ని కూడా రాములవారే కట్టించాడని భక్తుల విశ్వాసం.




ఆంధ్రప్రదేశ్‌లోని ఒంటిమిట్టలో వేంచేసి ఉన్న కోదండరాముని ఆలయం. విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు యాగరక్షణకు వెళ్లినప్పుడు ఇక్కడే ఉన్న శృంగి పర్వతం మీద బస చేశారని ప్రతీతి.

# ‘రాముడిని నిలిపి.. ధర్మాన్ని నిలబెట్టుకున్నాం’

**అయోధ్య నుంచి ‘భారతీయం’ సత్యవాణి**

భవ్యమందిరం కోసం నాడు, ‘ప్రాణ్ జాయ్ పర్ మందిర్ వహా బనాయేంగే,’ ‘ఆధా రోటీ ఖాయేంగే మగర్ మందిర్ వహీ బనాయేంగే’ ‘ఇధర్ పె దేఖో జైశ్రీరామ్ ఉధర్ పె దేఖో జైశ్రీరామ్, కహీపె దేఖో జైశ్రీరామ్’ అంటూ చేసిన నినాదాల హోరు చెవులలో మళ్లీ ప్రతిధ్వనించింది. జైళ్లల్లో ఆ గోడల నిండా హనుమాన్ చాలీసాలు రాశాం. సరయూ ఒడ్డున కూర్చొని అందరం రామనామ జపం చేయడం, ఇలా పాత స్మృతులన్నీ గుర్తుకొస్తూ ఉంటే, ఇప్పుడు కొత్త నిర్మాణమవుతున్న ఆలయాన్ని చూస్తూ ఉంటే ఆ అనుభూతి మాటలకు అందుతుందా! అయోధ్య రూపురేఖలే మారిపోయాయి. విశాలమైన రోడ్లు, అందరూ రావడానికి చక్కటి అతిథి గృహాలు అన్నీ నిర్మించారు. రామాయణంలో ఉన్న అన్ని ఘట్టాలను, మార్గంలో ప్రదర్శనకు పెట్టారు. ఆ కావ్యాన్ని చదవకుండానే, చూసి అర్థం చేసుకు నేటట్టుగా ప్రేరణాత్మకంగా తీర్చిదిద్దారు.

అశోక్ సింఘాల్‌జీ బ్యానర్లు కూడా కనిపించి నప్పుడు కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి. ఆరోజు రామ భక్తులందరినీ ఏకం చేశారు. ఆయన విగ్రహాన్ని సందర్శించుకోవాలి. ఆయనతో పాటుగా విష్ణు హరిదాల్మియా, రాజమాత విజయరాజె సింధియా వంటివారంతా గుర్తుకువచ్చారు. ముఖ్యంగా, మన పుల్లారెడ్డిగారు గుర్తుకువచ్చారు. ఇది వారందరి కల. నేడు భౌతికంగా లేకపోయినా, పైలోకాలలో వారి ఆత్మలు ఎంత ఉప్పొంగిపోతాయో అనిపించింది.


మన తెలుగువారి ప్రాశస్త్యం ఇక్కడ ఎక్కువగా కనపడింది నాకు. ఆ రోజున కూడా నేను, ‘శ్రీరస్తు, శుభమస్తు, అవిఘ్నమస్తు’ అంటూ మూడు ఇటుకల పైన తెలుగులో రాసి పట్టుకెళ్లినవాటినే శిలాన్యాస్ పునాదిలో పెట్టారు దీక్షితులుగారు. శిలాన్యాస్ చేసిన ప్రదేశంలో ఈ భవ్య కట్టడాన్ని చూసి, అహా, ఇక్కడ మన ఇటుకలున్నాయి. ఆరోజు నా మెడలోది బంగారు వరలక్ష్మి రూపు తీసి పెట్టాను. ద్వారబంధం తలుపులు కూడా తెలుగునాట నుంచి వచ్చినవే. చదలవాడ శరత్‌బాబు గారిని కూడా కలిశాం. బంగారు వాకిళ్ల నుంచీ అన్నీ వారు దగ్గరుండి చూపించారు. ఎంత అద్భుతంగా ఉన్నాయో! అలాగే మన చిదంబర శాస్త్రిగారి దగ్గర యంత్ర పూజ జరగడం, ధర్మవరం నుంచి అమ్మవారికి పట్టుచీర రావడం, బంగారు పాదుకలు... ఒకటేమిటి, చెప్పుకుంటూ పోతే తెలుగువారికీ, రామచంద్రుడికీ ఉన్న బంధం ఎంత గొప్పదో ఇంకా బాగా అర్థమైంది.

నాకు ఒకటే అనిపించింది, ఆత్మగౌరవానికి కలిగిన కళంకాన్ని తొలగించేలా మందిర నిర్మాణం చేసుకున్నాము అంటే, దీని పరమోద్దేశం మళ్లీ ఈ ధర్మభూమిలో ‘రామో విగ్రహవాన్ ధర్మః’ అన్నట్టుగా ఆ ధర్మాన్ని పునఃప్రతిష్ఠాపన చేసుకుంటున్నాం. ధర్మ సంస్థాపన... స్థాపన కాదు. సంస్థాపన అంటే మళ్లీ మళ్లీ జరిగేది. దానికి ప్రతీకగా ఇది నిలబడినట్టుగా నాకు అనిపించింది. గ్లోబలైజేషన్ అని చెప్పుకున్నా, దాన్ని ఆధ్యాత్మికపరంగా మన వారసత్వాన్ని, మన ధర్మాన్ని కలిపేందుకు మళ్లీ రామచంద్రుడు ఇలా వచ్చాడు. ‘రాముడంటే ధర్మము, సంస్కృతి అంటే సీతమ్మ. ధర్మం నుంచి సంస్కృతి కనుక విడిపోతే ప్రమాదం వస్తుంది. ఆ ప్రమాదం నుంచి కాపాడటానికి, ధర్మాన్ని, సంస్కృతిని కలిపినవాడు ఆంజనేయ స్వామి... వివేకమనే ఆంజనేయుడు.

నేను మాతా శివచైతన్య గారితో, మరికొందరు మహిళలతో కలిసి నాడు కరసేవకు వెళ్లాను. వారితో పాటుగా పుల్లారెడ్డిగారు, నారాయణమ్మగారు తదితర పెద్దలంతా ఉన్నారు. మేము ఇండోర్‌లో దిగగానే అరెస్టు చేసి ఝాన్సీలో పెట్టారు. ఆ సమయంలో అనేక సంఘటనలు జరిగాయి. అది చెప్తే పెద్ద పుస్తకమే అవుతుంది. ‘దక్షిణ భారతంలో రాముడి పట్ల ఇంత ప్రేముందా? అని మమ్మల్ని అడిగా రప్పుడు. నేను, ‘అదేమిటండీ, రాముడి కోసం ఆనాడు ఒక్క రామదాసు జైలుకెళ్లాడు. నేడు వేలమంది రామదాసులు జైళ్లల్లో ఉన్నారు’ అన్నాను. 128 దేశాల నుంచి రకరకాల ఆకృతులలో, రంగులలో ఇటుకలు వచ్చాయి. తూములూరి లక్ష్మీనారాయణగారు (జాగృతి మాజీ సంపాదకులు) మహానుభావులు... నమస్కరించాలి. నేను నా భర్తతో కలిసి వచ్చాను. మేమిద్దరం కలసి వస్తుంటే, ‘అమ్మా! ఆదిదంపతుల్లా కలిసి వస్తున్నారు. మీరే కూర్చోండి శిలాన్యాస్‌కి’ అని కూర్చోపెట్టడం, నేను హారతి చేతిలో వెలిగించడం, (10 నవంబర్) అంతమంది ధర్మాచార్యుల మధ్యలో నన్ను కూర్చోపెట్టి, ధర్మేంద్రజీ మహారాజ్ మంగళా శాసనం చేస్తుండగా, అక్కడ నారాయణమ్మగారు, మరొకరు కలిసి వేణీ బంధనం మడివేసి, నవయుగ



1989సంవత్సరంలో ఎక్కడైతే సింహద్వారం దగ్గర శంకుస్థాపన చేశామో, ఇప్పుడు మళ్లీ అక్కడే, కానీ ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న ఆలయ ప్రాంగణంలో నిలబడడం ఓ అద్భుత అనుభవం. అనిర్వచనీయమైన అనుభూతి. భాషకు అందనిది . ఓ మహదవకాశం నాకు మళ్లీ దొరికింది. ఇక్కడి దృశ్యం నయనానందకరం. వందలాదిమంది, కాదు, వేలమంది... ఒకవైపున పూలదండలు కడుతూ, వాటిని అలంకరిస్తూ, నాపరాళ్లు పరుస్తూ, అతిథులకు కావలసిన ఏర్పాట్లు చేస్తూ హడావిడిగా ఉన్నారు. లోపల..ఎక్కడైతే ప్రాణప్రతిష్ఠాపన చేస్తున్నారో అక్కడ కాశీ పండితులు పూజలు చేసి, తర్వాత పల్లకిలో రామ్‌లల్లా ఉత్సవమూర్తిని యాగశాలలోకి తీసుకురావడం... ఇవన్నీ నేను దర్శించుకోగలిగాను. ఇది సాధారణ ఘట్టం కాదు. మేము ఉండగానే, ఈ కల సాకారమవుతుందని, మన హిందువుల ఆత్మగౌరవానికి, ఆత్మాభిమానానికి ప్రతీకగా రామ్‌లల్లా నిలబడడం ఎంతో గర్వం ఉంది. ఆ భావనను ఏ విధంగా వ్యక్తం చేయాలో తెలియని ఉద్వేగం ఆవరించింది నన్ను. గొంతు గద్గదమయింది.



మందిరం వద్ద సత్యవాణి, కాంటినెంటల్ కాఫీ సంస్థ అధిపతి రాజేంద్రప్రసాద్ (ఎడమ), చదలవాడ శరత్ (కుడివైపు)

ద్రౌపది అంటూ ప్రశంసించడం... జరిగాయి. ఆనాడు చేసిన సేవకే రాముడు నన్ను మళ్లీ ఇక్కడకు రప్పించుకొని, ఆశీర్వదించాడా? ఒక ఆనంద కక్ష్యలోకి వెళ్లిపోయాను. 'అన్నమయ కోశం నుంచి ఆనందమయ కోశం'లోకి చేర్చాడు.

కానీ కరసేవకులు తుపాకీ గుళ్లకు బలైపోయినప్పుడు, ఇసుకమూటలు కట్టి వారిని నదిలోకి తోసేసిన దృశ్యాలు గుర్తుకు వస్తే మాత్రం చలించిపోతోంది మనసు. కానీ గుర్తుకు రాకుండా ఎలా? ప్రతి ఇంటికీ తుపాకీ గుళ్లు చేసిన రంధ్రాలు, క్షతగాత్రుల రక్తపు మరకలు ఉన్న గోడలు. ఇంకా కళ్ల ముందే ఉన్నాయి. హిందువులమనే విషయాన్ని విస్మృతి చెంది జీవిస్తున్న మనలో అటువంటి భావాన్ని మేల్కొల్పి, మన అస్తిత్వాన్ని మనం గుర్తు చేసుకోవడానికి, అదొక హిందూ మానస మందిరం చేసుకోవాలని మన పిలుపునకు స్పందించి ప్రజలందరూ తమ భావనచేత ఇటుకలను తీసుకొని వచ్చారు. ఏ నిర్మాణాన్నైతే సాకారం చేసుకోవాలనుకున్నామో, ఏ కళంకాన్ని తొలగించాలనుకున్నామో, దానిని పూర్తిచేసుకున్నాం కదా మనం. నాడు ఒక్కొక్క కరసేవకుడూ చైతన్య రూపుడై, నిలువరించలేని ఝంఝూ మారుతంలా విజృంభించారు. ఆ కట్టడాన్ని తొలగించారు. స్వంత నిర్ణయంగా ఎవరికి వారు ఆ గుంబజ్‌లపైకి ఎక్కి వాటిని ధ్వంసం చేశారు. ఆ ప్రభంజనాన్ని చూసినప్పుడు ఏమనిపిస్తుంది? ఆహా అనిపిస్తుంది, అదే నాకూ అనిపించింది. ఆలయం అనేటువంటిది ఒక నిర్మాణం కాదు. దాని ద్వారా జాతి నిర్మాణం, వ్యక్తి నిర్మాణం జరగాలి. ఆలయమనేది సమాజ సంక్షేమ కేంద్రమనే భావనను పూర్వీకులు అందించారు. అక్కడ విగ్రహంగా రాముడిని చూడటం లేదు, సాక్షాత్తు రాముడినే నిలబెట్టుకున్నాం. రాముడిని నిలబెట్టు కున్నామంటే, ధర్మాన్ని నిలబెట్టుకున్నాం. ఆ ధర్మమనేది జాతికి అన్నివైపులా ప్రసరించాలి. అయోధ్య రామమందిరం ఒక సూపర్ థర్మల్ పవర్ స్టేషన్. సమాజానికి కావలసిన ధర్మాన్ని అది ప్రసారం చేస్తున్నప్పుడు జాతికి మేలు జరుగుతుంది. మన ఉద్దేశం, పరమోద్దేశం కూడా ఇవే. ★

# కోటి నామాల వాడికి 'గోటి' తలంబ్రాలు

భద్రాద్రి రామయ్య కల్యాణానికి అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం తలంబ్రాలు పంపడం ఆనవాయితీ.అయితే ప్రస్తుత 'గోటి తలంబ్రాలు' సమర్పణ విశేష ఆదరణ పొందుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలోని శ్రీకృష్ణ చైతన్య సంఘానికి చెందిన కల్యాణం అప్పారావు 'గోటి తలంబ్రాలు' సాగుకు, సమర్పణకు సుమారు దశాబ్దన్నర క్రితం శ్రీకారం చుట్టారు. ఏటా శ్రీరామ నవమి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఒంటిమిట్ట, తెలంగాణలోని భద్రాద్రి దేవస్థానాలకు, ఇతర ఆలయాలకు తలంబ్రాలు అందచేస్తున్నారు. ఆయన స్ఫూర్తితో రెండు తెలుగు రాష్ట్రాల ఆధ్యాత్మికులు ఈ సంప్రదాయాన్ని అందిపుచ్చుకున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని వివిధ గ్రామాలతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాద్రి, కొత్తగూడెం, మణుగూరు, పినపాక, అశ్వాపురం, పినపాక, చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు, పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లందు, టేకులపల్లి, చంద్రుకొండ, సుజాత నగర్, అన్నపురెడ్డిపల్లి తదితర గ్రామాలలో ఈ 'పవిత్ర' పంటను సాగుచేస్తున్నారు.

గోటి తలంబ్రాల ధాన్యాన్ని సాగు చేయడం నుంచి స్వామి వారికి సమర్పించేంత వరకు ఆ ప్రక్రియను ఎంతో పవిత్రంగా భావిస్తారు. వరివంగడాలను నారుగా పోసే ముందు భద్రాద్రి శ్రీసీతారామ చంద్రస్వామి సన్నిధిలో పూజాదికాలు నిర్వహిస్తారు. నాట్లు వేసేటప్పుడు, కోత కోసేటప్పుడు దశరథ తనయులు, సీతామాతతో పాటు ఆంజనేయ, సుగ్రీవ, జాంబవంతుడు, అంగదాది కపివీరుల వేషాలు ధరిస్తారు. తలంబ్రాల పంటను వంటలకు ఉపయోగించుకోకపోవడం మరో ప్రత్యేకత. పరిసర గ్రామాల భక్తులు స్నానం చేసి, శుభ్రమైన వస్త్రాలు, తిలక ధారణతో రామనామ స్తుతితో గోటితో ధాన్యం గింజల ఒలుపుడు కార్యక్రమంలో పాల్గొంటారు. ఒలిచిన తలంబ్రాల బియ్యాన్ని కలశాలలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక వాహనంలో భద్రాద్రికి తరలించి, గిరి ప్రదక్షిణ అనంతరం దేవస్థానానికి అప్పగిస్తారు. తలంబ్రాలు సమర్పణకే ఈ ప్రక్రియ పరిమితం కాదు. దీనిని నిశితంగా పరిశీలిస్తే... వడ్లగింజలో బియ్యపు గింజలాగే అంతర్లీనంగా సందేశం ఉంది. బియ్యం కోసం వడ్లు ఒలిచినట్లే, మనం మనలోని ఆలోచనలని గమనించాలి. అరిషడ్వర్గాలను, రాగద్వేషాలను, కపటం, స్వార్థం, అవినీతి, హింస, దురాశ, దుఃఖం, ఆశ్రిత పక్షపాతం లాంటి వాటిని వడ్ల పైపొట్టు ఒలిచినట్లు తొలగించాలి.



రామాయణ పాత్రల వేషధారణతో కోరుకొండలో వరి సాగు



దేశమంతా ప్రస్తుతం రామనామంతో దద్దరిల్లిపోతున్నది. అయోధ్య పేరు వినగానే ప్రజలు పులకరించి పోతున్నారు. ఐదువందల ఏళ్లకు పైగా తన సొంత గృహానికి దూరమైన ప్రభు శ్రీరాముడు ఇప్పుడు నూతనంగా దివ్యంగా, భవ్యంగా నిర్మించిన నూతన మందిరంలోకి ప్రవేశించాడు. ఆ దివ్యభవ్య మందిరంలో విరాజమానమైన తమ ప్రభువును ఎప్పుడెప్పుడు దర్శించు కుందామా అని యావత్ దేశం తహతహలాడుతోంది. ఈ సమయంలోనే కొన్ని అరాచక శక్తులు శంకరాచార్య పీఠాలను అడ్డుపెట్టుకొని ఈ ఉత్సాహపూరిత వాతావరణంపై నీళ్లు చల్లే విఫలయత్నం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే అందులోని సత్యాసత్యాలను చర్చించేందుకు ఉద్దేశించిందే ఈ వ్యాసం.

హిందూత్వం బహు సుందరమైంది. అది చర్చల సంప్రదాయాన్ని, పాండిత్య వాదనలను ప్రోత్సహించడమే కాదు, సున్నితమైన ప్రత్యామ్నాయాలను తిరస్కరించి, ఎదుటివారిపై హింసకు తావులేకుండా, విముక్తినిచ్చే సత్యానికి తక్కువ మరి దేనినీ అంగీకరించని సమూల సంస్కరణవాదాన్ని, విప్లవ తత్వాన్ని ప్రాచీనకాలం నుంచి సజీవంగా నిలుపుకున్నది. ఒకరకంగా, హిందువులు కేవలం విభేదించడానికి మాత్రమే అంగీకరించారు. 'ఇతర వ్యక్తులు అనుసరించే మార్గాలు ఎక్కడికీ దారితీయని భ్రాంతిపూర్వక పథాలు అని తెలిసినా, అందులో జోక్యం చేసుకోరు' అని బెల్జియం చరిత్రకారుడు డా॥ కాన్‌రాడ్ ఎల్స్ట్ అంటారు. అందుకే హైందవ ధర్మం ఒక నదిలా ప్రవహిస్తూ, ఆటంకాలు ఎదురైనప్పుడు తన ప్రవాహాన్ని మళ్లించుకొని ప్రవహించిందే తప్ప ఎక్కడా ఆగిపోయి, పాచిపోలేదు. హైందవం తన మూలాలను కాపాడుకుంటూనే నిత్య నూతనంగా ప్రాచీన కాలం నుంచి ప్రవహిస్తోంది. ధర్మం అంటే, ఈ సృష్టితో సామరస్యాన్ని, పొందికను నిర్వహించేదే. అందుకే, హైందవ ధర్మం జీవన విధానమైంది తప్ప మతం కాలేదు.

ఈ క్రమంలోనే దాదాపు 72 భిన్న విశ్వాసాలు, ధర్మాలు (వైదికేతర) హిందూ ధర్మాన్ని సవాలు చేసి, సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న కాలంలో ఆదిశంకరుడు దేశం నలుమూలలా పర్యటించి, వివిధ విశ్వాసాల పండితులతో, చర్చలను నిర్వహించి, వారి వాదనలను ఓడించి మరీ హిందూ మతాన్ని పునరుజ్జీవింపచేసి, సంస్కరించారు, దేశం మొత్తాన్నీ ఏకతాటిపైకి తెచ్చారు.

ఈ క్రమంలో ఆయన ఎప్పుడూ మరొకరి వాదనను కించపరచలేదు, తిరస్కరించలేదన్న వాస్తవాన్ని గుర్తించడం కూడా మనకు అవసరం. నిత్యనూతనమైన, సచేతనమైన హైందవ జీవన విధానంలోని గొప్పతనాన్ని ఆయన నాటి ప్రజలకు గుర్తుచేసి, వారు అందులో సమ్మిళితం కావలసిన అవసరాన్ని తెలియచేశారు. అందుకే దేశంలో నేటికీ పలు తాత్వికతలు, సిద్ధాంతాలు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రజలు క్రమబద్ధమైన జీవితాన్ని సాగించేందుకు, హిందూ ధర్మ సజీవతను కొనసాగించేందుకే ఆయన భారతదేశం నాలుగు దిక్కులా నాలుగు పీఠాలను ఏర్పాటు చేసి, కంచిలో యోగ పీఠాన్ని నెలకొల్పి అక్కడ కొంతకాలం బసచేశారు. మనిషిలో అంతర్గతంగా ఉండే క్రూరత్వం నుంచి అతడిని విడుదల చేయాలని గ్రహించి, విశిష్ట, విజయవంతమైన ప్రయత్నానికి రూపకల్పన చేసి, ప్రారంభించడమే కాదు, శ్రేష్ఠమైన గురు పరంపర ఆ ఉన్నత భావనను యుగ యుగాలుగా ముందుకు తీసుకువెడుతున్నారనేందుకు ఈ పీఠాలే సాక్ష్యం. అందుకే ఈ పీఠాల అప్రతిహతంగా శంకరుల పరంపరలోనే కొనసాగుతున్నాయి.


ప్రాథమిక హిందూ గ్రంథాలు అయిన వేదాలు, భగవద్గీతలో కుల వివక్ష లేదా అస్పృశ్యతకు సంబంధించిన భావనలు కనిపించవు. అవి విశ్వ వాస్తవాలను ఆవిష్కరించి, మోక్షమనే అత్యున్నత ఆధ్యాత్మిక లక్ష్యాన్ని ప్రతి మనిషి సాధించేందుకు అవసరమైన మార్గాన్ని అందించాయి. హిందూ సమాజం కూడా ఆ భావనలను ఒంటబట్టించుకొని కొనసాగుతూ వచ్చింది. అయితే, విదేశీ పాలకుల కుట్రల కారణంగా దేశంలో వర్ణం కాస్తా కులమై, చివరకు ఆ కులమే ఒక పరికరమై పోయింది.

ఆది శంకరులవారు కూడా ఇటువంటి భావనలను వ్యక్తి అధిగమించాలనే విషయాన్ని గ్రహించే 'మనీషా పంచకాన్ని' రచించారని అంటారు. కాశీలో ఉన్న ఆది శంకరులవారు తన శిష్యులతో కలిసి గుడి వైపుగా వెడుతుండగా, ఆయనకు ఒక ఛండాలుడు ఎదురు రావడం, శంకరులవారు అతడిని పక్కకి తప్పుకోమని చెప్పడం, అప్పుడు అతడు… 'ఓ మహానుభావా! నన్ను దారికి పక్కగా తొలిగిపొమ్మని నువ్వన్నది, నేను తక్కువ జాతికి చెందినవాడననా? లేక ఒక శరీరంలో ఉన్న ఆత్మ, మరో శరీరంలోని ఆత్మను పక్కకి తొలగి పొమ్మని చెబుతుందా? ఈ రెండిటిలో ఏది పక్కకి తప్పుకొని దూరంగా ఉండాలి?' అంటూ ప్రశ్నించినప్పుడు, అతడిని ఈశ్వరుడిగా గుర్తించిన శంకరుల వారు ఐదు శ్లోకాలను మనీషా పంచకంగా ప్రజలకు అందించారు. అందులోనే ఆయన –

'ఈ జగత్తంతా ఆ పరమాత్మ పరబ్రహ్మ స్వరూపమే. అజ్ఞానం వల్లనో, త్రిగుణాల (సత్త్వరజస్తమో గుణాలు) ప్రభావంతో పరబ్రహ్మ స్వరూపాన్ని చూడలేము. వీటికి అతీతంగా తనని తాను నిర్మలమయిన, అనంతమయిన పరమాత్మ పరబ్రహ్మగా గుర్తించినవారు ద్విజుడయిన బ్రాహ్మణుడే కానీ, చండాలుడే కానీ–నా గురువుగా అతడిని నేను నమ్ముతాను' అన్నారు.

అటువంటి పరంపర నుంచి వచ్చిన పీఠాధిపతులైన శంకరాచార్యులను అపకీర్తిపాలు చేసే ప్రయత్నం ఇప్పుడు జరుగుతున్నది. శంకరాచార్య పరంపరకు చెందిన పీఠాధిపతులు ముహూర్తాన్ని తప్పు పట్టారని,






శంకరులు, చండాలుని రూపంలో పరమశివుడు

# పునరుజ్జీవన రథచక్రాల కింద వక్రభాష్యాల కకావికలు

**డి. అరుణ**




కట్టడం పూర్తికాకుండానే ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్నారని, బ్రాహ్మణేతరుడైన మోదీ ప్రాణప్రతిష్ఠ ఎలా చేస్తారని ప్రశ్నిస్తూ, అందుకే ప్రాణ ప్రతిష్ఠకు హాజరు కామన్నారనే ప్రచారం మీడియాలో తీవ్రంగా జరుగుతున్నది. ఈ క్రమంలోనే మీడియాలో, సోషల్ మీడియాలో కూడా వారు ఏదో ఒక సందర్భంలో కులాల గురించి మాట్లాడిన క్లిప్పింగులను పోస్టుచేస్తూ, వారిని కులతత్త్వవాదులుగా ముద్రవేయడం కూడా జరుగుతోంది.

అయోధ్యలో శ్రీరాముని ఆలయ నిర్మాణం కల సాకారమవుతున్న వేళ, దేశ వ్యతిరేకశక్తులు రంగంలోకి దిగి, ఈ రకమైన ప్రచారానికి పాల్ప డ్డాయని చెప్పడానికి మనం సందేహించనవసరం లేదు. హిందూ మతం బలపడడాన్ని భరించలేని, మతాంతరీకరణ శక్తులు తమ చివరియత్నంలో భాగంగా శంకరాచార్య పీఠాలను భ్రష్టుపట్టించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. గతంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో మతాంతరీకరణను అడ్డుకున్నందుకు కంచి పీఠం 69వ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ స్వామిని దీపావళి రోజున అరెస్టు చేయించిన విషయం ఎవరి జ్ఞాపకాల నుంచీ జరిగిపోలేదు. ఆ ఘటన వెనుక ఉన్న శక్తులు ఎవరో కూడా తదనంతర కాలంలో బయటకు వచ్చాయి కదా? అవే శక్తులు ఇప్పుడు మరొక రూపంలో అయోధ్య ఆలయానికి సంబంధించి వివాదాన్ని రేకెత్తించేందుకు ప్రయత్నం చేస్తున్నాయి.

**శైశవంలో హిందూ పునరుజ్జీవనం**

నేడు 'హిందూ పునరుజ్జీవనం' జరుగుతున్న మాట వాస్తవం. అయితే, అది ప్రస్తుతం శైశవ దశలో ఉంది. అంటే, నిన్న మొన్నటి వరకూ మెకాలే, వామపక్ష చదువులు చదువుకున్న మనకు హిందుత్వం లేదా హిందూ ధర్మం గొప్పతనం గురించి మాట్లాడే సాహసం రాలేదు. కానీ, నేడు బాలాది వృద్ధ పర్యంతం అందరూ తాను హిందువునని ఎటువంటి సంశయమూ లేకుండా, నిర్భయంగా చెప్పుకుంటు న్నారు. తన విశ్వాసాలు, గత వైభవం ఎంత శాస్త్రీయమైనవో, ప్రాచీనమైనవో బహిరంగంగా చాటుకుంటున్నాడు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులందరూ సగర్వంగా సంబరాలు జరుపు కుంటున్నారు. ఈ తరుణంలో హిందువుల ఆత్మగౌరవాన్ని మసకబార్చి, వారిలోనే విభజనలు తెచ్చేందుకు జరుగుతున్న ప్రయత్నమిది. ఇంకా శైశవంలోనే ఉన్న ఈ పునరుజ్జీవనోద్యమాన్ని మొక్కలోనే తుంచేయాలనే వృథా ప్రయాస జరుగు తున్నట్టు కనిపిస్తోంది.

ముందుగా అసంపూర్ణమైన ఆలయంలో ప్రాణప్రతిష్ఠ ఎలా చేస్తారంటూ కాంగ్రెస్ సహా కొందరు ప్రతిపక్ష రాజకీయ నాయకులు ప్రశ్నించడం వెనుక ఉన్న ఆంతర్యం మనకు తెలిసిందే. ఇది బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యక్రమమని, అందుకే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి తాము హాజరు కామంటూ వారు ప్రకటనలు చేసి విషయాన్ని రాజకీయం చేశారు. అయితే, వారి నియోజకవర్గాల ప్రజలు కూడా వారి మాట వినని పరిస్థితి కనిపించడంతో దేశ వ్యతిరేకశక్తులతో కలిసి ప్రజల దృష్టి మళ్లించేందుకు పీఠాధిపతులు కూడా అదే మాటంటున్నారనే పుకార్లు పుట్టించారు.

ఈ కారణంగా, ఇటువంటి అంశాలకు దూరంగా ఉండే పీఠాధిపతులు కూడా ముందుకు వచ్చి, తాము అలా అనలేదని పత్రికా ప్రకటనలు జారీ చేయ వలసి వచ్చింది. ఆదిశంకరులు స్థాపించిన నాలుగు పీఠాలలో ఉత్తరంలో స్థాపించిన జ్యోతిర్మయి బద్రికాశ్రమం పీఠాధిపతిగా చెప్పుకుంటున్న శ్రీ అవిముక్తేశ్వరానంద సరస్వతిని ఈ శక్తులు ఎంతో కొంతమేరకు ప్రభావితం చేసినట్టు ఆయన మాట్లాడే మాటలను బట్టి అనిపిస్తున్నది. వాస్తవానికి, ఆయన పీఠాధీశుడు అయ్యేందుకు అవసరమైన శిక్షణను పూర్తి చేసుకొని, పరీక్షల్లో నెగ్గి, మిగిలిన పీఠాధీశుల చేత 'అర్హుడు' అనిపించుకో వలసి ఉంది. ఆయనకు ఇంతవరకు ఆ అనుజ్ఞ రాకపోవడం, దేశ అత్యున్నత న్యాయస్థానం కూడా ఆయన నియామకంపై స్టే ఇవ్వడంతో నిరాశతో ఉన్న ఆయనను వామపక్ష శక్తులు ప్రభావితం చేసి, సందర్భశుద్ధి లేని మాటలు మాట్లాడిస్తూ, పీఠాధీశు లందరినీ ఒకటే గాటన గట్టి, అదే పంథాలో మాట్లాడుతున్నట్టుగా చిత్రిస్తున్నారు. కానీ, వాస్తవమది కాదనే విషయాన్ని మనం గుర్తించాలి.

ఇది హిందువులందరూ అప్రమత్తంగా ఉండవలసిన సమయం. హిందువుల పురోగతిని భరించలేని శక్తులు అనేకం ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. నిన్నటివరకూ మనను సెక్యులరిజం భ్రమల్లోనే ఉంచారు పాలకులు. నేడు హిందువుల పక్షాన నిలిచే ఒక ప్రభుత్వం కేంద్ర స్థాయిలో వచ్చినందువల్లనే నేడు దేశవ్యాప్తంగా ప్రతి ఇంట, వాడవాడలా నిర్భయంగా సంబరాలు, ఉత్సవాలు జరుపుకోగలుగుతున్నారన్నది నిజం. తాము ఒక ప్రాచీన నాగరికతకు చెందినవారిమన్న భావన వారిలో ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్నది. అది వేళ్లానుకునేలా ఈ పీఠాధిపతులు చేస్తారేమోనన్న భయంతోనే వారిని ఇప్పుడు నడిరోడ్డున నిలబెడు తున్నారు. ఈ కుట్రలను ప్రతి భారతీయుడూ గమనించాల్సి ఉంది.

దాదాపు ఐదువందల ఏళ్ల నిరీక్షణ అనంతరం ఈ కల నెరవేరుతున్న నేపథ్యంలో ధార్మిక పీఠాలకు అధిపతులుగా ఉన్నవారు అటువంటి మాటలు మాట్లాడుతారని విశ్వసించడం సరికాదు. ఏ ధర్మాన్ని అయితే వారు నిలబెట్టాలనుకున్నారో, దానికి సంకేతంగానే ఆలయం నిర్మాణం జరిగింది ఇప్పుడు. శంకరాచార్యులవారి బాటలో కాలినడకన పలుమార్లు దేశమంతా తిరిగి 'నడిచే దేవుడు' అని పిలిపించు కున్న కంచి పీఠాధిపతి పరమాచార్యులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు ఇచ్చిన ఆలయాల జీర్ణోద్ధరణ పిలుపులో భాగంగానే కంచి మఠాధీ శ్వరులు దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ఆలయాల జీర్ణోద్ధరణ కోసం పాటుపడుతు న్నారు. అందులో భాగంగానే, అయోధ్య ఉద్యమ సమయంలో అక్కడ ఆలయ నిర్మాణం కోసం శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి హిందూ, ముస్లిం పక్షాల మధ్య సయోధ్య తెచ్చేందుకు జరిగిన చర్చల్లో పాలుపంచుకున్నారు. దానికి కొనసాగింపు గానే, ప్రస్తుత పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు అయోధ్యలో ప్రాణప్రతిష్ఠకు ముందు రోజున 'నేత్రోన్మీలనం' క్రతువును ప్రారంభించి, మూల విగ్రహానికి న్యాసంతో ప్రత్యేక పూజను నిర్వహించారు. అంతేకాకుండా, మఠం తరుఫున రామచంద్రునికి ప్రత్యేక ఆభరణాలను సమర్పించారు. ట్రస్టు కంచిపీఠం మూలామ్నాయ పీఠం కనుక నాలుగు పీఠాలకు ప్రతినిధిగా శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారిని గుర్తించి, స్వాగతించడం విశేషం. ★



రామాయణ మహాభారత ఇతిహాసాలు రెండూ విశ్వవిరాట్పురుషుని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు. భగవంతుడు స్వయంగా దివి నుండి భువికి దిగివచ్చి ఆచరించి చూపిన ధర్మమార్గాలు. రామాయణం ఏనాటిది? ఏ యుగానిది! భారతం ఎన్నివేల సంవత్స రాల నాటిది! ఈనాటికీ భారత రామాయణాలను స్పృశించక మనకి కాలం గడవదు కదా! కష్టాలు వచ్చినప్పుడు రాముడే అరణ్యవాసం చేసి నానా అవస్థలూ పడ్డాడు మనమెంత... ధర్మరాజు అంతటి వాడికే తిప్పలు తప్పలేదు... అనుకుంటూ కష్టాలను మర్చిపోవడానికి ప్రయత్నిస్తూ ఉంటాం. ఇన్ని వేల సంవత్సరాలుగా ఈ మహాకావ్యాలు చెక్కు చెదరకుండా ప్రజల గుండెలలో ఆలోచనలలో, ఆచరణలలో ఉదాహరణలుగా, సూక్తులుగా మార్గదర్శకాలుగా, కథావస్తువులుగా, కావ్యాలుగా, నాటకాలుగా, శిల్పాలుగా అనేక రూపాలతో నిత్యనూతనంగా నిత్య దినచర్యలలో ఉదాహరణలుగా భారతీయ హృదయాన్ని తమ వెంటే తిప్పుకుంటు న్నాయంటే... మనసులను పులకింప చేస్తున్నాయంటే అవి కథలు మాత్రమే కావు. గాథలంతకంటే కావు. యుద్ధాలూ, స్వార్థాలూ కావు. రాజ్యాలూ రాచరికాలూ కావు. రాముడు సీత కోసం, పాండవులు అయిదు ఊళ్ల కోసం పడిన తాపత్రయాలు కావు. విశ్వకల్యాణ కారకాలు.

# భారతీయ జీవనం.. రామాయణం

**డా॥ దిట్టకవి శ్యామలాదేవి**

ఉపనిషత్తులు వేదాలు, దర్శనాలు, బోధ పరచుకోలేని సామాన్య ప్రజలకు దారిదీపాలు – రామాయణ, భారతేతిహాసాలు. **'బలం విష్ణోర్వర్ధతాం'** రామాయణంలో రాముడు భారతంలో కృష్ణుడు. ఇద్దరూ అవతారమూర్తులే. ఈ రెండు ఇతిహాసాల్లో మానవ జనజీవనానికీ కుటుంబ వ్యవస్థకీ, సాంఘిక ఔన్నత్యానికీ దగ్గరగా వచ్చేది రామాయణం. రాముడు ధర్మమూర్తి. ధర్మాచరణ ప్రియుడు. **'రామో విగ్రహవాన్ ధర్మః'**. ముఖ్యంగా కావ్య నాయకులు సద్గుణ సంపన్నులుగా ఉండటమే శ్రేయోదాయకం! నాయకుడు ఆదర్శమూర్తి అయితేనే ప్రజలకు ఆరాధ్యమూర్తి కాగలడు. బ్రహ్మ హరిహరాదులకే రూపము శ్రీరామనాయకత్వము. రాముడు సర్వారాధ్యుడు ఎందుకైనాడు? అరణ్యాలకు వెళ్లినందుకా? పక్కన లక్ష్మణుడు సాయంగా ఉండెను కదా! సతీమణి వెంట ఉండెను కదా! పద్నాలుగేళ్లకి తిరిగి రావచ్చును కదా! రావణుని వధించి భార్యను తిరిగి తెచ్చుకున్నందుకా? ఆ ఘోర రాక్షసుని తానొక్కడే సంహరించినాడా, వానర సైన్యం సాయపడెను కదా! వారధి కట్టి సునాయాసంగా లంకను చేరేందుకు నలుని వంటి కౌశలురు ఉన్నారు కదా? మరేమిటి? అనగా ఆ రాముడు ఒక్క వ్యక్తి కాదు, ఒక్క శక్తి కాదు. ప్రతి చరాచర జీవిలోను అంతర్గతంగా ప్రకాశిస్తున్న పరమాత్మ స్వరూపుడు. ఆకలికి అన్నం, హృదయార్తికి రామనామం. అనగా ఆత్మనామం రామం. ఆత్మ–రామం కలిస్తే ఆత్మారామం. ఆత్మే రాముడు. రాముడే ఆత్మ. ప్రతి ఆత్మలోనూ తానుండి ప్రతి హృదయానికీ ఆత్మకీ ఆనంద సంధాయకునిగా వెలిగే పరమాత్ముడే రాముడు.


దైవ స్మరణంవల్ల దైవగాథలను తెలుసుకోవడం వల్ల మహా ప్రయోజనం ఉంటుంది. మహాత్ముల చరిత్ర మనసు పెట్టి చదివితే పతితులు కూడా ఆ చరిత్రలోకి చొచ్చుకుపోతారు. ఆ శక్తి కవి వాక్కుకీ, కవి శక్తికీ ఉంటుంది. హృదయ గవాక్షంలోకి చంద్ర కాంతి చొచ్చుకువచ్చి అజ్ఞానం నిర్మూలనమౌతుంది. ఇన్ని ఇన్ని మహా విషయాలు తెలియకపోయినా తరతరాల నుండీ అక్షరాలు కూడా నేర్వని పల్లెల్లోని నారీమణులు తన చిన్న బిడ్డల్లో రాముణ్ణి చూసుకుంటూ రామాలాలి మేఘశ్యామా లాలి అని జోలపాటలు పాడి కౌశల్యామాత అనుభ వించినంత ఆనందాన్ని తామూ అనుభవిస్తారు. ప్రతి తల్లీ రామజననియే. ప్రతి బిడ్డా రామ్‌లల్లాయే! లాల పోశాక నీటి చెంబుతో దిష్టి తీసి శ్రీరామరక్ష పెడుతుంది. గుక్కపట్టి ఏడుస్తుంటే ఆంజనేయ దండకమో, హనుమాన్‌చాలీసాయో చదివి విభూతిగాని సిందూరంగాని పెడుతుంది. అన్న



దమ్ముళ్లు అన్యోన్యంగా ప్రేమగా రామలక్ష్మణుల వలె ఐకమత్యంతో మెలగాలని కోరుకుంటుంది. శ్రీరామచంద్రునిలా తన భర్త ఏకపత్నీ వ్రతుడై పరస్త్రీని కన్నెత్తి చూడరాదని వాంఛిస్తుంది. ప్రతి పెళ్లి శుభలేఖ మీద ''జానక్యాః కమలాంజలిపుటే యా పద్మరాగాయితా" అని సీతారాముల తలంబ్రాల శోభ వెల్లి విరుస్తుంది. ఇక అన్నదమ్ములు కొట్టుకుంటుంటే వాలి సుగ్రీవుల్లా కొట్టుకుంటున్నారు అంటాము. విభీషణుడు శత్రుపక్షమైన రాముని చెంత చేరినందుకు ఇంటి గుట్టు లంకకు చేటు అంటాము. కుయుక్తులు పన్నే వారిని మంధర అంటాము. తొందరపాటువాళ్లని చూచి రమ్మంటే కాల్చి వచ్చాడు అని హనుమంతునితో పోల్చుకుంటాము.

వాయుపుత్రుడైన ఆంజనేయుడు రామాయణానికి ప్రాణతుల్యుడు. ఆంజనేయుడు లేకపోతే రామాయణం లేదు. రావణాసుర సంహారం జరగడం కష్టమయ్యేది. సీత జాడ తెలియకపోయేది. రామ సుగ్రీవ మైత్రి సంఘటిల్లేది కాదు. సముద్ర లంఘనం చేసి అశోకవనమంతా గావించి లంకా పట్టణ రాజ సౌధాలన్నిటినీ శోధించి అమ్మని కనుగొనలేక రాముని అష్టదిక్పాలకులనీ శరణు వేడుకుంటాడు "నమోస్తు రామాయ సలక్ష్మణాయ, వైచతస్యై జనకాత్మజాయ, నమోస్తు రుద్రేంద్రయమాని లేభ్యో నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః" అంటూ అనేక ప్రార్థనలు చేస్తాడు. "నపశ్యామి వైదేహం సీతాం సర్వాంగ శోభనామ్" అని రామునికి ఎలా చెప్పను? ఆ మాట వింటూనే రాముడు విగత జీవుడౌతాడు. లక్ష్మణుడు అన్నని అనుసరిస్తే భరత శత్రుఘ్నులు కూడా అదే దారి పడతారు. ఇంతకన్నా నేను ఈ లంకలో ఉండిపోయి, నిప్పుల్లోనూ, నీళ్లల్లోనూ దూకి అంతం అయిపోతాను అనుకుంటూ సుగ్రీవాజ్ఞను తలచుకుంటాడు. సీతమ్మను కనుగొనాలి లేకపోతే మరణమే శరణ్యం అనుకుంటూ అటు సుగ్రీవుడు కూడా మరణిస్తే మొత్తం వానర వంశానికే నాశనం కలుగుతుంది అనుకుంటాడు. తన శక్తి ఎంతో తనకు తెలియని ఒక కపి చేత ఇతిహాసాన్ని ఇంత సాహసంతో నడిపించిన వాల్మీకి శక్తి, అంతర్దృష్టి ఇంతింత అనరానిది. ఆంజనేయుని వంటి ధీశాలి, మేధావి, నిర్భీతుడు అణువణువూ ప్రభు భక్తిని నింపుకున్నవాడు, పరాక్రమవంతుడు, సూక్ష్మగ్రాహి, ధర్మరక్షణాపరుడు. ఇన్ని మహాశక్తులున్నా మంచుకొండలా కరిగిపోయి పత్తి పువ్వులా మెత్తనై ఒదిగిపోయే శక్తిమాన్. హనుమంతుని వంటి పాత్ర మరే విశ్వసాహిత్యంలోనూ కనబడదు. పుడుతూనే సూర్యుని చెంతకు ఎగిరాడు. రావణాసురుడు ఆంజనేయుణ్ణి చూడగానే నేను ఇదివరకు కైలాసంలో నన్ను శపించిన నందీశ్వరుడా ఇతడు అని సంశయించాడు. ఆంజనేయుడు శివసుతుడు. రామదూత, భవిష్యత్ బ్రహ్మ. అనగా హరిహర విరించి స్వరూపుడు. త్రిమూర్త్యాత్మకుడు.

రామాయణమంతా మూడు కోణాల మధ్య ఇమిడిపోతుంది. ఒకటి రాముడు. రెండు సీత. మూడు రావణాసురుడు. ఈ మూడు కోణాలూ, పర్వతాకారంలో ఉంటే ఆ పర్వతాన్ని తన ఎడమ అరచేతితో ఎత్తి మోసినవాడు ఆంజనేయుడు. ఈయన ఆకాశంలో చేతిలో పర్వతాన్ని పట్టుకుని ఎగురుతున్న విగ్రహాలు సదా పూజలందుకుంటాయి. సంజీవ పర్వతోద్ధార మనోదుఃఖం నివారాయ అని పూజిస్తారు. యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛపోతే హిమాలయాల్లో ఉన్న సంజీవనీ పర్వతాన్ని తెచ్చి లక్ష్మణుని బ్రతికించిన ఘనత హనుమంతునిది. లక్ష్మణునే కాదు, సీతమ్మకు జీవితం మీద ఆశ కలిపించి రాముని ముద్రికను చూపించిన వాడు ఆంజనేయుడు. రాముడు తిరిగి రాలేదన్న వ్యథతో భరతుడు ప్రాణోత్క్రమణం చెయ్యకుండా సకాలంలో నంది గ్రామానికి వెళ్లి భరత శత్రుఘ్నుల ప్రాణాలు కాపాడతాడు. ఇందుమూలంగా ఇనకుల వంశాన్ని నిలబెట్టిన ఘనుడు హనుమానుడు. కాబట్టి ఆయన మోసే పర్వతం ఇన వంశకుల సౌభాగ్య కూటం! భావితరాలవారికి భక్త సామ్రాజ్యకూటం! ఆ పన్నులకు సౌభద్ర కూటం! భావితరాలవారికి భక్త సామ్రాజ్య కూటం! ఆ పన్నులకు సౌభద్ర కూటం! ఆర్త జనావళికి అభప్రదాన కూటం! రాముడికి ఆంజనేయశక్తి తెలుసు. ఆంజనేయునికి రాముడే తనకు సర్వస్వమని తెలును. జానకిని వెతకటానికి వానర సేనలు వేలకువేలు అనేక వైపులకు వెళుతుండగా రాముడు ఒక్క హనుమంతునికే తన ముద్రికను సీతకు గుర్తుగా చూపమని ఇస్తాడు. తన ఆశలు తన భవిష్యత్తు లోక సంక్షేమం ఆంజనేయుని ద్వారానే జరుగుతాయని రాముడు తెలుసుకున్నాడు. సీతమ్మ కూడా తన చూడామణిని ఆంజనేయునికి ఇస్తూ హనుమా నువ్వే రాముని ఇక్కడకు తీసుకు రాగలవు. నీ సహకారంతోనే రాముడు రావణుని గెలవగలడు. నువ్వు కార్యశూరుడివి అంటుంది.







రావణాసురుణ్ణి వివాహమాడడానికి తిరస్కరించినందున ఘోర ఆకారం గల రాక్షస స్త్రీలందరూ జానకిని చుట్టుముట్టి నానా మాటలూ అని భయపెడతారు. ఇప్పుడే తినేద్దాం అంటూ వాళ్లంతా సీత మీదికి గుంపులుగా వస్తారు. అప్పుడే నిద్రలేచిన త్రిజట, మూర్ఖుల్లారా, దశరథుని కోడలూ జనకుని కుమార్తె అయిన సీతను తినడం కన్నా మీలో మీరే ఒకర్నొకరు చంపుకు తినండి.

**'త్వమస్మిన్ కార్యనిర్వోగే ప్రమాణం హరిసత్తమ హనుమన్ యత్నమాస్థాయ దుఃఖక్షయకరోభవ'**

సీతమ్మకి హనుమ అంటే అంతటి విశ్వాసం. ఇంక అన్నింటికంటే ఎక్కువగా త్రిజటా స్వప్నాన్ని గుర్తు చేసుకుంటాము. ఎవరికైనా పీడ కలగాలని భయంకరమైన దుస్వప్నంగాని వస్తే త్రిజటా స్వప్నం గుర్తు చేసుకోమంటాము. ఈ స్వపాన్ని గురించి తెలుసుకోవడం అవసరం. ఎందుకంటే పీడ కలలు రాక తప్పవు. ఈ త్రిజట వృద్ధరాక్షసి కాని, కొందరనుకున్నట్లు విభీషణుని కుమార్తె కాదు. దుస్స్వప్నాలు వస్తే భయపడేవారు త్రిజట స్వరూపాన్ని గురించి తెలుసుకోవాలి.

రావణాసురుణ్ణి వివాహమాడడానికి తిరస్కరించి నందున ఘోర ఆకారం గల రాక్షస స్త్రీలందరూ జానకిని చుట్టుముట్టి నానా మాటలూ అని భయపెడతారు. ఇప్పుడే తినేద్దాం అంటూ వాళ్లంతా సీత మీదికి గుంపులుగా వస్తారు. అప్పుడే నిద్రలేచిన త్రిజట, మూర్ఖుల్లారా, దశరథుని కోడలూ జనకుని కుమార్తె అయిన సీతను తినడం కన్నా మీలో మీరే ఒకర్నొకరు చంపుకు తినండి. నాకిప్పుడు ఒక బ్రహ్మాండమైన కలవచ్చింది తెలుసా! వినండి నా కల! రాక్షసులంతా నాశనం అయిపోతారు! లక్ష్మణునితో కూడిన రాముడు తెల్లని సుందరమైన పూలమాలలు వేసుకుని తెల్లని పట్టు బట్టలు ధరించి ఈ సముద్ర మధ్యంలో ఉన్న తెల్లని పర్వతం మీద ఉన్నట్లు నాకు స్వప్నం వచ్చింది. ఆయన రాముడని నీకు తెలుసా? నువ్వు చూశావా? అన్నారంతా, భయంతో వణుకుతూ. నేను రాముణ్ణి ఎప్పుడూ చూడలేదు. కాని ఆయన రాముడని నాకు స్థిరంగా తెలుసు. నా ఆత్మ అలా చెబుతోంది. ఈ సీతమ్మ కూడా సూర్యుని కాంతితో వెలిగిపోతూ రాముణ్ణి చేరుకుంటోంది. సీత రాముని తప్ప మరొకరి చెంతకు ఎలా వెడుతుంది? మళ్లీ రాముడు నాలుగు దంతాలున్న మహా పర్వతం లాంటి ఏనుగును ఎక్కి వస్తున్నాడు. లక్ష్మణుడు వెంట ఉన్నాడు. జానకి పర్వతం లాంటి ఆ ఏనుగును అధిరోహించింది. వీళ్లంతా ఈ లంకపైన ఆకాశంలో విహరిస్తున్నారు. ఆ తరువాత తెల్లని వృషభములు కట్టిన రథంపై ఒక మారు, తెల్లటి అశ్వాలు కట్టిన రథంపై ఒక మారు సీతారామ లక్ష్మణులు కనుపించారు. వాళ్లంతా పుష్పక విమానం ఎక్కి ఉత్తరం వైపుగా వెళ్లిపోయారు.

ఇక లంకేశ్వరుడు, శరీరమంతా నూనె కారుతూ ఎర్రటి కళ్లతో తాగుతూ కిందపడి దొర్లుతూ జీవం లేనివాని వలె కనుపించాడు. ఆ గాడిదల రథంమీద వెడుతూ కూడా మన రాజు కనిపించాడు. ఇదే దృశ్యం చాలాసార్లు కనిపించింది.

రక్తం ఓడుతున్నట్లు ఎర్రని బట్టలు కట్టుకుని చింపిరి జుట్టు విరబోసుకుని పొడుగైన కోరలతో ఉన్న గంగాళాల వంటి నోళ్లు తెరిచి గుండెలు అదిరిపోయేలాగ పెద్దగా ధ్వని చేస్తూ పిడుగులు పడుతున్నట్లు నవ్వుతూ మన రాజు రావణుణ్ణి తాడుతో కట్టేసి బరబరా ఈడ్చుకుంటూ దుర్గంధంతో ముక్కులు బద్దలైపోతుండగా ఒక పెద్ద మురికి గుంటలో పడవేస్తుంటే చుట్టూ చేరిన మన రాక్షస గుంపు వెర్రిమొర్రిగా నానా అల్లరీ చేస్తూ ఆడుతోందిట! మన రాణి మండోదరి జుట్టు విరబోసుకుని గుండెలూ నెత్తీ బాదుకుంటూ ఏడుస్తోంది. ఇంతకు ముందు వరకు సీతమ్మను చంపుతామని అల్లరి చేస్తున్న రాక్షస స్త్రీలందరూ బొమ్మల్లాగ నిలబడిపోయారు. ఇప్పుడు సీత ఏడ్చిన ఏడ్పుకు వందరెట్లు మన లంకలోని ప్రతి గృహంలోని స్త్రీలు గోలుగోలు మని ఏడుస్తారు. అని త్రిజట తన కల చెప్పేసరికి అక్కడంతా శ్మశాన నిశ్శబ్దం ఏర్పడింది. అటు తరువాత సేతువు నిర్మించి చేరి రావణ కుంభకర్ణాది వీరుల గడిమి ద్రుంచి అల విభీషణుని లంకకు అధిపుచేరి భూమి సుతగూడి సాకేతపురము నందు రాజ్యసుఖము గైకొనెను రామ విభుడు(పోతన).

యుద్ధం అయిపోయింది. నిజానికి యుద్ధ కాండలో రామాయణ కావ్యం సుఖాంతం! పధ్నాలుగు సంవత్సరాలు తమ ముద్దుబిడ్డడు రామన్న తండ్రి అడవులపాలై అష్టకష్టాలననుభవిస్తుంటే ప్రజలు దుఃఖంతో తల్లడిల్లిపోయారు. ఏ ఇంటిలో పండగగాని శుభకార్యంగాని లేదు. ఇన్నాళ్లకి రాముడు అయోధ్యా ప్రవేశం చేస్తున్నాడు. భార్యతో తమ్ముళ్లతో, వానరమిత్రులతో, బంధువులతో. ఇక వారికే కాదు, సమస్త లోకాలకూ పండుగ. భూదేవికి జవసత్వాలు వచ్చాయి. మళ్లీ సంతోషంతో ఉప్పొంగి పోయి సస్యశ్యామలమైపోయింది. రుత్వికులు వేదవేత్తలు మహాధైర్యంతో గొంతులు చించుకుని పనసలు పాడుకుంటున్నారు. గోవులు మోరలెత్తి ఆనందంతో అంబా... గంతులు వేస్తున్నాయి. ముక్కోటి దేవతలు తామే రాక్షసుల నంతం చేసినంత



**శ్లో।। 'కులీన మకులీనం వా వీరం పురుష మానినం**
**చారిత్రమేవ వ్యాఖ్యాతి శుచింవా యదివా శుచిం'**

భావం : సత్కులంలో పుట్టినా, హీన కులంలో పుట్టినా, వీరుడైనా, వీరుడిగా భావించినా, పరిశుద్ధ అపరిశుద్ధులైనా..ఎవరైనా వారి నడవడే వ్యాఖ్యానిస్తుంది.

ఆనందంతో అప్సర నాట్యాలతో ఆనందామృత సేచనాలతో మహాతృప్తులౌతున్నారు. నారద తుంబరుల కాలి యందెలు, చేత తంబురాలు నిర్విరామంగా మధర నామగానం చేస్తున్నాయి.

ఈ యుద్ధకాండాంతాన్నే వాల్మీకి మహర్షి రామాయణ కావ్యపఠన పారాయణ ఫలశృతిని విరచించారు. 'సీతాయాశ్చరితం మహత్' అని రామాయణానికి ఇంకొక పేరు. ఎందుకు రామాయణాన్ని చదవాలి? మండోదరి శోకంతో అంటుంది, రాముడు నారాయణుడే శ్రీ వత్సవక్షసుడు. శంఖ చక్రగదాధరుడు.

అటువంటి వాని భార్యను అపహరించి నీకు నువ్వే చేటు తెచ్చుకున్నావు. దేవతలను అష్టదిక్పాలకులను జయించి నీ సేవకులను చేసుకున్నావు. కానీ నీ సేవకులను నీ చెప్పుచేతలలో పెట్టుకోవలసిన నీ ఇంద్రియాలను నువ్వు జయించలేక వాటికి నువ్వు విధేయుడవై కామాతురుడవై జానకికి అపకారం చేశావు. సీతమ్మ ఎంతో ఓర్పు కలది. భూమికన్న ఓర్పు కలది. స్వయంగా లక్ష్మి. భర్త అంటే పంచ ప్రాణాలు. దిక్కులేకుండా జనశూన్యమైన వనంలో పెట్టి హింసించవు. ఆ పతివ్రత బాధ వ్యథ ఆక్రోశం ఆర్తి ఇవన్నీ నీకు శాపాలైనాయి. ఆ పతివ్రత తపస్సు చేతనే నువ్వు కాలిపోయావు. సముద్రం అవతలికి వెళ్లి నీ మృత్యువును నీవు తెచ్చుకున్నావు అని విలపిస్తుంది.

ఇలాగని సీతారాములు లక్ష్మీనారాయణు లనే బ్రహ్మ రహస్యాన్ని మండోదరి విప్పి చెప్పింది యుద్ధకాండలోనే. ఆంజనేయుడు రామనామ మహిమతోనే సముద్రాన్ని దాటి లంకలోకి ప్రవేశించి సీతను కనుగొన్నాడు. అలాగే లక్ష్మణుడు ఇంద్రజిత్తు ఒకరికి ఒకరు తగ్గకుండా సౌరాస్త్రములు ఆగ్నేయాస్త్రములు మొదలైన క్రూరాస్త్రములు ప్రయోగిస్తూ అతి భయంకరమైన యుద్ధం చేస్తున్నపుడు ఆకసం నుండి సప్తర్షులు దేవతలు యక్ష గంధర్వులూ ఉత్కంఠతో చూస్తుండగా లక్ష్మణుడు, "ఓ బాణమా! రాముడు ధర్మాతుడైతే, సత్యసంధుడైతే, పౌరుషంలో అతనిని ఎదిరించగలవాడు ఎవడూ లేనట్లయితే ఈ ఇంద్రజిత్తును చంపు" అంటాడు. ఇదే అస్త్రమంత్రం – ఆ బాణం ఆ మాట విని ఇంద్రజిత్తును చంపివేసింది. రాముడు భరతుడు ఉన్న నంది గ్రామానికి వస్తాడని తెలిసి అయోధ్య ప్రజలందరూ చుట్టుపక్కల రాజ్యాల వారు గ్రామాల వారు వెళ్లారు. భరతుడు అన్నగారికి రాజ్యాన్ని తిరిగి అప్పగించాడు. రామలక్ష్మణ జానకీ సమేతంగా తన మిత్రులైన



శ్రీరామ పట్టాభిషేకం

జాంబవతాది వానర సైన్యాధ్యక్షులు విభీషణాది రాక్షస ప్రముఖులతో అయోధ్య ప్రవేశించాడు. మొత్తం పద్నాలుగు లోకాలవారు ఆ దృశ్యాన్ని చూడటానికి కళ్లార్పకుండా పరికిస్తున్నారు. అయోధ్యవాసులు; కౌసల్యానందవర్ధనా, మహాబాహో స్వాగతం స్వాగతం అని గొంతు చించుకుని అరిచారు.

**సుషేణుడు తూర్పు సముద్రం నుంచి,**
**ఋషభుడు దక్షిణ సముద్రం నుంచి,**

గవయుడు పశ్చిమ సముద్రం నుంచి, నలుడు ఉత్తర సముద్రం నుంచి, సర్వరత్న మణమయ బంగారు కలశాలతో జలాన్ని తెచ్చారు. వసిష్ఠుడు వామదేవుడు, జాబాలి, కాశ్యపుడు, కాత్యాయనుడు సుయజుడు గౌతముడు, విజయుడు మొదలైన మహర్షులు మంత్రాలు, శాంతి వేదాలు పఠిస్తున్నారు. కన్యలు, ముత్తయిదువలు, వృద్ధులు, యోధులు, మేధావులు, అమాత్యులు సైన్య ప్రముఖులు, అత్యంత ఆశ్చర్యానందాలతో వీక్షిస్తున్నారు. స్వస్తి వాచకాలూ తూర్యనాదాలూ ధ్వనిస్తున్నాయి.

**"రామం రత్నమయే పీఠే స సీతం సంన్య వేశయత్"** వసిష్ఠుడు సీతా సమేతుడైన రాముని రత్నసింహాసనముపై కూర్చుండపెట్టాడు.

సముద్ర జలాలు, నదీ జలాలు, ఔషధీరసాలు మొదలైన పుణ్యజలాలను. కన్యలు ప్రేమ మీదుగా భక్తి ప్రపత్తులతో సీతారాములకు అభిషేకం చేశారు.

వృద్ధులకు పెద్దలకు పండితులకు పురప్రముఖులకు వస్త్రాలు, ఆభరణాలు, అశ్వాలు, గోవులు మొదలైనవి బహూకరించి సంతృప్తి పరచాడు శ్రీరామ చంద్రుడు. సుగ్రీవుడికి సూర్యకిరణాల కన్న మిన్నగా ప్రకాశించే మణిమాణిక్యాలు గల బంగారుహారాన్ని, బాహు పురులను అంగదునికి, చంద్రకిరణాల వంటి ప్రకాశం గల బంగారు ముత్యాలహారాన్ని దివ్యమైన పట్టు పుట్టములను సీతాదేవికి ఇచ్చాడు. ఈ హారాన్ని సీతమ్మ అంజనీ సుతునకు ఇచ్చింది. ఆ హారాన్ని ఆంజనేయుడు మెడలో వేసుకుని ఆనందపడ్డాడు. అలాగే మైందునికి ద్వివిదులకు విభషణునకు వారు ఏది కోరితే అది ఇచ్చి ఆనందపరిచాడు. అందరూ తృప్తిగా ఎవరి స్థలాలకు వారు వెళ్లారు.

**'రాజ్యం దశ సహస్రాని ప్రాప్యవర్షాణి రాఘవః**
**శతాశ్వమేధానాజహ్రే సదశ్వాన్ భూరిదక్షిణాన్'**

శ్రీరాముడు పదివేల సంవత్సరాలు రాజ్యాన్ని సుభిక్షంగా పరిపాలించాడు. అత్యంత విలువైన దక్షిణలు, దానాలూ ఇస్తూ నూరు అశ్వమేధ యాగాలు చేశాడు.

శుభం

– ఇదీ రామాయణం. వాల్మీకి మహర్షి ప్రవచించిన ఫలశ్రుతి.

ఇటువంటి ఘన చరిత్ర గల రామాయణం విన్నా చదివినా, రాసినా ఉత్సవాలు చేసినా పుత్రులు పౌత్రులతో ప్రజలు ఆనందంగా కలకాలం జీవిస్తారు. పంటలు బాగా పండుతాయి. రామాయణం వింటే దీర్ఘాయువు లభిస్తుంది. కష్టాలు తొలగుతాయి.

బంధుమిత్రులతో సఖ్యంగా వుంటూ సంతోషంగా ఉంటారు. విఘ్నాలు తొలగుతాయి. కుటుంబ వృద్ధి ధనధాన్య వృద్ధి కలుగుతుంది.

**'ఆయుష్యమారోగ్య కరం యశస్యం**
**సౌభ్రాతృకరం బుద్ధికరం– శుభంచ'**

రామాయణాన్ని చదవండి–చదివించండి ★

**శ్లో॥ 'దేశే దేశే కళత్రాణి దేశే దేశే చ బాంధవాః**
**తంతు దేశం న పశ్యామి యత్ర భ్రాతా సహోదరః**

**భావం :** ఏ దేశంలోనైనా భార్యలు లభించవచ్చు. ఏ దేశంలోనైనా బంధువులు లభించవచ్చు. తనతో పుట్టిన సోదరుడు మాత్రం ఏ దేశంలోనూ లభించడు





# అయోధ్యకు అక్షరార్చన.

ఉద్యమం అంటే కవులు ఉంటారు. రచనలు ఉద్యమకారులకు దిశా నిర్దేశం చేస్తాయి. ఊపునిస్తాయి. హైందవ ధర్మరక్షణకు విశ్వహిందూ పరిషత్ జరిపిన అనేక పోరాటాలలో తన కలంతో ఊతమిచ్చి స్వయంగాపాల్గొన ఉద్యమ కవి మంచన గుండేరావు. వీహెచ్‌పీ కార్యకర్తగా అయోధ్య ఉద్యమంలోను ఆయన తనదైన పాత్రను నిర్వహించారు. ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఉద్యమంలోని పలు ఘట్టాలను ఆయన గుర్తు చేసుకున్నారు.

**19**89లో పాలమూరు జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ బాధ్యత నిర్వహిస్తున్నాను. నిజానికి 1969లో కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే నేను స్వయం సేవక్‌ను. అప్పటి విశ్వహిందూ పరిషత్ ప్రాంత ప్రధాన కార్యదర్శి కె.బి. సోమయాజులు తమ పర్యటనలో భాగంగా ఓసారి మా గ్రామం జద్చర్ల వచ్చారు. ఆ తర్వాత వారు ప్రాంత స్థాయి పెద్దలను సంప్రదించి ఉంటారు. 1981లో శ్రీశైలంలో జరిగిన సంఘ ప్రాంత బైఠక్‌లో నన్ను విశ్వహిందూపరిషత్ కార్యానికి కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అదే బైఠక్‌లో నాటి ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ దీవి ద్వారకా చార్యులు, ప.పూ.బాలాసాహెబ్ ఎదుట బౌద్ధిక్‌కు ముందు వైయక్తిక్ గీత్ పాడమన్నారు. నేను 'సౌధానికి పునాది ఆధారం, సంఘానికి శాఖ వరం' అనే గీత్ (నేను రాసింది) పాడగా పరోక్షంగా వారు అభినందించినట్లు చెప్పారు. ఆ తర్వాత పరిణామ క్రమంలో విభాగ్ ధర్మప్రసార ప్రముఖ్‌గా విశ్వహిందూపరిషత్‌లో బాధ్యత అప్పగించారు. 1984లో అప్పటి మా విభాగ్ ప్రచారక్ పట్లోళ్ల రాంరెడ్డి నన్ను జద్చర్ల వదలి భాగ్యనగర్ పరిషత్ కార్యాలయంలోనే నివాసం పెట్టడానికి ప్రోత్స హించారు. అలా కేంద్ర కార్యాలయంలో ఉంటూ నా కప్పగించిన బాధ్యతలు నిర్వహిస్తున్న సందర్భంలో 1985లో ప్రాంత కార్యదర్శిగాను, 1987లో ఉమ్మడి ప్రాంతాల ప్రధాన కార్యదర్శిగానూ బాధ్యత పెరిగింది. 1984లో ఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో మొదటి ధర్మ సమ్మేళనం జరుగగా అందులో పాల్గొన్న దాదాపు 900 పైగా సాధుసంతుల సమక్షంలో అయోధ్యలోని శ్రీరామజన్మభూమిలో శ్రీరామచంద్ర భగవానుని కటకటాల నుండి ముక్తి కలిగించడమే గాక, అదే చోట భవ్యమందిర నిర్మాణం జరపాలన్న ప్రముఖ తీర్మానం ఏకగ్రీవంగా జరిగింది. ఆ క్షణంలోనే శ్రీరామ కార్యంలో పాల్గొనాలన్న తీవ్ర కాంక్ష నా మనస్సులోనూ ఏర్పడింది. ఆ తర్వాత నన్ను కలిసిన వారిలో 'జైశ్రీరామ్'తో పలకరించడం ప్రారంభించాను. అలాగే ఫోన్‌లోనూ 'హలో'కు బదులుగా 'జైశ్రీరామ్' సంబోధన ఒక విడదీయలేని భాగమైంది. హిందువులలో మానసికంగా, భారత దేశంలో సామాజికంగా వచ్చిన ఈ మార్పుతోనే అది తెచ్చిన సత్ఫలితమే జనవరి 22, 2024 మధ్యాహ్నం శ్రీరామజన్మస్థానంలో శ్రీస్వామి దివ్యమంగళ విగ్రహ ప్రాణప్రతిష్ఠ.

1983లో జరిగిన ఏకాత్మతాయజ్ఞం, 1984లో ప్రాంత స్థాయిలో జరిగిన శ్రీ సత్య రథయాత్ర హిందూ సమాజ కార్యకర్తలలో ఉద్యమస్ఫూర్తిని నింపాయి. శ్రీరామజన్మభూమి ఉద్యమానికి పూర్వరంగంగా అపారమైన సంసిద్ధతనిచ్చాయి. సంఘ కార్యంలో అప్పుడప్పుడు సందర్భాన్నిబట్టి పాటలు రాయడం అన్న నా అభిరుచి ఉద్యమం లోనూ పాటల రచనకు పురికొల్పింది. యాత్రా కాలంలో నాతోపాటు పర్యటించిన ఆప్తమిత్రుల, ప్రముఖ రచయిత హెబ్బార్ నాగేశ్వర రావు ఇచ్చిన ప్రోత్సాహం మరింత ఊతమిచ్చింది. మొదట ఉమ్మడి ప్రాంతల పరిషత్ ప్రధాన కార్యదర్శిగా, ఆ తర్వాత పశ్చిమాంధ్ర ప్రాంత కార్యదర్శిగా పనిచేస్తూ డా॥బి.రామరాజు, తూములూరి లక్ష్మీనారాయణ, కె.బి.సోమయాజులు, విశిష్ట వదాన్యులు జి.పుల్లారెడ్డి మొదలైన పెద్దల మార్గదర్శనంలో పాటల రచన కొనసాగిస్తూ శ్రీరామజన్మభూమి వివిధ యోజనల కనుగుణంగా రచనలు సాగించాను. వాటిలో కొన్ని కార్యకర్తల కంఠంలో ప్రతిధ్వనిస్తూ పలు కార్యక్రమాల్లో ఉపయోగపడుతున్నాయి. ఇదంతా దైవకృపే.

శ్రీరామప్రభువు చరణాల చెంత నా మొదటి పాట 'ధన్యత' ప్రాంతంలో సత్సంగాల, భజన మండలులలో భక్తులు పాడుకొంటున్నారు. శ్రీరామశిలా పూజను, శ్రీరామజ్యోతి, శ్రీరామ పాదుకా పూజ, ఆగ్రహించిన హిందూ హృదయం, ఎన్నాళ్లని ఈ తలవంపులు, 'ఇక తలవంచం, అన్న స్ఫూర్తి గీతాలు, శ్రీరామకరసేవ, కరసేవా ప్రబోధం



# . మంచన

అన్న ప్రబోధ గీతాలు, కరసేవకులకు వీడ్కోలు, ఉత్కంఠ ఆశావహ గీతాలు మొదలైన 30కి పైగానే కాక హిందీ నుండి అనుసరణ గీతాలూ వచ్చాయి. ఇదంతా శ్రీ రాముని దయ తప్ప మరేమీ కాదు. చాలాకాలం నాతో కలిసిమెలిసి పనిచేస్తూ ఎప్పటికప్పుడు స్ఫూర్తినిస్తూ నా వ్యాసంగానికి తోడు నిలిచిన మిత్రులు వై. రాఘవులుకి శతథః అభినందనలు.

వివిధ సందర్భాలలో నేను స్వయంగా 3,4 సార్లు శ్రీ అయోధ్యను, శ్రీరామజన్మ భూమిని దర్శించాను. గుడారంలో మాత్రమే శ్రీరాముని దర్శనం లభించింది. అడుగడుగునా పోలీసు తనిఖీలతో భక్తులెందరో బాధతో దర్శనం చేసుకున్నారు.

1990నాటి మొదటి కరసేవలో నేను నా కుమారుడు కృష్ణప్రసాద్ పాల్గొన్నా ము. అయోధ్య దారిలో రైలులో ఉండగానే పోలీసులు స్టేషన్‌లో బలవంతం గా దింపి సమీపంలోని 'మహోబా' జైలుకు పంపారు.

శ్రీరామజన్మభూమి ఉద్యమంలో భాగంగా ఒక దశలో విశ్వహిందూపరిషత్ కేంద్రం నుండి ప్రాంత విభాగాలకు ఒక సూచన వచ్చింది. ఆయా ప్రాంతాల్లోని పార్లమెంటు సభ్యులకు పరిషత్ ప్రాంత అధికారుల వ్యక్తిగతంగా కలిసి వారికి ఉద్యమ వివరాలను వివరించి, వారి నుండి ఉద్యమానికి వారి వారి సమర్థనను లేదా ఉద్యమంపై వారి అభిప్రాయాన్ని సేకరించి పంపాలని సూచన. తదనుగుణంగా పశ్చిమాంధ్ర ప్రాంతం నుండి అప్పటి ప్రాంత కార్యాధ్యక్షులైన డా॥బి.రామరాజుగారు, ప్రధాన కార్యదర్శినైన నేను ఢిల్లీకి వెళ్లి మన ప్రాంతానికి చెందిన వారిలో కొందరిని పార్లమెంటు భవనంలోను, మరికొదరిని వారి అధికార నివస గృహాలలోనూ కలిసాము.

అట్టివారిలో చాలామంది మాతో ఏకీభవిస్తూనే వ్రాతపూర్వకంగా సమ్మతి తెలపడానికి వెనుకాడారు. ఆ వరుసలో నాటి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి శ్రీ పి.వి.నరసింహారావుగారిని కలవగా డా॥ రామరాజుగారితో వారిలో పూర్వ పరిచయాలు కారణంగా స్నేహపూర్వకంగా పలకరించారు. శ్రీ రామరాజుగారు విషయాన్ని వివరించగా పివిగారు అంతా ఓపికగా విని "మాపై స్థాయిలో రాజీవ్‌గాంధీ లాంటివారున్నారు కదా! వారి అభిప్రాయాన్నే మేమూ సమర్థిస్తాము అంటూ నర్మగర్భంగా చెప్పి, తేలికగా తప్పుకొన్నారు. అయినా మీ ప్రయత్నం మంచిదే. చేస్తూ ఉండండి" అంటూ సాగనంపారు.

ఇక ఆనాటి పార్లమెంటు సభ్యులు ఎన్.జి.రంగాగారిని కలవగా 'దేశంలో పరిష్కరించాల్సినవి ఎన్నో సమస్యలు ఉండగా మీకు ఈ రామమందిరమే ముఖ్యమైనది అనిపించిందా? అంటూ దెప్పి పొడిచి పంపించేశారు.


అట్టి భయంకరమైన 500 సంవత్సరాలు గడిచిపోయాయి. రామానుగ్రహం, సాధుసంతుల ఆశీస్సులు, సంఘ, పరిషత్ ఇత్యాది శ్రీరామభక్తుల అకుంఠిత దీక్ష, పరిశ్రమ ఫలితంగా శ్రీరామచంద్రుడు తన జన్మస్థలంలో పునః సకల లాంఛనాలతో, వైభవంగా విరాజిల్లుతుండడం మనందరి అదృష్టం. ఈ పునర్వైభవ స్థితి మరింత వృద్ధి చెంది గోహత్య మొదలైన కళంకాలన్నీ రూపుమాపిపోవాలని ఆకాంక్ష.

**జై శ్రీరామ్ - భారత్‌మాతాకీ జై**




**మంచన గుండేరావు**
పూర్వ విభాగ్ సంఘచాలక్,
పాలమూరు


# ఉత్తుంగ తరంగం సృష్టిస్తాం



రామరామ రామయన్న రామచిలుక ధన్యము -
రామ ప్రేమ చూరగొన్న చిట్టి ఉడత ధన్యము.
రామకథా గాన లోల జీవనమే ధన్యము-
రామకార్య నిరతులైనవారి జన్మ ధన్యము॥

అభినందనలందుకొన్న కోతిమూక ధన్యము
ఆశీస్సులు పొందిన ఆ పక్షిజాతి ధన్యము
పాదధూళి సోకినట్టి శిల ఎంతో ధన్యము
వారధి నిలిపిన సాగర జలమెంతో ధన్యము॥
రేగుపండ్లు తినిపించిన శబరిమాత ధన్యము
నావ నడిపి దరిజేర్చిన గుహుని సేవ ధన్యము॥

కోటి కోటి హిందూ జనత
ఉత్తుంగ తరంగం సృష్టిస్తాం
శ్రీరాముని సాక్షిగా చెబుతున్నాం
ఇక మందిరమచటే నిర్మిస్తాం
నవ్యమందిరం నిర్మిస్తాం, భవ్యమందిరం నిర్మిస్తాం॥

శ్రీరామవారధి
ఎవడురా నా రామ వారధిని కూల్చంగ
ఎగనెగసి పడుతున్నవాడూ?
ఎవరితరమూ కాదు సేతువును ఛేదించ
ఎరుగరా మూఢుడా! ఆగు,
ఎరుగరా మూఢుడా ఆగు!

(నా ఉద్యమ గీతాలలో కొన్ని)

సుజాత గోపగోని, 6302164068

# బాలరాముడికి భాగ్యనగర అలంకారాలు



అయోధ్యలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం అయ్యింది. కోట్లాది మంది హిందువుల చిరకాల కోరిక నెరవేరింది. శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ వేళ.. రామభక్తుల్లో గూడు కట్టుకున్న సంతోషం పెల్లుబికింది.మందిర నిర్మాణానికి రామ జన్మభూమి ట్రస్టు ఇచ్చిన పిలుపుతో స్పందించిన భక్తులు..తోచినరీతిన సహకరించారు. ఒక ప్రాంతంలో రాములోరి విగ్రహం ప్రాణం పోసుకోగా, మరో ప్రాంతం నుంచి రాళ్లను తీసుకొచ్చారు. ఇలా ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకతగా ఉన్నాయి. అందులో భాగంగా భాగ్యనగరం పేరు కూడా అయోధ్యలో చిరస్థాయిలో నిలిచేలా ఇక్కడ పనులు జరిగాయి.

బాలరామునిగా అయోధ్యలో కొలువు దీరిన శ్రీరామచంద్రమూర్తి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా రాష్ట్రమూ పండుగ జరుపుకుంది. రామునిపై భక్తిని చాటుకునేందుకు జనం వివిధ రూపాల్లో స్పందించారు. వేల ఏళ్ల పాటు చిరస్థాయిగా నిలిచిపోయేలా అయోధ్య రామాలయ నిర్మాణంలో మన భాగ్యనగరం కూడా తన వంతు పాత్ర పోషించింది. ఆలయానికి తలుపులు ఇక్కడే తయారు చేయించారు. ఓ భక్తుడు వెండి పాదుకలు చేయించి పంపించాడు. మరో భక్తుడు భారీ లడ్డూను తయారు చేయించాడు.

సికింద్రాబాద్ బోయిన్ పల్లికి చెందిన అనురాధ టింబర్ డిపోకు ఇలాంటి నిర్మాణాల్లో ప్రత్యేక అనుభవం ఉన్నట్లు గుర్తించిన రామజన్మభూమి ట్రస్టు... తలుపులు తయారు చేసే బాధ్యతను ఆ సంస్థకు అప్పగించింది. తమిళనాడుకు చెందిన హస్త కళాకారులు కొన్ని నెలలపాటు ఈ పనుల్లో నిమగ్నమై తలుపులు తయారుచేశారు. తామర, నెమళ్లు, సంప్రదాయ భారతీయ సాంస్కృతిక చిహ్నాలతో నగారా శైలిలో వీటిని తయారు చేశారు.

గర్భగుడి తలుపులతో పాటు ప్రధాన ఆలయం చుట్టూ ఉన్న అన్ని తలుపులను సంస్థే రూపొందించింది. గర్భగుడి తలుపు 5 ఏళ్ల రాముడి విగ్రహాన్ని కలిగి ఉంటుంది. తలుపులకు మహారాష్ట్రకు చెందిన బలార్షా టేకు చెక్కను ఉపయోగించారు. తలుపు చెక్క భాగం బంగారు రేకుతో కప్పి ఉంటుంది. తలుపులు 8 అడుగుల పొడవు,12 అడుగుల వెడల్పు, ఆరు అంగుళాల మందంతో బలంగా ఉంటాయని సంస్థ డైరెక్టర్ శరత్ బాబు తెలిపారు. ఇప్పటి వరకు ఆలయం చుట్టూ 100 ఫ్రేమ్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించిన శరత్ బాబు... ఇప్పటికే 118 తలుపులు పూర్తి చేశామని, చెప్పారు. యాదాద్రి ఆలయానికి తలుపులు కూడా అనురాధ టింబర్ డిపోలోనే తయారు చేశారు.

అయోధ్యలో నూతన రామాలయ నిర్మాణం సందర్భంగా స్వామి వారికి పాదుకలను తెలంగాణ నుంచే పంపించారు. ఆలయ నిర్మాణానికి వెండి ఇటుకలు కానుకగా ఇచ్చిన చల్లా శ్రీనివాసులు శాస్త్రి, ఇప్పుడు రామునికి ఎనిమిది కిలోల వెండితో బంగారు పూతతో కూడిన వెండి పాదుకలు తయారు చేయించారు. పాదుకలపై గోమాత, రాముని జెండా, గోమాత, స్వస్తిక్, శంఖం, సూర్యుడు, ఖడ్గం చిత్రీకరించారు. వీటితో పాటు కల్పవృక్షం, మత్స్యావతారం, ధనస్సు, కలశం, అంకుశం కూడా చిత్రీకరించి ఉన్నాయి. రామలింగాచారి ఆగమ శాస్త్ర నిమయాల ప్రకారం వీటిని రూపొందించినట్లు చెప్పారు. ఇక పాదుకలపై కాలి బొటన వేలి మధ్యలో కనిపించే విధంగా ఆకుపచ్చ రాయిని కూడా అలంకరించారు. – మరో కిలో వెండితో పాదుకలకు పూత పెట్టించారు. శ్రీరామునికి విల్లు కూడా బహూకరించనున్నట్లు తెలిపారు.



**భారీ లడ్డూ ప్రసాదం**

అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి లడ్డు తయారీ అవకాశం, అదృష్టాన్ని



సికింద్రాబాద్ మారేడ్‌పల్లికి చెందిన శ్రీరామ క్యాటరింగ్ సర్వీసెస్ యజమాని నాగభూషణం రెడ్డి దక్కించుకున్నారు. 12వందల 65కిలోల బరువు గల లడ్డూను ప్రత్యేక వాహనంలో అయోధ్యకు తరలించారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి భూమి పూజ చేసిన రోజు మొదలుకొని శ్రీరామునికి ప్రాణ ప్రతిష్ట చేసే రోజు వరకు 12వందల 65రోజులు అవుతుండటంతో దానికి గుర్తుగా అదే సంఖ్యలో 12వందల 65కిలోల లడ్డూను తయారు చేశారు.ఇందుకోసం 16 మంది నాలుగు రోజుల పాటు శ్రమించారు. లడ్డూ తయారీలో 350కిలోల శనగపిండి, 7వందల కిలోల చక్కెర, 40కిలోల నెయ్యి, కుంకుమపువ్వు వినియోగించారు.

**సీతమ్మకు సిరిసిల్ల పసిడి చీర :**

చేనేతకు పేరుగాంచిన సిరిసిల్ల నుంచి సీతమ్మకు ప్రత్యేకంగా తయారు చేసిన పట్టుచీర వెళ్లింది. చేనేత కార్మికుడు వెల్ది హరిప్రసాద్ అయోధ్య

రామాలయ నిర్మాణం సందర్భంగా అమ్మవారికి పట్టుచీర గుర్తింపుగా ఇవ్వాలనుకున్నాడు. 20 రోజుల పాటు శ్రమించి రామాయణంలోని ముఖ్య ఘట్టాలు తెలిపే విధంగా చీరను నేశారు. కొంగుభాగంలో జై శ్రీరామ్ అని తెలుగు, హిందీ భాషల్లో అక్షరాలు వచ్చేలా చీరను నేశారు హరిప్రసాద్. పట్టుచీరలకు 8 గ్రాముల బంగారం, 20 గ్రాముల వెండి వినియోగించారు. చీర మొత్తం బరువు 900 గ్రాములని హరిప్రసాద్ తెలిపారు.

**రామయ్యకు ముత్యాల హారం**

హైదరాబాద్‌కు చెందిన ప్రవళ జ్యువెలర్స్ కూడా శ్రీరాముని కోసం మూడు కిలోల 600 గ్రాముల ముత్యాల హారం కానుకగా పంపింది. తొమ్మిది మంది కళాకారులు తొమ్మిది రోజులు కష్టపడి ఈ హారాన్ని తయారు చేశారు. ఈ హారం తయారు చేయడానికి ముంబై నుంచి ముత్యాలను తెప్పించారు. చూశారుగా అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా మన భాగ్యనగర్ దక్కించుకున్న ప్రత్యేక స్థానం.

**వాహనంపై అయోధ్య మందిరం**

హైదరాబాద్‌కు చెందిన సుధాకర్ (గిన్నీస్ బుక్ రికార్డు విజేత) రెండు సంవత్సరాల పాటు కష్టపడి అయోధ్య రామాలయాన్ని పోలిన ప్రత్యేక వాహనాన్ని తయారు చేశారు. ఈ కదిలే 'రామ మందిరం' తయారీలో 20 మంది కార్మికులు కష్టపడగా, వీరిలో 10 మంది ముస్లింలు ఉండటం విశేషం. సుధాకార్స్ మ్యూజియంలో పని చేస్తున్న అహ్మద్ అలీ దీని నిర్మాణంలో అన్నీ తానై పనులు చక్కబెట్టారు.

**తిరుమల నుంచి లక్ష లడ్డూలు**

అయోధ్యకు వచ్చే భక్తుల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఉచితంగా శ్రీవారి ప్రసాదాన్ని చేసింది. ఇందుకు లక్ష లడ్డూలను అయోధ్యకు పంపింది. తిరుపతి విమానాశ్రయం నుంచి ప్రత్యేక కార్గో విమానం ద్వారా ఈ లడ్డూలను తరలించింది. సోమవారం దేశమంతా రామనామంతో మారుమ్రోగనున్న వేళ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ శ్రీవారి లడ్డూ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసింది. సాధారణంగా తిరుమలలో భక్తులకు విక్రయించే లడ్డూలు 75 గ్రాములు ఉండగా.. అయోధ్య కోసం 25 గ్రాముల ఉండే లక్ష లడ్డూలను శ్రీవారి ప్రసాదంగా అందించారు.



# 'ఆంధ్ర'లో అయోధ్య సంరంభం


మంత్రాలయంలో అభయరాముడి విగ్రహం

అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో రాష్ట్రంలో పండగ వాతావరణం నెలకొంది. సోమవారం (జనవరి 22) జరిగిన ఆ కార్యక్రమాన్ని టీవీలు, ఎల్ఈడీ తెరల ద్వారా ప్రజలు తిలకించి పులకించారు. రాష్ట్రం రామనామ స్మరణతో మార్మోగిపోయింది. ఉదయం నుంచి తలంటిస్నానాలు చేసి ఇళ్లలో పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుని టీవీల ముందు కూర్చున్నారు. స్థానిక ఆలయాలు వద్ద, కూడళ్లలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లలో వేడుకలను తిలకించారు. శివ, కేశవ, శక్తి భేదాలు లేకుండా అన్ని ఆలయాలలో శ్రీరాముడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీపాలంకరణ సేవ, తులసీమాలతో పూజలు, భజనలు నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో శ్రీరామ అఖండ దివ్యజ్యోతిని వెలిగించారు. విష్ణుసహస్ర నామం, హనుమాన్ చాలీసా పఠించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. విగ్రహ ప్రతిష్ఠను తిలకించి ధన్యుల మైనట్లు భావించి చేసిన 'జై శ్రీరాం' జయజయ ధ్వానాలు మిన్నంటాయి. ఇప్పటికే పంపిణీ చేసిన మంత్రాక్షతలను తలపై జల్లుకున్నారు. దేశంలో సుసంపన్నంగా సాగుతూ రామరాజ్యం ఆవిష్కారం కావాలని ప్రజలు ఆకాంక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో 16వ తేది నుంచే శ్రీరామ, హనుమాన్ శోభాయాత్రలు నిర్వహించారు. అయోధ్యలో వేడుకను ప్రత్యక్షంగా చూసేందుకు అన్ని జిల్లాలకు చెందిన పలువురికి ఆహ్వానాలు అందాయి. వారితోపాటు ఇతరులు అనేకమంది హాజరయ్యారు. శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, చిరంజీవి, రామ్‌చరణ్‌తేజ వేడుకలకు హాజరైన ప్రముఖులలో ఉన్నారు.

ఒంటిమిట్ట సీతారామచంద్రస్వామి ఆలయం, తిరుమల సహా రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. విజయవాడ నగరం 'అయోధ్య'సంబరాలలో మునిగిపోయింది. దేవాలయాల్లో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఇస్కాన్ మందిరంలో పెద్ద ఎత్తున దీపాలు వెలిగించి 'దీపావళి'లా సంబరాలను జరుపుకున్నారు. ప్రతిష్ఠాపనోత్సవ నేపథ్యంలో కర్నూలు జిల్లా మంత్రాలయంలో తుంగభద్ర నదీతీరంలో 68 అడుగుల ఎత్తుగల అభయ రాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, హోమాలు, పూజలు నిర్వహించారు. విగ్రహం చుట్టూ శ్రీరాముడి జీవితచరిత్ర విశేషాలతో మ్యూజియం, ఉద్యానవనం నిర్మిస్తామని శ్రీఅభయరామ సేవా సమితి తెలిపింది. శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రామ చంద్రమూర్తి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అమరావతిలో హైకోర్టు ప్రాంగణంలో న్యాయ వాదుల సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**చీరాల' నుంచి రామయంత్రం**

అయోధ్య శ్రీరామ మందిరములో యంత్రమును నిక్షిప్తం చేయటం కోసం చీరాలలోని చిదంబర శాస్త్రి యంత్రమును తయారు చేయించి అందజేశారు. భాగ్యనగర సీతారామ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు చల్లా శ్రీనివాసశాస్త్రి బంగారు పూతతో తయారు చేయించిన 9 కిలోల వెండి పాదుకలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ద్రాక్షారామ, అంతర్వేది ఆలయాలలో పూజాదికాలు నిర్వహించి గత అక్టోబర్‌లోనే అయోధ్యకు చేర్చారు.

– జాగృతి డెస్క్

# ప్రాణప్రతిష్ఠకు



**అన్ని దారులు అయోధ్యవైపే. అందరి దృష్టి రాముని ప్రాణప్రతిష్ఠపైనే. ఈ రసవత్తర ఘట్టాన్ని చూసి తరించేందుకు హిందూ సమాజం దాదాపు ఐదు శతాబ్దాల పైగా నిరీక్షించింది. ఎన్నో బలిదానాలు, మరెన్నో ఆత్మార్పణల అనంతరం అయోధ్యలో రామాలయం అన్న కల సాకారమైంది. బాలరామయ్య ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని దేశం అంతా రామనామంతో మార్మోగింది. ఆలయాలు ఆధ్యాత్మికశోభను సంతరించుకున్నాయి. అయోధ్య ఆలయంలో ఆరు రోజుల పాటు విశేష కార్యక్రమాలు సాగాయి.**

ప్రాణప్రతిష్ఠ వేడుక సందర్భంగా అయోధ్య నగరం అంతా సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. విశాలమైన వీధులన్నీ కాషాయజెండాలు, ఫ్లెక్సీలు, దీపాలతో అతిథులను ఆహ్వానం పలికాయి. ఎక్కడ చూసినా జైశ్రీరామ్ అని రాసి ఉండటంతో పాటు రామభజనలు, కీర్తనలతో అయోధ్య మారుమోగింది. ఇక అయోధ్య రామాలయం అయితే సప్తవర్ణాల శోభితంగా మారింది. ఆలయాన్ని పూర్తిగా విద్యుత్ దీపాలతో, పూలతో అలంకరించారు. రాత్రి సమయాల్లో బంగారు వర్ణంతో గుడి వెలిగిపోయింది. గుడి దగ్గర కూడా పూలతో అలంకరించారు. ప్రధాన రహదారి నుంచి గుడికి వెళ్లే దారిలో పది అడుగుల ఎత్తు వరకూ పూలతో అలంకరించారు. రామునితో పాటు వివిధ చిత్రాలను, జైశ్రీరామ్ అన్న పేరును పూలతో రూపొందించారు.



**డాక్టర్ పార్థసారథి చిరువోలు**
సీనియర్ జర్నలిస్ట్

ప్రాణప్రతిష్ఠకు సంబంధించిన క్రతువులు జనవరి 16వ తేదీన ప్రారంభం అయ్యాయి. శర్కాధివాస, ఫలాధివాస,పుష్పాధివాస, మధ్యాధివాస. శయ్యాధి వాస,ఔషధీవాస, కేసరధీవాస, ఘృతదివస తదితర కార్యక్రమాలను 21వ తేదీ వరకూ నిర్వహించారు. అనంతరం మూడురోజులపాటు భక్తుల ప్రవేశాన్ని నిషేధించారు. 22వ తేదీన నిర్వహించే ప్రాణ ప్రతిష్ఠకు ఆహ్వానితులకు మాత్రమే అవకాశం కల్పించారు. అనంతరం 23వ తేదీ నుంచి భక్తులను ఆలయంలోకి అనుమతిస్తామని ట్రస్ట్ పేర్కొంది. ఇక కార్యక్రమాలను వివరంగా చెప్పుకోవాలంటే… 16వతేదీన వేదపండితులతో సర్వ ప్రాయశ్చిత్త హెూమం, దశవిధి స్నానం, 17న రామ్‌లల్లా విగ్రహంతో ఊరేగింపు, 18న గణేశ్, అంబిక, వరుణ, వాస్తు పూజలు, 19న అగ్ని స్థాపన, నవగ్రహ స్థాపన చేశారు. 20వ తేదీన సరయూనది పవిత్ర జలంతో ఆలయ గర్భగుడి సంప్రోక్షణ చేశారు. 21న జలాధివాసం అంటే యజ్ఞం అనంతరం ప్రత్యేక పూజల మధ్య అయోధ్య రాముని విగ్రహానికి 125 కలశాలతో దివ్యస్నానం చేయించారు.

ఈ మధ్యలో ప్రాణప్రతిష్ఠ జరుపుకోనున్న బాలరామయ్య రూపాన్ని తొలిసారిగా ప్రపంచానికి చూపించారు. ఐదు అడుగుల ఎత్తు ఉన్న రాముని విగ్రహానికి ప్రస్తుతం ముఖం కనిపించకుండా పసుపుగుడ్డతో కప్పి ఉంచారు. మొత్తం మూడు విగ్రహాలు తయారు చేయించగా, గర్భాలయంలో ప్రతిష్ఠిస్తున్న ఈ విగ్రహాన్ని మైసూరుకు చెందిన అరుణ్ యోగిరాజ్ మలిచారు. మిగిలిన రెండు విగ్రహాలను ఆవరణలో మరోచోట ప్రతిష్ఠిస్తారు. కేదార్‌నాథ్‌లోని శంకరాచార్య విగ్రహం, ఇండియా గేట్ దగ్గర 30 అడుగుల సుభాష్ చంద్రబోస్ చెక్కిన అనుభవం అరుణ్ యోగిరాజ్‌ది. బాలరాముని మూర్తి కోసం.. వివిధ నర్సరీ స్కూళ్లలో పిల్లల్ని నిశితంగా పరిశీలించానని, ఎంతో మానసిక శ్రమతో అందమైన రూపం ఇచ్చానని యోగిరాజ్ చెప్పుకొచ్చారు. విగ్రహానికి అవసరమైన రాయిని భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో రాయిని సేకరించామని, చివరకు ఎన్ఐఆర్ఎం శాస్త్రవేత్తలు, డిపార్టుమెంటు ఆఫ్ మైన్స్ వారి పరిశీలనలో హెచ్ డొకోటేకు చెందిన కృష్ణశిల ఎంపికయ్యిందని ఆయన వివరించారు.

ప్రాణప్రతిష్ఠకు ముందే హనుమంతుడి జన్మ స్థలంగా భావిస్తున్న కిష్కింధ నుంచి ప్రత్యేక రథం అయోధ్యకి చేరుకుంది. దాదాపు వందమంది భక్తుల బృందం రాముడి చిత్రాలు ఉన్న కాషాయజెండాలు ప్రదర్శిస్తూ, 'జై శ్రీరాం' నినాదాలు చేసుకుంటూ రథంతో పాటు ప్రయాణించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలను సందర్శించటంతో పాటు సీతమ్మ జన్మస్థలిగా చెబుతున్న నేపాల్ లోని జనక్‌పురి సైతం ఈ రథం వెళ్లింది. ప్రపంచం నలుమూలల నుంచి లక్షలాది మంది అయోధ్యకు వస్తున్న వేళ, తాము కూడా ముందుగానే ఇక్కడకు రావాలని ప్రణాళిక వేసుకున్నామని శ్రీహనుమాన్ జన్మభూమి తీర్థక్షేత్రట్రస్టు ప్రతినిధి అభిషేక్ కృష్ణశాస్త్రి తెలిపారు. అలాగే రామయ్య అత్తగారిల్లు బీహార్ లోని మిథిల జిల్లా సీతామఢీ నుంచి భారీగా కానుకలు అయోధ్యకు చేరాయి. వాటిలో ధన, ధాన్య, కనకాది వస్తువులు ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ప్రవాళపెరల్స్ సంస్థ మూడు కిలోల ముత్యాలతో స్వామికి గజమాల తయారు చేసి పంపింది. ప్రాణప్రతిష్ఠ సందర్భంగా భక్తులకు అందించటానికి వారణాసి, గుజరాత్‌లకు చెందిన స్వీటు షాపుల వారు 45 టన్నుల లడ్డూలను తయారు చేయించి పంపారు. టీటీడీ దేవస్థానం లక్షటన్నులు తయారుచేయించి పంపింది.

ఆలయం పూర్తికాకుండానే ప్రతిష్ఠ సరికాదని కొందరు ధర్మాచార్యులు అభిప్రాయపడినట్టు, అందుకే తాము హాజరుకావడంలేదన్నారనే వార్తలు వచ్చాయి. అనేకమంది ఈ కార్యక్రమానికి మద్దతుగా నిలిచారు. గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయాన్ని ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు. సాధారణంగా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ఏడుగురు గిరిజనులు పాల్గొనాలి. అందులో ముగ్గురు దానిని అనుసరిస్తున్నవాళ్లయి ఉండాలి. మొత్తం 121మంది ఆచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ట్రస్ట్ పేర్కొంది. శ్రీగణేశ్వర శాస్త్రి ద్రవిడ్‌జీ కార్యక్రమాన్ని పర్యవేక్షించటంతో పాటు, అనుష్ఠాన కార్యక్రమాలకు సంబంధించిన సూచనలు చేశారు. కాశీకి చెందిన శ్రీ లక్ష్మీకాంత్ దీక్షిత్ ప్రధాన ఆచార్యునిగా వ్యవహరించారు. భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతిలో ఎన్నో తాత్వికతలు, సిద్ధాంతాలు, విధానాలు ఉన్నాయి. వివిధ ఆచార్యులు వాటికి ప్రాతినిధ్యం వహిస్తుంటారని ఆలయ ట్రస్ట్ పేర్కొంది. 150కి పైగా మార్గాలకు చెందిన, మహామండలేశ్వరులు, మండలేశ్వరులు, శ్రీ మహంతలు, మహంతలు, నాగాలు, సాధువులు, గృహస్థులు, తత్త్వవాసీలు, ద్వీపవాసీలు గిరిజన సాంప్రదాయాల వారు ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించేందుకు విచ్చేస్తున్నట్టు వివరించింది.

**ఆలయ నిర్మాణంలో హైదరాబాద్ ఘనత**

అయోధ్య ఆలయనిర్మాణంలో హైదరాబాద్ తన వంతు పాత్రను పోషించింది. 2,500 ఏళ్లకు ఒకసారి తలెత్తే తీవ్ర భూకంపాలను కూడా తట్టుకునేంత పటిష్ఠంగా ఆలయ నిర్మాణం చేపట్టారు. ఇందుకు అవసరమైన పరీక్షలను అధికారులు రూపొందించి పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి హైదరాబాద్ పాత బస్తీకి చెందిన ఇంజనీర్ ప్రదీప్ కుమార్ నాయకత్వం వహించారు. రూర్కీలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చికి చెందిన సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ డైరక్టర్ హోదాలో, ఆలయంలో 3డీ స్ట్రక్చరల్ ఎనాలసిస్, సీస్మిక్ రీసిలియన్స్ పరీక్షలు చేపట్టారు. సంస్థ పూర్వ డైరక్టర్ గోపాలకృష్ణన్ కూడా ఇందుకు తన వంతు సహాయసహకారాలను అందించారు. అత్యున్నత సాంకేతికతను ఉపయోగించి, శ్రీరామనవమి రోజున మధ్యాహ్నం 12గంటలకు రాముని విగ్రహం పైన నేరుగా సూర్యకిరణాలు పడేలా ఏర్పాటు చేస్తున్నారు.



# ముందు...

ఆరు నిముషాలపాటు ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమై భక్తులకు కనువిందు చేయనుంది. 'సూర్య తిలకం'గా దీనిని పిలుస్తారు. శిఖరం సమీపాన మూడో అంతస్తులో పడిన సూర్యకిరణాలను గర్భగృహాలకు తెచ్చేందుకు వీలుగా సూర్య గమనాన్ని ఆధారంగా చేసుకుని గేర్ బాక్సులను, రిఫ్లెక్టివ్ మిర్రర్‌లను ఉపయోగిస్తున్నారు.

హైదరాబాద్‌కు చెందిన అనురాధ టింబర్ డిపో 118 చెక్క ద్వారాలను రూపొందించింది. ఒక్క మేకు, బందు కూడా ఉపయోగించకుండా దీనిని తయారు చేసింది. బలార్షా టేకును ఉపయోగించామని చదలవాడ శరత్ బాబు తెలిపారు.

**నేపథ్యం...**

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య పట్టణంలో వివాదాస్పదంగా మారిన 2.77 ఎకరాల స్థలాన్ని హిందువులకు రామాలయనిర్మాణానికి అందించవలసిందిగా, సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పును అందించటంతో రామాలయనిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది. ఆలయ నిర్మాణానికి 2021లో నిధి సమర్పణ అభియాన్ పేరుతో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆర్.ఎస్.ఎస్. ప్రారంభించింది. లక్షా 50వేల మంది విశ్వహిందూపరిషత్ కార్యక్రమాలలో పాల్గొన్నారు. నాటి రాష్ట్రపతి కోవింద్ తన నెల జీతం అందించటంతో జనవరి 2021లో విరాళాల సేకరణ ప్రారంభమైంది. ప్రజల విరాళాలలో 3వేల కోట్లు – రూపాయలలో వచ్చిన విరాళాలే. ఇప్పుడు తాజాగా విదేశీ కరెన్సీ పొందేందుకు వీలుగా ఎఫ్‌సిఆర్‌ఐకు ట్రస్ట్ దరఖాస్తు చేసుకుంది

రామమందిరం నిర్మాణానికి 1988లోనే అహ్మదాబాద్‌కు చెందిన సోంపుర కుటుంబం సిద్ధమైంది. 2020లో వాస్తు, శిల్ప శాస్త్రాలకు అనుగుణంగా ఇందులో మార్పులు చేర్పులుసాగాయి. గత 15 తరాలుగా సోంపుర కుటుంబానికి ఆలయ నిర్మాణాలుచేపట్టిన విశేషమైన అనుభవం ఉంది. సోమనాథ్ ఆలయాన్ని కూడా ఈ కుటుంబమే నిర్మించింది.

మొత్తం 71 ఎకరాల విస్తీర్ణంలో, ఆరు భాగాలుగా ఆలయ నిర్మాణం సాగింది. గర్భగుడి సహా ఇందులో ఐదు పెవిలియన్లు ఉంటాయి. గన్ మండపం, రంగ మండపం, నృత్యమండపం, కీర్తన మండపం, ప్రధాన మండపం అని వీటికి పేర్లు పెట్టారు.

- రామాలయం కాంప్లెక్స్ నిర్మాణం మూడు అంతస్తుల్లో, ఒక్కో అంతస్థు 20 అడుగుల వంతున సాంప్రదాయ నగర పద్ధతిలో సాగింది.
- ఆలయం 380 అడుగుల పొడువు, 250 అడుగుల వెడల్పు, 161 అడుగుల ఎత్తులో ఉంటుంది. 392 పిల్లర్లు, 44 గేట్లు ఉంటాయి. ఎక్కడా ఇనుమును ఉపయోగించలేదు.
- ఆలయంలోకి ప్రవేశం తూర్పు వైపు నుంచి ఉంటుంది. సింహద్వారం నుంచి 32 మెట్లు ఎక్కి ఆలయంలోకి ప్రవేశించాలి. రాజస్థాన్ పింక్ స్టోన్ తో నగర విధానంలో సింహద్వారం లేదా లయన్ గేట్‌ను నిర్మించారు.
- రామమందిర్ కాంప్లెక్సులో మహర్షి వాల్మీకి, మహర్షి వశిష్ఠ, మహర్షి విశ్వామిత్ర, మహర్షి అగస్త్య, నిషాద్ రాజ్, మాతా శబరి, దేవి అహల్య మందిరాలను నిర్మించాలని సంకల్పించారు.
- ఆలయ నాలుగు మూలలా నాలుగు గుళ్లు నిర్మిస్తారు. సూర్యదేవుడు, దేవిభాగవతి, భగవాన్ శివ, ఆలయాలను నిర్మిస్తున్నారు. ఉత్తర దిశలో మాతా అన్నపూర్ణ, దక్షిణ దిశలో ఆంజనేయ స్వామి ఆలయాలు ఉంటాయి.
- రాజస్థాన్ రాష్ట్రం భరత్‌పూర్ జిల్లా బన్సా పహార్‌పురలోని రాజస్థాన్ శాండ్ స్టోన్‌తో ఆలయ నిర్మాణం చేపట్టారు. చెక్కడం, కట్టడం పనులను అయోధ్యలోని ఆలయ నిర్మాణ ప్రాంగణంతో పాటు రాజస్థాన్ లోని వర్క్ షాపుల్లో చేపట్టారు.
- ఈ నిర్మాణ పనులను బెంగుళూరుకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం), ఆర్కిటెక్ట్ సి.బి.సోంపుర, లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ), టాటా కన్సల్టింగ్ ఇంజనీర్స్ (టీసీఈ) పర్యవేక్షిస్తున్నారు.

**యువత సాహసం**


రామమందిరాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఎంతోమంది యువత సాహసయాత్రలు చేపట్టారు. బీహార్‌కు చెందిన నితీష్ కుమార్ అనే యువకుడు 615 కి.మీ. సైకిల్ తొక్కి రామజన్మభూమిపై కాలుమోపారు. వారణాసికి చెందిన సోనీ చౌరాసియా 228 కి.మీ. స్కేటింగ్ చేస్తూ అయోధ్య బయలుదేరింది. 124 గంటల మారథాన్ నృత్యంతో గిన్నీస్ రికార్డు సాధించిన ఈమెను ట్రస్ట్ ప్రత్యేకంగా ఆహ్వానించింది. ముంబయ్‌కు చెందిన షబ్నం షేక్ అనే యువతి అయోధ్యకు 1400కి.మీ. పాద యాత్ర చేపట్టింది. ఈమె రోజుకు 60 కి.మీ. నడుస్తోంది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇంకా చెప్పుకోదగ్గవి చాలానే ఉన్నాయి. ★



## వనవాసంతో మనవాసం వరకు...

రావణ
పతనానికి కారణం
సముద్రమంత
అతని అహంకారమే.!
రాముని
విజయానికి కారణం
గంగా నదియంత
అతని ఆత్మవిశ్వాసమే.!
మానవులకు ఆదర్శం
సకల సుగుణాలరాశులు
సీతారాములు.!!
వనవాసంతో
మనవాసం వరకు
సాగినదే
రామాయణం.!!

– కమలేకర్ శ్యామ్‌ప్రసాద్‌రావు



## అనుబంధానికి 'సేతువు' నిర్మించావు

తిన్న కొద్దీ రుచి – విన్న కొద్దీ శుచీ
అందించేదే రామనామం.
పతిత పావన రామా... శ్రితజన పాలక రామా
నిన్ను మించిన నీ నామం –
మమ్మల్ని చేర్చును స్వర్గధామం.
పాపాలను హరియించి
ఇహపర సౌఖ్యాల్ని అందించే గానమే – నీ చరితం
రా..మ....రెండే అక్షరాలు అయినా
కష్టనష్టాలను తొలగించే సులభ సాధనం.
నవవిధ భక్తిమార్గాల పరమార్థాన్ని
మనిషికి తెలియజేసేందుకు
మనవావతారంగా మహిలో చూపావు.
మహిమల్ని కాకుండా మానవత్వాన్ని చాటి
మానవులకు హితమార్గాన్ని అందించావు.
వానర, పక్షి, జంతువులకి
మనుషులకు మధ్య
అనుబంధానికి 'సేతువు' నిర్మించావు.
'అగ్నిపరీక్ష' మర్మాన్ని లోకధర్మాన్ని విశదీకరించావు...
ఒకే మాట... ఒకటే బాణం... ఒకే సతి అనే
పావన జీవితంతో...
మహనీయ 'ఆది కావ్యాని'కి అధినాయకుడవే అయ్యావు.
నీ గురించీ ఎంత చెప్పినా తక్కువే
యుగయుగాలకి ఆదర్శం నీవే ...

– తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

# భక్తులపై పుష్పవృష్టి



ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో సింహ భాగం సాధుసంతులకే ఇచ్చారు.. ఆలయం ముందు ఏర్పాటు చేసిన ప్రదేశంలో కాషాయ దుస్తులతో ఒక సముద్రంలా కనిపించారు. ముహూర్తానికి ఆహూతులందరి మీద పూలవర్షం కురిపించారు. శ్రామికులపై మోదీ పూలు చల్లారు..










# అయోధ్య రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ సందర్భంగా


భాగ్యనగర్, డిడి కాలనీలో జరిగిన కార్యక్రమంలో క్షేత్ర ప్రచారక్ ప్రముఖ్ భాస్కర్, భాగ్ సంఘచాలక్ డా॥ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.


హన్మకొండ, రెడ్డికాలనిలో రామభక్తులు ఘనంగా నిర్వహించారు.


ఇందూరులో జరిగిన కరసేవకుల సమ్మేళనంలో జిల్లా సంఘచాలక్ కాపర్తి గురుచరణం, అతిథిగా హైకోర్టు న్యాయవాది సరళా మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.


నాగర్ కర్నూలు జిల్లా ఖానాపూర్ గ్రామంలో కరసేవకులకు సన్మానం.


శ్రీ సత్యసాయి జిల్లా, ధర్మవరం, రాంనగర్‌లో కరసేవకులకు సన్మానం


మదనపల్లిలో 'కరసేవకుల సన్మాన సభ'. ఇందులో కరసేవకులతోపాటు కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.


పల్నాడు జిల్లా అయోధ్య శ్రీరామప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న అశేష జనం.


పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో.

# తెలుగు రాష్ట్రాలలో వేడుకల దృశ్యమాలిక



నర్సాపూర్ బస్టాండ్ ప్రసన్నంజనేయ స్వామి దేవాలయంలో కార్యక్రమం రామనామ సంకీర్తనలతో మారుమ్రోగింది.



విజయవాడ రూరల్ మండలం, నున్న గ్రామంలో ఉన్న పది దేవాలయాల పరిధిలోని అన్ని కుటుంబాలు ఒకే వేదికగా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా సహ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.



నెల్లూరులో శోభాయాత్ర



కామారెడ్డిజిల్లా బాన్సువాడలో శోభాయాత్ర.



బాపట్ల మండలంలోని అడవి పంచాయతీ ఆదర్శనగర్‌లో ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కోలాటం, శోభాయాత్ర.



కడప జిల్లా, చెన్నూరు బెస్తకాలనీలోని రామాలయంలో పూజా కార్యక్రమాలు.

# అయోధ్యపై ప్రత్యేక సంచి



ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జాగృతి వెలువరించిన ప్రత్యేక సంచిక (15-21 జనవరి) 'జగదానందకారకా..'కు తెలుగు రాష్ట్రాలలో విశేష స్పందన లభించింది. రామాలయ సాధన కోసం జరిగిన పోరాటాలు, రాముని వ్యక్తిత్వం, మహనీయుల ఇంటర్వ్యూలతో కూడిన ఈ సంచికను పలు జిల్లాలలో ఆవిష్కరించారు.. మొత్తం 25 లక్షల మంది పాఠకులకు చేరింది.




ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ (రాజమహేంద్రవరం)




మంత్రాలయంలో ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామి




భైంసా(మహిషా)




కడప




కోరుట్ల



బోయిన్‌పల్లి, సికింద్రాబాద్



సూర్యపేట




గద్వాల్

# క 'జగదానందకారకా..' ఆవిష్కరణలు



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న అహోబిలం మఠాధిపతి
శ్రీశ్రీశ్రీ శఠకోప శ్రీరంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామీజీ



వరంగల్



తిమ్మాపూర్, కరినగర్ జిల్లా



జగదేవ్‌పూర్, సిద్దిపేట జిల్లా



భువనగిరి



నెల్లూరు



మచిలీపట్నం



సోంపేట

# వారఫలాలు

29 జనవరి- 04 ఫిబ్రవరి 2024



సింహంభట్ల సుబ్బారావు
6300674054



**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆదాయం గతంతో పోలిస్తే మెరుగుపడు తుంది. వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులకు ఆశించిన లాభాలు. ఉద్యోగులకు ఉన్నతపోస్టులు దక్కుతాయి. రాజకీయవేత్తలకు సంతోషకరమైన సమాచారం. రచయితలు, క్రీడాకారుల యత్నాలు సఫలం. 29,30 తేదీల్లో ఖర్చులు. మానసిక ఆందోళన. స్వల్ప అనారోగ్యం. ఆవు పాల పొంగలిని..........నివేదించండి.



**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ప్రారంభంలో కొద్దిపాటి చికాకులు. కార్యక్రమాలలో జాప్యం. ఆర్థికపరమైన సమస్యలు తీరతాయి. విద్యార్థులు, నిరుద్యోగులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. వాహనయోగం. వ్యాపారులకు చికాకులు తొలగుతాయి. ఉద్యోగులకు ఊరట కలిగించే సమాచారం. పారిశ్రామికవేత్తలకు సన్మానాలు. క్రీడాకారులు, వైద్యుల కృషి ఫలిస్తుంది. 30,31 తేదీల్లో ధనవ్యయం. అనారోగ్యం. ఆవునేతితో గణేశుని వద్ద దీపం వెలిగించండి.



**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

కొన్ని కార్యక్రమాలను నిదానంగా పూర్తి చేస్తారు. సేవాభావంతో అందర్నీ మెప్పిస్తారు. సమాజంలో గౌరవమర్యాదలు పొందుతారు. వాహనాలు కొంటారు. ఉద్యోగులకు హోదాలు పెరిగే అవకాశాలు. కళాకారులు పోగొట్టుకున్న అవకాశాలు తిరిగి పొందుతారు. వ్యవసాయదారులు, అంచనాలు ఫలిస్తాయి. 31,1 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. దేవీస్తోత్రాలు పఠించండి.



**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆదాయానికి కొంత ఇబ్బంది తప్పదు. కార్యక్రమాలలో అవాంతరాలు ఎదురవుతాయి. ఇంటాబయటా బాధ్యతలు పెరుగుతాయి. కుటుంబ సమస్యలు వేధిస్తాయి. అనుకోని ఖర్చులు. వ్యాపారస్తులు కొంతవరకూ లాభపడతారు. ఉద్యోగస్తులకు విధులు సమస్యలు తప్పవు. పారిశ్రామికవేత్తలు విదేశీ పర్యటనలు రద్దు చేసుకుంటారు. క్రీడాకారులు, రచయితలకు ఒత్తిడులు. 2,3 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.



**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కార్యక్రమాలల్లో విజయం సాధిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. రావలసిన డబ్బు అంది అవసరాలు తీరతాయి. పోటీపరీక్షల్లో విజయం. వ్యాపారులకు విస్తరణ యత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగులకు ఉన్నతస్థితి దక్కుతుంది. పారిశ్రామికవేత్తలకు అవకాశాలు పెరుగుతాయి. వైద్యులు, సాంకేతిక నిపుణులకు అనుకూల పరిస్థితి. 3,4 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో ఒత్తిడులు. గణేశాష్టకం పఠించండి.



**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఎటువంటి సమస్యనైనా అవలీలగా పరిష్కరించు కుంటారు. చిరకాల మిత్రుల నుంచి ముఖ్య సమాచారం అందుతుంది. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులకు లావాదేవీలు పుంజు కుంటాయి. ఉద్యోగులకు చిక్కులు తొలగుతాయి. వైద్యులు, వ్యవసాయదారులకు నూతనోత్సాహం. 29, 30 తేదీలలో ఖర్చులు తప్పవు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.



**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

రుణబాధలు తొలగి ఊరట లభిస్తుంది. పనులు అనుకున్నవిధంగాసాగుతాయి. బంధువులతో వివాదాలు సర్దుబాటు కాగలవు. ఆస్తి వివాదాలు తీరి ఉపశమనం. శుభకార్యాలకు డబ్బు వెచ్చిస్తారు. ప్రత్యర్థులు స్నేహితులుగా మారతారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు సమకూరతాయి. రాజకీయవేత్తలకు ఊహించని ఆహ్వానాలు. 3,4తేదీల్లో కుటుంబంలో చికాకులు. కనకధారాస్తోత్రాలు పఠించండి.



**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

కార్యశూరులై అనుకున్న పనులు పూర్తి చేస్తారు. స్వచ్ఛంద కార్యక్రమాలలో పాలుపంచుకుంటారు. తీర్థయాత్రలు చేస్తారు. వాహనాలు, భూములు కొంటారు. వ్యాపారులకు విస్తరణ యత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగులకు ఉన్నతస్థితి దక్కుతుంది. రాజకీయవేత్తల కృషి ఫలిస్తుంది. రచయితలు, సాంకేతిక నిపుణులకు ఉత్సాహం పెరుగుతుంది. 2,3 తేదీలల్లో అనారోగ్యం. ధనవ్యయం. గణేశాష్టకం పఠించండి.



**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

అదనపు రాబడి దక్కి ఉత్సాహంగా గడుపుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆప్తులు నుంచి ముఖ్య సమాచారం అందుతుంది. నిరుద్యోగులకు శుభవార్తలు. వ్యాపారులు అనుకున్నది సాధిస్తారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి మెప్పు పొందుతారు. వ్యవసాయదారులు, వైద్యులు కొంత ఊరట చెందుతారు. 30,31 తేదీల్లో ఖర్చులు. కుటుంబసమస్యలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.



**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఆత్మ విశ్వాసం, పట్టుదలతో అధిగమిస్తారు. దూరపు బంధువులను కలుసుకుంటారు. విద్యార్థుల సత్తా చాటుకునేందుకు తగిన సమయం. వ్యాపారస్తులు సంస్థలను కొంతమేర విస్తరిస్తారు. ఉద్యోగులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. రచయితలు, సాంకేతిక నిపుణులు సత్తా చాటుకుంటారు. 31,1 తేదీలలో మానసిక అశాంతి. ఆరోగ్య సమస్యలు. ఆంజనేయ దండకం పఠించండి.



**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

కార్యక్రమాలు కొంత నెమ్మదించినా పూర్తి కాగలవు. ఆర్థిక విషయాలు సంతృప్తికరంగా ఉంటాయి. సన్నిహితులతో ఉత్సాహంగా గడుపుతారు. వాహనయోగం. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారులు పెట్టుబడులు సమకూర్చుకుంటారు. ఉద్యోగులకు సరైన గుర్తింపురాగలదు. వైద్యుల సేవలకు గుర్తింపు. 1,2 తేదీల్లో వృథా ఖర్చులు. స్నేహితులతో వివాదాలు. అనారోగ్యం. శివపంచాక్షరి పఠించండి.



**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ముఖ్యమైన కార్యక్రమాలు సజావుగా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి. విద్యార్థులకు నూతనోత్సాహం. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులు కొత్త భాగస్వాములతో ఒప్పందాలు చేసుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో అనుకూల వాతావరణం. రాజకీయవేత్తలకు శుభవార్తలు. క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలకు కొత్త ఆశలు. 2,3 తేదీల్లో శ్రమ తప్పదు. అనారోగ్యం. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

# పదరసం-449

## ఆధారాలు

**అడ్డం**

1) అనుమానం .... అంటారు (4)
3) .....ధూర్తలక్షణం అని సామెత (5)
7) ఈ సమాజంలో ఎలా నెట్టుకుని జీవించాలో తెలిసినవాణ్ణి ఇలా అంటారు (8)
10) తిరగబడ్డ తరంగం (2)
11) ఒక శృంగార నాయిక (6)
15) ఆకు రసం (3)
17) శ్రీరాముని జన్మభూమి (3)
20) నవ్వులాట, ఎగతాళి (4)
22) ఒక రాష్ట్ర రాజధాని (7)
25) అల్లసానివారి అల్లిక .... అని ప్రసిద్ధి (4)

**నిలువు**

1) ఏ వ్యాపారానికైనా ఇది కావాలి (4)
2) అవతారిక, ఉపోద్ఘాతం (3)
4) సమర్థుడు, జ్ఞాని (3)
5) అసలే గందరగోళం, ఆపై తలక్రిందులైంది (4)
6) అంతులేని దావానలం (2)
8) పొరపాటున, తెలియక (3)
9) అలవాటు, రివాజు (3)
12) పైకొచ్చిన మొగలి పనస, తెలుగులో పైనాపిల్ (3)
13) స్నేహపూర్వక సంధి, ఒప్పందం (3)
14) ఇష్టం లేకపోవడం, ఒప్పుకోకపోవడం (4)
16) సమస్యకి పరిష్కారంగా ఒకరికిచ్చే మాట సాయం (3)
18) ఆమడ (3)
19) బంగారం (4)
21) ఒక సువాసన గల పూవు (3)
23) ఇది లేకపోతే దేన్నీ తినలేము (2)
24) గంప

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | | 4 | | 5 |
| | ■ | | ■ | 6 | ■ | ■ | | ■ | |
| 7 | | | 8 | | | 9 | | ■ | |
| | ■ | ■ | | ■ | ■ | | ■ | 10 | |
| ■ | 11 | 12 | | 13 | | | ■ | ■ | ■ |
| 14 | ■ | | ■ | | ■ | ■ | 15 | 16 | |
| | ■ | 17 | 18 | | ■ | 19 | ■ | | ■ |
| | ■ | ■ | | ■ | ■ | 20 | | | 21 |
| 22 | 23 | | | 24 | | | ■ | ■ | |
| ■ | | ■ | ■ | | ■ | 25 | | | |

## పదరసం - 445సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| సా[1] | ల | భం[2] | జి | క[3] | ■ | టే[4] | ■ | పం[5] | చే[6] |
| మ | ■ | డా | ■ | ను[7] | అ | రం | స్వా[8] | ■ | లి |
| వే[9] | గి | రం | ■ | స | ■ | ■ | మి[10] | సి | మి |
| దం | ■ | ■ | సు[11] | న్న | ■ | ■ | వి | ■ | డి |
| ■ | గో[12] | ■ | ■ | లు[13] | కో[14] | డు | వే | ■ | ■ |
| డు[15] | రు | బు | తుం[16] | ■ | టే | ■ | కా[17] | పీ | నం[18] |
| ■ | ము | ■ | గ[19] | త[20] | రు | ■ | నం | ■ | గి |
| గ[21] | ద్ద | రి | ■ | క్కె | ■ | అ[22] | ద | ను[23] | ■ |
| ■ | లు | ■ | కొం[24] | డ | వీ | టి | ■ | ల[25] | క్ష్యం |
| ఢీ[26] | ■ | తే[27] | గ | ■ | ■ | క | ■ | క | ■ |

# కొత్త రామాలయ శోభ




అయోధ్య ఆలయం ఇప్పుడు ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న కట్టడం. నాగరి శైలిలో సంప్రదాయ, ఆధునిక శైలులను మేళవించి నిర్మించారు. స్థపతి సోంపుర పర్యవేక్షణలో అద్భుతంగా నిర్మించారు. వేయేళ్ల పాటు నిలిచి ఉండే కట్టడమిది.




















కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి జనవరి 21న అయోధ్య ఆలయాన్ని సందర్శించినప్పటి చిత్రం.

ప్రాణప్రతిష్ఠవేళ బాలరాముడికి పట్టువస్త్రాలతో ప్రధాని మోదీ వచ్చినప్పటి చిత్రం.

(కింద ఫొటో) బాల రాముడికి సాష్టాంగ ప్రణామం..

(కుడిపక్క) ఢిల్లీలో రామజ్యోతిని వెలిగిస్తూ..





From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 12

